వార్త

ఆదివారం

10 నవంబరు, 2024



# డ్రోన్ కొంచెం..
# 'మోత' ఘనం!



# వెంకటేశ్ కొత్త సినిమా

# 'సంక్రాంతికి వస్తున్నాం'



సక్సెస్‌ఫుల్ జోడీగా పేరున్న హీరో వెంకటేశ్, అనిల్ రావిపూడి కలయికలో రాబోతున్న తాజా చిత్రానికి 'సంక్రాంతికి వస్తున్నాం' అనే టైటిల్‌ని ఖరారు చేశారు. ఇంతకు ముందు వీరి కాంబినేషన్‌లో 'ఎఫ్2', 'ఎఫ్3' చిత్రాలు రూపొందించిన సంగతి తెలిసిందే. తాజాగా ఈ కాంబినేషన్‌లో తెరకెక్కుతోన్న ఈ సినిమాకి దిల్ రాజు నిర్మాత. క్రైమ్ కామెడీ డ్రామాగా రూపొందుతోన్న ఈ చిత్రంలో వెంకటేశ్ జోడీగా ఐశ్వర్య రాజేశ్, మీనాక్షి చౌదరిలు నటిస్తున్నారు. చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ చిత్రం ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులను జరుపుకుంటోంది. భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్న ఈ సినిమాకి సమీర్ రెడ్డి ఫొటోగ్రఫీని అందిస్తున్నారు.

## తారాతీరం



# కనగరాజ్ దర్శకత్వంలో నాని?

యంగ్ డైరెక్టర్ లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో వచ్చిన 'ఖైదీ', 'విక్రమ్' సినిమాలు అద్భుత విజయాలు సాధించాయి. ప్రస్తుతం కనగరాజ్ తెరకెక్కిస్తోన్న 'కూలీ' చిత్రంపై భారీ అంచనాలు ఉన్నాయి. మొత్తానికి లోకేశ్ కనగరాజ్‌కి యాక్షన్ డైరెక్టర్‌గా దక్షిణాదిలో ఫుల్ క్రేజ్ ఉంది. లోకేశ్ కనగరాజ్, ఎన్టీఆర్ కోసం ఓ సినిమా ప్లాన్ చేస్తున్నట్లు వినిపించింది. కానీ అవి నిజం కాలేదు కానీ తాజాగా హీరో నానితో ఓ సినిమా ప్లాన్ చేస్తున్నాడని వార్తలు వస్తున్నాయి. లోకేశ్ కనగరాజ్ సినిమాటిక్ యూనివర్స్ (ఎల్‌సీయూ)కి ఫుల్ క్రేజ్ ఉంది. 'ఖైదీ', 'విక్రమ్', 'లియో'తో లోకేశ్ సినిమాటిక్ యూనివర్స్ మొదలైంది. పైగా 'కూలీ' పూర్తి చేసిన తర్వాత ఎల్‌సీయూలోని హీరోలందరితో పీక్ ఎల్‌సీయూ సినిమా చేయబోతున్నాను' అని చెప్పారు. ఈ చిత్రంలో నానికి ఓ పాత్రను ఇస్తాడో, లేక ప్రత్యేకంగా నానితో ఓ సినిమా చేస్తాడో చూడాలి మరి. అయితే ఇంతవరకు ఈ వార్తపై అధికారిక ప్రకటన ఏదీ రాలేదు.

ఆదివారం వార్త

10 నవంబరు, 2024

## మంచి ముత్యాలు

నీ బాధలకు కారణం ఏదైనా కావచ్చు, ఎవరైనా కావచ్చు. కాని నీ బాధానివృత్తి కోసం ఇతరులకు హాని తలపెట్టకు.

- బుద్ధుడు

## విషయ విశేషం

క్షమాగుణం ఆరోగ్యదాయకం..... 4

'సంఘీ'భావం....5

ఆందోళన కలిగిస్తున్న రోడ్డు ప్రమాదాలు

కవర్ స్టోరీ..6

డ్రోన్ కొంచెం..
'మోత' ఘనం!

శుక్రయానానికి సన్నాహం...10

ఈవారం కవిత్వం..12

అక్షర దావాం

సౌదీ అరేబియా వారసత్వ సంపద..14

పలు ఉపయోగాల వెనిగర్....18

కథ.. 20

నిర్ణయం

సాహిత్యం.. 24

సాహితీ విపంచి..శ్రీశ్రీ

'పిశాచ స్థలాలు' అంటే?... 25

'అభిజ్ఞ' అంటే?...27

ప్రాణమే బ్రహ్మ..29

ఇంకా..

పుస్తక సమీక్ష

మొగ్గ

వారఫలం


వగైరా..వగైరా..

## తాజా వార్తలు

### ఎక్సర్‌సైజ్ మాత్ర వచ్చేసింది



కష్టపడకుండా కూర్చుంటే ఒంట్లో కొవ్వు కరగదు. వ్యాయామం చేయాలీ, చక్కని ఆహార నియమాలుపాటించాలని చెబుతారు. ఇంత చేసినా అనుకున్నట్టుగా బరువు తగ్గడమూ కష్టమేనని వింటున్న మనలో నిరాశ కలుగుతుంది. ఇలా వినడాలూ, ప్రయత్నించడాలూ అవసరం లేకుండానే ఓ వ్యాయామ మాత్ర వచ్చిందిప్పుడు. ఔను..ఆహారానికి ప్రత్యామ్నాయంగా కొన్ని మాత్రలు వచ్చినట్టు..ఇప్పుడు వ్యాయామం అవసరం లేకుండా అదేస్థాయి ఫలితాన్ని అందించే బిళ్లని కనిపెట్టారు శాస్త్రవేత్తలు. పది కిలోమీటర్లు పరుగుపెడితే ఎంత ప్రయోజనం అందుతుందో అంత లాభం వస్తుందట ఈ మాత్రతో. లేక్ అనే ఈ మందుబిళ్లని డెన్మార్క్‌లోని ఆరూస్ యూనివర్సిటీ పరిశోధకులు ఆవిష్కరించారు. మనం బాగా వ్యాయామం చేసినప్పుడు శరీరంలో లాక్టేట్, కీటోన్స్ ఏర్పడి, అవి ఆకలిని ప్రేరేపించే హార్మోన్లని నియంత్రిస్తాయి. ఈ లేక్ మాత్ర ఆ పరిణామాన్నే శరీరంలో కృత్రిమంగా కల్పిస్తుంది. అందుకే లాక్టేట్, కీటోన్సలోని తొలి అక్షరాలని తీసుకుని ఈ మాత్రకి లేక్ అని పేరు పెట్టారు. అన్నట్టు..ఈ మాత్ర వ్యాయామం చేయగలిగి ఉండీ చేయలేని వారి కోసం కాదు. నరాలూ, గుండె జబ్బులూ, మెదడు సంబంధిత వ్యాధులతో బాధపడుతూ వ్యాయామాలు చేయలేనివారి కోసమని చెబుతున్నారు శాస్త్రవేత్తలు.




మీ రచనల్ని ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు. sunmagvaartha@gmail.com



**విజయ్‌కి ఆఫీసులో సతాయింపు ఎక్కువైంది. పని ఒత్తిడితో ఇంటికీ ఆలస్యంగా వెళుతున్నాడు. ఇంట్లోనూ పరిస్థితులు అననుకూలం. అయినా అతను ప్రశాంతంగానే కనపడుతుంటాడు. ఎలా సాధ్యం? క్షమించేసి ఊరుకోవడం అందరికీ, అన్ని సందర్భాల్లో వీలవుతుందా? ఏమో? కానీ క్షమాగుణం ఆరోగ్యదాయకం. క్షమించడం మనసుకి సంబంధించిన క్రియ. కొందరి పనులు క్షమించగల్గడం మరికొందరి విపరీత ధోరణిని క్షమించలేకపోవడమన్నది వాటి ప్రభావాన్ని ఆధారం చేసుకుని ఉంటుంది.**

# క్షమాగుణం ఆరోగ్యదాయకం

టి.ఆర్.లక్ష్మి

మీ బంధువులు, స్నేహితులో ఎవరో ఒకరు ఇబ్బందులకు గురి చేసినపుడు కొంత ఆగ్రహానికి గురికావడం సహజం. పగ తీర్చుకోవాలన్న ఆలోచనలు రావడమూ సహజమే. కానీ క్షమించేయడం ఎంతో శ్రేయస్కరం. మీ పనులు, వ్యవహారశైలి నచ్చక ఎదుటివారి నుంచి వచ్చే విమర్శలను కూడా తెలియక అంటున్నారని భావించడం. ఇది అందరికీ సాధ్యం కాదు. కొందరిలో సహజంగా ఉంటుంది. మరికొందరు అనుభవాల ద్వారా అలవర్చుకుంటారు. కొందరు ప్రయత్నించారు. ఎదుటివారు సమస్యకు గురిచేసినపుడు అప్పటి పరిస్థితులు, అవతలి వ్యక్తి స్వభావాన్ని గ్రహించుకుని వెంటనే క్షమించేయాలి. క్షమించడం మర్చిపోవడం వంటిదే. కొన్ని సంఘటనలు మర్చిపోవాలంటారు. వాటినే తలిస్తే అశాంతి మిగులుతుంది. క్షమించడానికి గట్టి నిర్ణయం తీసుకోవడమే గొప్ప విషయం. కానీ అశ్రద్ధ చేస్తే మరింత సమస్య ఎదుర్కొనవలసి వస్తుంది. ఆ సందర్భం, సమయం గురించి మీ భావన వ్యక్తం చేయాలి. దానివల్ల లేదా వారివల్ల ఎంత ఇబ్బంది పడిందీ తెలియజేయాలి. అలానే పొరపాటు మీరే చేసినా వెంటనే సారీ చెప్పాలి. క్షమించమనడంలో తప్పులేదు. కించపరచుకోవడం అంటూ ఉండదు. అంతేగాని ఆగ్రహానికి గురికాకూడదు.

**ప్రయోజనం:** ఆగ్రహావేశాలు తగ్గించుకుని ప్రశాంతంగా ఉంటే ఆరోగ్యంగా ఉంటారు. సమస్యలన్నీ తొలగిపోతాయి. గతంలో దూరంగా ఉన్నవారు దగ్గరవుతారు. శత్రువులు మిత్రులవుతారు. ఎంతో ఆరోగ్యంగా ఉల్లాసంగా పని చేయగల్గుతారు. ఆందోళనపోయి మానసిక ఒత్తిడికీ దూరమవుతారు. రోగనిరోధక శక్తి ఇనుమడిస్తుంది. భయాందోళనలు తగ్గిపోతాయి. ప్రశాంతత ఏర్పడుతుంది. ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. ఆధ్యాత్మికత పెరుగుతుంది. సమస్యల్ని ఇట్టే పరిష్కరించుకోగల్గుతారు.

**క్షమాగుణం లేకుంటే..:**

ప్రతీ బంధంలోనూ ఆగ్రహంతోనే వ్యవహరిస్తారు. దీంతో అంతా దూరమవుతారు. కొత్త అనుభవాలు చేదుగా మారుతాయి. ప్రస్తుతంలోని ఆనందాన్ని చవిచూడలేకపోతారు, పొరపాట్లు చేయడంలోనే ఉండిపోతారు. దిగులు, ఏకాంతంలోకి జారిపోతారు. జీవితానికి అర్థం లేదన్న భావనకు గురవుతారు లేదా మీ ఆధ్యాత్మిక నమ్మకాలు వీగిపోతాయి. ఇతరులతో ఉండాల్సిన సంబంధాల విలువ తెలుసుకోలేకపోతారు. జీవితంలో అర్థరహిత ఆలోచనలు, ఆగ్రహావేశాలతో అన్నింటినీ కోల్పోవడం ఎంతవరకూ సబబు? అందుకే అన్నింటికీ దూరం కావడానికి, అందరూ దూరం చేయడానికి ముందే లోపాలు తెలుసుకుని వ్యవహరించాలి. తెలిసినవారు, బాగా కావలసినవారు, స్నేహితులు, బంధువులు ఎవరైనా సరే, పరిచయం లేకపోయినా సరే అవతలివారు చేసే చిన్నపాటి తప్పులు, పొరపాట్లను క్షమించేయడంలోనే ఆనందాన్ని పొందగల్గుతారు. నలుగురు దగ్గరవుతారు, జీవితం ప్రశాంతంగా ఉంటుంది. ఆలోచించండి.

(మిగతా 11వ పేజీలో)

# 'సంఘీ' భావం



## ఆందోళన కలిగిస్తున్న రోడ్డు ప్రమాదాలు

తెలుగు రాష్ట్రాలతో పాటు దేశవ్యాప్తంగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాలు ఆందోళన కలిగిస్తున్నాయి. రహదారుల డిజైన్‌లో ఇంజనీరింగ్ లోపాలు, వాహనచోదకుల తప్పిదాలు, భారతీయ రోడ్ల పరిస్థితికి భిన్నంగా అతివేగంగా వెళ్లగలిగే సామర్థ్యం కలిగిన ఆధునిక వాహనాలు ప్రమాదాలకు కారణంగా నిలుస్తున్నాయి. విదేశీ పరిజ్ఞానంతో తయారయ్యే వాహనాలు అతి తక్కువ సమయంలో గరిష్ట వేగాన్ని అందుకునేలా తయారు చేస్తున్నారు. బైకులు కూడా ఎక్కువ సిసి పవర్ ఇంజన్లతో రూపకల్పన చేస్తున్నారు. విదేశాల్లో ఉన్న రోడ్లకు అనుగుణంగా ఉండే ఈ వాహనాలు భారతీయ రోడ్లపై గరిష్ట వేగాన్ని అందుకోలేక ప్రమాదాలకు గురిఅవుతున్నాయి. మన దేశంలో ప్రతి మూడు నిమిషాలకు ఒకరు రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోతున్నారని గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ లెక్కన రోజుకు సగటున 474 మంది రోడ్డుపై ప్రాణాలు వదులుతున్నారు. కేవలం గత ఏడాదిలోనే సుమారు లక్షా 73 వేల మంది ప్రాణాలు కోల్పోయారు. గత ఏడాది జరిగిన రోడ్డు ప్రమాదాల్లో నాలుగు లక్షల 63 వేలమంది తీవ్రంగా గాయపడ్డారు. గత అంతకుముందు సంవత్సరం 2022 కంటే నాలుగు శాతం అధికంగా ఉంది. ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, గుజరాత్, రాజస్థాన్, తమిళనాడు, పశ్చిమ బెంగాల్, పంజాబ్, అస్సాం, తెలంగాణ వంటి రాష్ట్రాల్లో ప్రమాదాల సంఖ్య గణనీయంగా పెరిగింది. ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో గతేడాది ఎక్కువ సంఖ్యలో మరణాలు సంభవిస్తే, తమిళనాడు క్షతగాత్రుల సంఖ్య గణనీయస్థాయిలో ఉంది. రోడ్డు ప్రమాదాలకు కొన్ని ప్రాంతాల్లో రోడ్డు నిర్మాణంలో లోపాలు కారణంగా నిలుస్తున్నాయి. దీనికి తోడు మానవ తప్పిదాలు కూడా రోడ్డు ప్రమాదాల సంఖ్యను గణనీయంగా పెంచుతున్నాయి. అతివేగంతో దూసుకువెళ్లడం, ప్రమాద హెచ్చరికలను పట్టించుకోకపోవడం, రోడ్డు నిబంధనలను నిర్లక్ష్యం చేయడం వంటివి ప్రమాదాలకు దోహదం కలిగిస్తున్నాయి. ద్విచక్రవాహనదారులు ఇయర్ ఫోన్స్ పెట్టుకుని మాట్లాడుతూ గాని, పాటలు వింటూ కాని డ్రైవింగ్ చేయడం వల్ల ప్రమాదాలను ముందుగా గుర్తించే అవకాశం లేకుండా పోతోంది. మరికొన్ని సందర్భాల్లో మద్యం సేవించి వాహనాలు నడపడం జరుగుతుంది. ప్రధానంగా దూర ప్రాంతాలకు సరుకులు రవాణా చేసే భారీ వాహనాల డ్రైవర్లు తమ అలసటను తగ్గించుకోవడానికి మద్యం సేవిస్తుంటారు. ఇది ప్రమాదాలకు దారితీస్తోంది. మధ్యాహ్నం రెండు నుంచి నాలుగు గంటల మధ్య, అర్ధరాత్రి దాటిన తరువాత మూడు నుంచి ఆరు గంటల మధ్య డ్రైవింగ్ చేసే వారికి నిద్రమత్తు కొంత అధికంగా ఉంటుంది. ఈ సమయంలో కొంత సేపు వాహనాన్ని నిలిపి సేదతీరడం గాని, కనీసం అరగంట కళ్లు మూసుకుని విశ్రాంతి తీసుకోవడం వల్ల మళ్లీ చురుగ్గా డ్రైవింగ్ చేసే అవకాశం కలుగుతుంది. జాతీయ రహదారుల్లో వెనుక వస్తున్న వాహనాన్ని గమనించకుండా వాహనాన్ని మలుపులు తిప్పడం, సడన్‌గా బ్రేకులు వేయడం వంటి చర్యలు ప్రమాదాలకు దారితీస్తున్నాయి. మరికొన్ని సందర్భాల్లో రహదారుల పక్కనే ఉన్న గ్రామాలకు చెందిన ద్విచక్రవాహనదారులు, ట్రాక్టర్లు వ్యతి రేకదశలో వేగంగా వస్తుంటారు. ఈ సమయంలో ఎదురుగా వచ్చే వాహనం ఢీకొని ప్రాణాలు కోల్పోతుంటారు. రహదారి ప్రమాదాలు ఇలాంటి ఘటనలు అత్యధికంగా ఉంటున్నాయి. కాలం చెల్లిన వాహనాలు, సరైన నిర్వహణ లేకుండా నెలల తరబడి వాహనాలను నడపడం వంటివి కూడా ప్రమాద కారకాలుగా ఉంటున్నాయి. చెడిపోయిన బ్రేకులు, పాతటైర్లు, రిట్రీడింగ్ టైర్లు, ఇండికేటర్లు సక్రమంగా పనిచేయని వాహనాలు తరచూ ప్రమాదాలకు గురౌతుంటాయి. లాంగ్ డ్రైవ్‌కు వెళ్లినప్పుడు డ్రైవర్లు కనీసం ఆరు నుంచి 8 గంటల వరకు నిద్రించాలి. మానసిక ఆందోళనలు, ఒత్తిడి ఉన్నప్పుడు, అనారోగ్యంతో బాధపడుతున్నప్పుడు,శస్త్రచికిత్సలు చేసుకుని వైద్యులు సూచించిన మేరకు విశ్రాంతి తీసుకోని వారు డ్రైవింగ్‌కు దూరంగా ఉండాలి. కొన్ని రకాల ఔషధాలు వాడినప్పుడు వాటి ప్రభావం వల్ల మగతగా ఉంటుంది. మెదడు పూర్తిస్థాయిలో చురుగ్గా ఉండదు. మానవతప్పిదాలు ప్రమాదాలకు కారణం అయితే చాలా సందర్భాల్లో సకాలంలో వైద్యచికిత్స అందకపోవడం కూడా ప్రాణనష్టం జరుగుతోంది. కొన్ని ప్రాంతాల్లో అంబులెన్స్‌లు అందుబాటులో ఉండటం లేదు. ప్రమాదం జరిగి తీవ్రంగా గాయపడిన వ్యక్తికి సకాలంలో వైద్య చికిత్సను అందిస్తే ప్రాణనష్టం నుంచి బయటపడే అవకాశం ఉంటుంది. ఇక్కడ ప్రమాదాలు జరిగే ప్రదేశం అని బోర్డు పెడుతున్నారే గాని ఆ మలుపుల వద్ద రోడ్డు నిర్మాణ లోపాన్ని సరిదిద్దడం లేదు. తెలుగు రాష్ట్రాల్లో పరిశీలిస్తే అనంతపురం జిల్లా బత్తుల పల్లి, చిత్తూరు జిల్లాలో పలమనేరు, తూర్పుగోదావరి జిల్లాలో కత్తిపూడి, తెలంగాణలో రాజీవ్ రహదారి, రంగారెడ్డి జిల్లా కొత్తూరు, ఆదిలాబాద్ జిల్లా సిరిపూర్ కాగజ్‌నగర్ వంటి ప్రాంతాల్లో రోడ్లు నిర్మాణంలో లోపాల వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇలాంటి ప్రాంతాల్లో రెండు రాష్ట్రాల్లో సుమారు 50 నుంచి 60 వరకు ఉన్నాయి. అదే విధంగా రహదారులకు సమీపంలో సరైన వైద్య సదుపాయం కలిగిన ఆసుపత్రులు అందుబాటులో ఉండటం లేదు. కనీసం 20 కిలోమీటర్లకు ఒక అసుపత్రిని అయినా ఏర్పాటుచేస్తే క్షతగాత్రులకు సత్వర వైద్య సహాయం అంది ప్రాణాలు కోల్పోకుండా చూడవచ్చు.

– డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ



# డ్రోన్ కొంచెం.. 'మోత' ఘనం!

కవర్ స్టోరీ

డాక్టర్ చిట్యాల రవీందర్

డ్రోన్లు అనేవి మనిషి జోక్యం లేకుండా పని చేయగల అతిముఖ్యమైన సాంకేతిక పరికరాలుగా మారాయి. ఇవి ఆకాశంలో స్వేచ్ఛగా ఎగురుతూ వివిధ రంగాల్లో విస్తృతంగా ఉపయోగపడుతున్నాయి. సైన్యం నుండి వ్యాపార రంగం, వ్యవసాయం నుండి వాణిజ్య సేవల వరకు, డ్రోన్ల వినియోగం అనేక రంగాల్లో విస్తరించింది.

డ్రోన్ల అభివృద్ధి మొదట సైనిక అవసరాల కోసం జరిగింది. మొదటి ప్రపంచయుద్ధం సమయంలో సైనిక ప్రయోజనాల కోసం వీటిని అభివృద్ధి చేశారు. 1930లలో బ్రిటన్ తొలిసారి ఆపరేషన్ కోసం కంట్రోల్ చేయగల డ్రోన్లను రూపొందించింది. 1940లలో అమెరికా కూడా ఈ రంగంలో అడుగుపెట్టింది. యుద్ధం తర్వాత, డ్రోన్లను ఇతర రంగాలలో వినియోగించే ఆలోచనలు వేగంగా పెరిగాయి. ఇప్పుడు డ్రోన్లు కేవలం సైనిక అవసరా లకు మాత్రమే కాకుండా, వాణిజ్య, ఆరోగ్య, వ్యవసాయం, చిత్రీకరణ, భద్రత వంటి అనేక రంగాల్లో విస్తరించాయి. డ్రోన్లు ప్రధానంగా సైనిక సమాచార సేకరణ, ఆపరేషన్ల మద్దతు, డ్రోన్ దాడులు వంటి పనుల కోసం ఉపయోగిస్తున్నారు. వీటి ద్వారా రిస్క్ లేకుండా గగనతలంలో తిరగగలిగే సౌకర్యం కలిగింది. ఆధునిక వ్యవసాయంలో డ్రోన్లు విస్తృతంగా ఉప యోగపడుతున్నాయి. పంటల ఆకారాన్ని పరిశీలించడం, నీరును ఇవ్వడం, మందులు చల్లడం, నేల ఉపరితలాన్ని పరిశీలించడం వంటి ఎన్నో పనులు డ్రోన్ల సాయంతో సులభంగా చేయగలుగుతున్నాయి. డ్రోన్లు సినిమా, ఫొటోగ్రఫీ లో కొత్త ఒరవడిని సృష్టించాయి. హై-రిసల్యూషన్ కెమెరాల సాయంతో ఆకాశం నుండి వీడియోలు, ఫొటోలు తీయడం చాలా సులభమైంది. అనేక సినిమాలు, టీవీ షోలు ఇప్పుడు డ్రోన్లను ఉపయోగించి ఉత్తమ దృశ్యాలను సృష్టిస్తున్నాయి. డ్రోన్లు ప్రస్తుతం డెలివరీ సేవల కోసం కూడా ఉపయోగపడు తున్నాయి. అమెజాన్ వంటి కంపెనీలు డ్రోన్ డెలివరీ సేవలను పరిశీలిస్తున్నాయి. ఇది సమయాన్ని, వ్యయాన్ని తగ్గిస్తుంది. పెద్ద కట్టడాలు, స్మారక చిహ్నాలు, భవనాలు, వంతెనలు వంటి ప్రాజెక్టులను పరిశీలించడానికి డ్రోన్లు వినియోగిస్తున్నారు. భద్రతా ప్రమాణాలను సమీక్షించడానికి కూడా ఇవి ఉపయోగపడు తున్నాయి. భద్రతా సంస్థలు, పోలీసులు డ్రోన్ల సాయంతో బహిరంగ ప్రదేశాలను, భారీ వేడుకలను పరిశీలిస్తున్నారు. ఇది జనం గుంపులను సులభంగా పరిశీలించడానికి, ప్రమాదాలను ముందుగా గుర్తించడానికి ఉపయోగపడుతుంది. డ్రోన్ల వినియోగంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న రంగాలలో ఒకటి. గ్లోబల్ డ్రోన్ మార్కెట్ వృద్ధి రేటు ప్రతిసంవత్సరం క్రమంగా పెరుగుతుంది. 2023 నాటికి ప్రపంచ డ్రోన్ మార్కెట్ విలువ 30 బిలియన్ డాలర్లకు చేరుకుంది. ఈ మార్కెట్ పెరుగుదల ప్రధానంగా సైనిక, వాణిజ్య అవసరాలకు చెందినదే. ఆరోగ్య, రిటైల్, ఫొటోగ్రఫీ, వ్యవసాయం వంటి రంగాల్లో డ్రోన్ల వినియోగం పెరుగుతున్నందున 2030 నాటికి ఈ మార్కెట్ మరింత పెరుగుతుందని డ్రోన్ల డిమాండ్‌ను పెంచుతున్నాయి. అమెరికా డ్రోన్ల అభివృద్ధిలో ప్రపంచంలో అగ్రగామిగా నిలిచింది. సైనిక అవసరాలకు మాత్రమే కాకుండా, వాణిజ్య అవసరాలకు కూడా డ్రోన్ల వినియోగం భారీగా పెరిగింది. ఇక చైనా డ్రోన్ల ఉత్పత్తిలో అగ్రగామి. డిజెఐ అనే కంపెనీ ప్రపంచ వ్యాప్తంగా అత్యధిక డ్రోన్లను తయారు చేస్తుంది. చైనాలో డ్రోన్లను అన్ని రంగాల్లో విస్తృతంగా ఉపయోగిస్తున్నారు.

**ఇజ్రాయేల్:** డ్రోన్ల వినియోగంలో ఇజ్రాయెల్ అత్యంత ఆధునికమైన దేశం. ఇజ్రాయెల్ డ్రోన్లను సైనిక కార్య కలాపాలు, రక్షణ, అన్వేషణలకు విస్తృతంగా ఉపయోగిస్తుంది. భారత్‌లో డ్రోన్ల వినియోగం ఇటీవలే వేగంగా పెరుగుతోంది. వ్యవసాయం, ఫొటోగ్రఫీ, పరిశీలన, సైనిక అవసరాలకు డ్రోన్ల వినియోగం విస్తరిస్తోంది. డ్రోన్లు మనిషి సాధనంలో ఒక కీలకపాత్ర పోషిస్తున్నాయి. ప్రస్తుత ఆర్థిక, సాంకేతిక సమాజంలో డ్రోన్లు ప్రధానపాత్ర పోషిస్తూనే




ఉన్నాయి. డ్రోన్ల ఉపయోగం సైన్యం నుండి వ్యవసాయం వరకు అన్నిరంగాల్లో విస్తరించడం, మార్కెట్ పెరుగుదల, దేశాలవారీగా విస్తృత వినియోగం డ్రోన్ టెక్నాలజీ ప్రాముఖ్యతను నిరూపిస్తున్నాయి.

డ్రోన్ల Unmanned Aerial Vehicles -( UAVs). ఆవిష్కరణలు శాస్త్రసాంకేతిక రంగంలో ఒక విప్లవాత్మక పరిణామంగా భావించవచ్చు. ఆవిష్కరణల కాలం నుండి, డ్రోన్లు అనేక సాంకేతిక మార్పులకు గురవుతున్నది. వీటిని ప్రాథమికంగా సైనిక అవసరాల కోసం అభివృద్ధి చేసినప్పటికీ, ప్రస్తుత వాణిజ్య, వ్యవసాయం, ఆరోగ్యం, భద్రత, చిత్రీకరణ వంటి అనేక రంగాలలో విస్తృతంగా ఉపయోగిస్తున్నారు. ఈ ఆవిష్కరణల వెనుక ఉన్న ముఖ్యమైన పరిణామాలను కిందివిధంగా వివరించవచ్చు.

## డ్రోన్ల పుట్టుక, వృద్ధి

మొదటగా డ్రోన్లను సైనిక కార్యకలాపాలు, గూఢచారి మిషన్‌లు, డ్రోన్ దాడుల కోసం అభివృద్ధి చేశారు. ప్రపంచ యుద్ధాల సమయంలో రిస్క్‌లేకుండా పర్యవేక్షణ చేయడానికి, రహస్య కార్యకలాపాలు చేపట్టడానికి డ్రోన్లను రూపొందించారు. ఇది డ్రోన్ల తొలి ఆవిష్కరణగా చెప్పవచ్చు. 1935లో, బ్రిటన్‌లో టార్గెట్ డ్రోన్లను తయారు చేయడం మొదలైంది. వీటిని ముఖ్యంగా టార్గెట్ ప్రాక్టీసు కోసం ఉపయోగించేవారు. 1940లలో, అమెరికాలో "Radioplane OQ-2" అనే డ్రోన్‌ను తయారు చేసింది. ఇది సైనిక గూఢచారి కార్యకలాపాల్లో విస్తృతంగా ఉపయోగపడింది. వ్యాపార, పౌర వినియోగంలో ఆవిష్కరణలలో భాగంగా, సైనిక రంగం నుండి వాణిజ్య రంగంలోకి డ్రోన్ల ప్రవేశం పెద్ద ఆవిష్క రణ. ఇది సాధ్యమైన హైకెమెరా, నావిగేషన్ టెక్నాలజీల అభివృద్ధి కారణంగా జరిగింది. 2006లో అమెరికాలో మొదటిసారి డ్రోన్ల వాణిజ్య వినియోగాన్ని అనుమతించారు. ప్రధానంగా ఫొటోగ్రఫీ, పర్యవేక్షణ, మానిటరింగ్ వంటి పనుల కోసం వీటిని ఉపయోగించారు. 2013లో అమెజాన్ 'ప్రైమ్ ఎయిర్' పేరుతో డ్రోన్ డెలివరీ సేవలను ప్రకటించింది. ఇది వాణిజ్యరంగంలో ఒక పెద్ద ఆవిష్కరణంగా నిలిచింది. డ్రోన్ డెలివరీ సాంకేతికత ప్రజల చేత అందుబాటులోకి రావడానికి ఇది పెద్ద మార్పుగా మారింది.

## సాంకేతికంగా వృద్ధిచెందుతోన్న డ్రోన్లు



డ్రోన్లు సాంకేతికత క్రమంగా అభివృద్ధి చెందుతున్నాయి. డ్రోన్లలో ఉన్న కెమెరాలు, సెన్సర్లు, నావిగేషన్ వ్యవస్థలు, డ్రోన్ సాఫ్ట్‌వేర్ చాలావేగంగా మెరుగుపడ్డాయి. ఇందులో కొన్ని ప్రధాన సాంకేతిక ఆవిష్కరణలు జరిగాయి. జిపిఎస్ సాంకేతికత డ్రోన్లలో ప్రవేశించడం ద్వారా వాటిని ఖచ్చితంగా ఎక్కడికైనా పర్యవేక్షణ, పికప్, లేదా డెలివరీ కోసం పంపడం సులభమైంది. ఇది డ్రోన్ల వినియోగాన్ని మరింత విస్తరించింది. మల్టీ-రోటర్ డ్రోన్లు (quadcopters) ఆవిష్కరణతో, డ్రోన్లకు ఎగిరే స్థిరత్వం, కాంపాక్ట్ ఫ్లైట్ కెపాసిటీ పెరిగింది. ఇది చిన్న స్థలాలలో కూడా సులభంగా మలుపులు తీసుకుని పని చేయగలిగాయి. కృత్రిమ మేధస్సు (ఏఐ), ఆటోమేషన్ సాంకేతికతలను డ్రోన్లలో ప్రవేశపెట్టడం ద్వారా, డ్రోన్లు స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకోవడంలో మరింత మెరుగుపడ్డాయి. దీనివల్ల డ్రోన్లు మరింత సమర్థవంతంగా పని చేయగలుగుతున్నాయి.

> జిపిఎస్ సాంకేతికత డ్రోన్లలో ప్రవేశించడం ద్వారా వాటిని ఖచ్చితంగా ఎక్కడికైనా పర్యవేక్షణ, పికప్, లేదా డెలివరీ కోసం పంపడం సులభమైంది. ఇది డ్రోన్ల వినియోగాన్ని మరింత విస్తరించింది. మల్టీ-రోటర్ డ్రోన్లు (quadcopters) ఆవిష్కరణతో, డ్రోన్లకు ఎగిరే స్థిరత్వం, కాంపాక్ట్ ఫ్లైట్ కెపాసిటీ పెరిగింది. ఇది చిన్న స్థలాలలో కూడా సులభంగా మలుపులు తీసుకుని పని చేయగలుగుతున్నాయి.

డ్రోన్లను వ్యూహాత్మకంగా ఉపయోగించడంలో కొన్ని ముఖ్యమైన ఆవిష్కరణలు జరిగాయి. వ్యవసాయరంగంలో డ్రోన్లు పెద్దమార్పు తీసుకొచ్చాయి. పంటలను పరిశీలించడం, మట్టిని విశ్లేషించడం, నీటి అవసరాలను అంచనా వేయడం వంటి పనులు డ్రోన్ల ద్వారా సులభమయ్యాయి. అత్యవసర సేవలలో భాగంగా డ్రోన్లు ప్రస్తుతం విపత్తుల సమయంలో సహాయక చర్యల కోసం ఉపయోగిస్తున్నారు. బహిరంగ ప్రాంతాల్లోని ప్రమాదాలను నిర్ధారించడం, బాధితులకు అవసరమైన సేవలను అందించడం వంటి పనుల కోసం ఇవి ఉపయోగపడు తున్నాయి. డ్రోన్లు భవిష్యత్ ఆవిష్కరణలు ఇంకా ఆరంభదశలోనే ఉన్నాయనే చెప్పవచ్చు. ఆటోమేటెడ్ డ్రోన్ డెలివరీ సేవలు, డ్రోన్ వాహనాలు (ఫ్లైయింగ్ టాక్సెస్),





డ్రోన్ ఆధారిత స్మార్ట్‌సిటీస్ వంటి అనేక కొత్త ఆవిష్కరణలు ఆమోదం పొందే దిశగా ఉన్నాయి. డ్రోన్ల ఆవిష్కరణలు సమాజానికి ఒక కొత్త దారిని చూపుతున్నాయి.

డ్రోన్ల వినియోగం, అభివృద్ధి కేవలం సైనిక రంగం నుండి అన్నిరంగాలకు విస్తరించింది. ఈ టెక్నాలజీ ఆధారంగా భవిష్యత్తులో మరిన్ని విప్లవాత్మక పరిణామాలు జరగడం ఖాయం. రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలో డ్రోన్లు కీలకపాత్ర పోషిస్తున్నాయి. ఇరువైపులా డ్రోన్లను వినియోగించి ప్రాముఖ్యమైన సైనిక, వ్యూహాత్మక ప్రయోజనాలను పొందుతున్నారు. ఉక్రెయిన్ తమ పర్యవేక్షణ సామర్థ్యాలను పెంచుకోవడానికి డ్రోన్లను విస్తృతంగా ఉపయోగిస్తోంది. ముఖ్యంగా చిన్న డ్రోన్లు శత్రుసైన్యం చలనాలను గుర్తించడానికి, వారిని పర్యవేక్షించడానికి ఉపయోగపడుతున్నాయి. రష్యాయుద్ధరంగంలో డ్రోన్ల ద్వారా గాలి దాడులు నిర్వహిస్తోంది. వీటిలో ముఖ్యంగా Shahed-136 వంటి డ్రోన్లు టార్గెట్‌లపై క్షిపణి దాడులు చేయడానికి ఉపయోగిస్తున్నారు. ఈవిధంగా డ్రోన్లు శత్రువుల యుద్ధసామాగ్రిని ధ్వంసం చేయడంలో సహాయపడుతున్నాయి. డ్రోన్లను ఉక్రెయిన్ రెగ్యులర్ అటాక్స్, స్నైపర్ వంటి చిన్న మిషన్ల కోసం కూడా వినియోగిస్తోంది.



ఇవి చాలా గరిష్ట ప్రయోజనాన్ని అందిస్తున్నాయి. ఎందుకంటే ఇవి మానవ సైనికుల ప్రాణాలను ప్రమాదంలో ఉంచకుండా దాడులు చేయగలవు. ఇజ్రాయెల్, హమాస్ మధ్య యుద్ధంలో డ్రోన్లు కూడా ప్రధానపాత్ర పోషిస్తున్నాయి. ముఖ్యంగా పర్యవేక్షణ, దాడులు, సమర్థవంతమైన లక్ష్యాలను గుర్తించడంలో, ఇజ్రాయెల్ సైన్యం డ్రోన్లను విస్తృతంగా ఉపయోగించి తమ భద్రతా వ్యవస్థను మరింత మెరుగుపరచుకుంది.



ఇజ్రాయెల్ డ్రోన్ల ద్వారా గూఢచారి మిషన్లు నిర్వహించడం, శత్రు స్థావరాలపై సాంద్రత తగ్గించే దాడులు చేయడం జరుగుతోంది. ప్రత్యేకించి హెరాన్, హరోప్ వంటి డ్రోన్లు దాడులు చేయడంలో కీలకంగా ఉన్నాయి. హమాస్ కూడా డ్రోన్లను సాధ్యమైన స్థాయిలో వినియోగిస్తోంది. వీటిని పర్యవేక్షణ కోసం, అలాగే చిన్న స్థాయి దాడులకు ఉపయోగిస్తున్నారు. అయితే, ఇజ్రాయిల్ అభివృద్ధి చెందిన వ్యూహాలు హమాస్ డ్రోన్లను సాంకేతికంగా ఎదుర్కొనడానికి సిద్ధంగా ఉన్నాయి. ఇజ్రాయిల్ హమాస్ యుద్ధంలో, హమాస్ కామికాజే డ్రోన్లు లేదా ఆత్మాహుతి డ్రోన్లను ఉపయోగిస్తోంది. ఇవి లక్ష్యాలను పేల్చివేయడానికి రూపొందించినవి. డ్రోన్లు ఈ యుద్ధాలలో కీలక సాంకేతిక ఆధారంగా ఉపయోగపడుతున్నాయి. వీటివల్ల నష్టం తగ్గించడం, సమాచార సేకరణ, దాడులు చేయడం సులభమవుతోంది.

## వరదల సమయంలో డ్రోన్ల ఉపయోగం

డ్రోన్లు వరదల సమయంలో అనేక విధాలుగా కీలక పాత్ర పోషిస్తున్నాయి. సహాయక చర్యలు వేగవంతం చేయడం, ప్రమాదాలను తగ్గించడం, బాధితులకు సహాయం అందించడం వంటి విభిన్న పనుల కోసం డ్రోన్లను ఉపయోగిస్తున్నారు. డ్రోన్లను వరదల సమయంలో పర్యవేక్షణ కోసం ఉపయోగి స్తారు. ఎత్తైన ప్రదేశాల నుండి పెద్ద విస్తీర్ణంలో నీటి మట్టం పెరుగుదలను, వరద ప్రవాహాన్ని పర్యవేక్షించడం ద్వారా సహాయక బృందాలు ప్రభావిత ప్రాంతాలను సులభంగా గుర్తించగలుగుతాయి. డ్రోన్లు ప్రజలు చిక్కుకున్న ప్రదేశాలను గుర్తించడంలో సహాయ పడతాయి. పర్యవేక్షణతో తక్షణ చర్యలు తీసుకోవచ్చు. డ్రోన్లు ప్రమాద స్థితిలో ఉన్న ప్రాంతాలపై సహాయక బృందాలకు సమాచారాన్ని సకాలంలో అందిస్తాయి. బాధితులను ఎక్కడ నుండి రక్షించాలో డ్రోన్లు సహాయం చేస్తాయి. డ్రోన్లను మందులు, ఆహారం, అత్యవసర వనరులు అందించడానికి కూడా ఉపయోగిస్తున్నారు. దీనివల్ల బాధితులకు అవసరమైన సహాయం సులభంగా చేరుతుంది. వరదల సమయంలో రహదారులు, వంతెనలు ధ్వంసమవడం సాధారణం. డ్రోన్లను పంపించి, ఇన్ఫ్రాస్ట్రక్చర్ పరిస్థితిని వేగంగా అంచనా వేయవచ్చు. తద్వారా మరమ్మతులు లేదా ప్రత్యామ్నాయ వర్గాలు క్రమం తప్పకుండా ఏర్పాటు చేయవచ్చు. వరదల్లో చిక్కుకున్న ప్రజలు, జంతువులను రక్షించడంలో డ్రోన్లు కీలకంగా ఉంటాయి. డ్రోన్ల ద్వారా ప్రయాణించే మార్గాలను సురక్షితంగా



నిర్ణయించడానికి సహాయపడుతుంది. వరద ప్రభావిత ప్రాంతాల్లో టెలికమ్యూనికేషన్ సేవలు నిలిచిపోతే, డ్రోన్లు ఇంటర్నెట్ లేదా టెలికాం సిగ్నల్స్ ప్రసారించే సాధనంగా ఉపయోగపడవచ్చు. దీనివల్ల బాధితులు బయట ఉన్నవారితో సమాచారాన్ని పంచుకోవచ్చు. డ్రోన్లు వరదల తర్వాత వచ్చిన ప్రమాదకర స్థితులను (భూ కోతలు, కరెంట్ పోకడలు) పర్యవేక్షించడం ద్వారా భవిష్యత్ ప్రమాదాలను నివారించడానికి కీలకంగా ఉంటాయి. మొత్తంగా డ్రోన్లు వరదల సమయంలో సహాయక చర్యలను వేగవంతం చేయడంలో, సమాచారం సేకరించడంలో, ప్రజల రక్షణలో కీలక పాత్ర పోషిస్తాయి.

## అత్యవసర పరిస్థితుల్లో డ్రోన్ల వినియోగం

డ్రోన్లు అత్యవసర పరిస్థితుల్లో అనేక విధాలుగా వినియోగించబడుతున్నాయి. ముఖ్యంగా సహాయ చర్యలు, పర్యవేక్షణ, సమాచారాన్ని సకాలంలో అందించడంలో ఇవి అత్యవసర సేవలను వేగవంతం చేస్తూ ప్రజల ప్రాణాలను కాపాడడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. సహాయక చర్యల్లో అత్యవసర పరిస్థితుల్లో డ్రోన్లు సహాయక చర్యలకు అత్యంత ప్రాధాన్యం కలిగి ఉంటాయి. ముఖ్యంగా, బహుళ ప్రాంతాలను ఒకేసారి కవర్ చేసి, బృందాలకు సమయానుకూలంగా సమాచారాన్ని అందిస్తాయి. ప్రమాదాల్లో చిక్కుకున్న వారిని సులభంగా గుర్తించి, వారి స్థితిని నిర్ధారించడంలో డ్రోన్లు ఉపయోగప డతాయి. తక్షణ సహాయం కావలసిన వారికి మందులు, ఆహారం, తాగునీరు వంటి అత్యవసర వస్తువులు డ్రోన్ల ద్వారా అందించవచ్చు. పర్యవేక్షణ, గూఢచర్య, ప్రకృతి వైపరీత్యాలు లేదా ప్రమాదాల తరువాత పరిస్థితులను పర్యవేక్షించడానికి డ్రోన్లు అద్భుతంగా పని చేస్తాయి. విస్తృతమైన ప్రాంతాలపై గగనతలం నుండి డేటాను సేకరించి పరిస్థితిని అంచనా వేయవచ్చు. ఇది సహాయక బృందాలకు ప్రణాళికలను రూపొందించడంలో ఉపయోగపడుతుంది. డ్రోన్లు గాలి నుండి వీడియోలను ప్రసారం చేస్తాయి. ఇది ఏక కాలంలో పరిస్థితులను క్షుణ్ణంగా తెలుసుకునేందుకు, తక్షణ చర్యలను తీసుకోవడంలో సహాయపడుతుంది. అగ్ని ప్రమాదాల సమయంలో డ్రోన్లు అగ్నిమాపక దళాలకు సమయానకూల సమాచారాన్ని అందిస్తాయి. పొగతో కప్పబడిన ప్రాంతాలను పర్యవేక్షించడంలో ఇవి ఉపయోగపడతాయి. అగ్నితీవ్రతను నిర్ధారించడంలో, ఎక్కడ నుంచి మొదలైందో పరిగణించి, సైనిక బృందాలు ఏం చేయాలో నిర్ణయించుకోవడానికి డ్రోన్లు సహాయపడతాయి. చిన్న డ్రోన్లు నీటిని లేదా ఫైర్ రిటార్డెంట్ కెమికల్స్‌ను ఏరియల్‌గా విసిరి అగ్నిని అదుపులో పెట్టేందుకు ఉపయోగపడుతున్నాయి. ప్రమాదకర ప్రాంతాల్లో (జల విపత్తులు, భూకంపాలు, గ్యాస్ లీకేజీలు) సహాయక చర్యలు నేరుగా చేసే సమయాల్లో డ్రోన్లు రిస్క్‌ను తగ్గిస్తాయి. భూకంపాల వంటి విపత్తుల తర్వాత శిథిలాల కింద చిక్కుకున్న బాధితులను గుర్తించడానికి డ్రోన్లు ముఖ్యంగా ఉపయోగపడతాయి. రసాయన ప్లాంట్లలో లీకేజీలు జరిగినప్పుడు డ్రోన్లు ప్రమాద స్థాయిలను గుర్తించి, సురక్షిత మార్గాలను సూచించడంలో సహాయపడతాయి. రహదారులు, రవాణా వ్యవస్థలు పాడైనప్పుడు డ్రోన్లు మార్గదర్శక పాత్ర పోషిస్తాయి. ట్రాఫిక్‌ను మేనేజ్ చేయడం, ట్రాఫిక్ ప్రమాదాలు జరిగినప్పుడు భద్రతా బృందాలను సమయానికి పంపించడం డ్రోన్ల ద్వారా వేగవంతం అవుతుంది. డ్రోన్లు అత్యవసర వైద్య సేవలలో కూడా వినియోగించబడుతున్నాయి. అనుకోని ప్రమాదాల సమయంలో రక్తం వంటి అత్యవసర వైద్య సరఫరాలను పంపించడంలో ఇవి ఉపయోగపడుతున్నాయి.

ఆటోమేటెడ్ ఎక్స్‌టర్నల్ డిఫిబ్రిల్లేటర్ (ఏఇడి) అనే పరికరాన్ని హృదయ సంబంధిత అత్యవసర పరిస్థితుల్లో డ్రోన్ల ద్వారా బాధితుల వద్దకు తీసుకెళ్లి వారి ప్రాణాలను కాపాడవచ్చు. అత్యవసర పరిస్థితుల్లో సమాచార ప్రసారం కోసం డ్రోన్లు ఉపయోగపడతాయి. ఇంటర్నెట్ కనెక్షన్ అందుబాటులో లేనప్పుడు డ్రోన్ల ద్వారా కమ్యూనికేషన్ టవర్‌ల వలె సేవలను అందించవచ్చు. మొత్తంగా డ్రోన్లు అత్యవసర పరిస్థితుల్లో అత్యంత సమర్థవంతమైన సాంకేతిక పరిజ్ఞానంగా మారాయి. ఇవి సమాచార సేకరణ, సహాయక చర్యలు, వైద్య సేవలు, పర్యవేక్షణ వంటి అనేక రంగాలలో విశేష ప్రయోజనాలను అందిస్తున్నాయి.

డ్రోన్లు అనేక రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తున్నాయి. ఆగమనం నుండి ఇప్పటి వరకు, డ్రోన్లు కేవలం వినోదభరితమైన పరికరాలు కాకుండా వివిధ వృత్తులకు, సేవలకు ముఖ్య సాధనాలుగా అభివృద్ధి చెందాయి. కొన్ని ముఖ్యమైన రంగాల్లో డ్రోన్ల వినియోగం

డ్రోన్లు పంట ఆరోగ్యం, నీటి స్థాయిలు, పండ్ల ఉత్పత్తిని పర్యవేక్షించడానికి ఉపయోగపడతాయి. డ్రోన్లు ఫర్టిలైజర్లు, పెస్టిసైడ్లు పిచికారీ చేసి పని సమయాన్ని తగ్గిస్తాయి. భూమి సర్వేలు చేసి, పంటల దృష్ట్యా విశ్లేషణ చేయడంలో సహాయపడతాయి. డ్రోన్లు సరిహద్దు ప్రాంతాల్లో గూఢచర్యం, పర్యవేక్షణలో కీలకపాత్ర పోషిస్తాయి. యుద్ధంలో డ్రోన్లు విమానదాడులు, ప్రత్యక్ష మానిటరింగ్, టార్గెట్ గుర్తింపునకు ఉపయోగపడతాయి. సముద్ర సరిహద్దుల వద్ద అక్రమ రవాణా, జలదోపిడి ఎదుర్కోవడానికి డ్రోన్లు సహాయపడతాయి.

(మిగతా 11వ పేజీలో)

> **అనుకోని ప్రమాదాల సమయంలో రక్తం వంటి అత్యవసర వైద్య సరఫరాలను పంపించ డంలో ఇవి ఉపయోగపడు తున్నాయి. ఆటోమేటెడ్ ఎక్స్‌టర్నల్ డిఫిబ్రిల్లేటర్ (ఏఇడి) అనే పరికరాన్ని హృదయ సంబంధిత అత్యవసర పరిస్థితుల్లో డ్రోన్ల ద్వారా బాధితుల వద్దకు తీసుకెళ్లి వారి ప్రాణాలను కాపాడవచ్చు. అత్యవసర పరిస్థితుల్లో సమాచార ప్రసారం కోసం డ్రోన్లు ఉపయోగపడతాయి.**

# శుక్రయానానికి సన్నాహం

శుక్రుడిని మన భూమికి కవల గ్రహంగా పరిగణిస్తుంటారు. ఈ రెండింటి ద్రవ్యరాశి, సాంద్రత, పరిమాణం ఒకేలా ఉంటాయి. అందువల్ల శుక్రుడి మీద అధ్యయనం చేస్తే భూ పరిణామ రహస్యాలు లభించే అవకాశముంది. ఎప్పుడో ఒకప్పుడు శుక్రుడి మీద నీరుండేదన్నది శాస్త్రవేత్తల భావన.

కానీ ఇప్పుడు పొడిగా, దుమ్ముతో కూడిన గ్రహంగా మారిపోయింది. వీనస్ ఆర్బిటర్ మనదేశంతో పాటు ఇతర దేశాలకు చెందిన శాస్త్రీయ పరికరాలను మోసుకెళ్తుంది. ఇవి శుక్రుడి ఉపరితలం, ఉపరితలం కింది పొరను పరీక్షిస్తాయి. శుక్రుడి




వాతావరణం, దాని అయానావరణం, సూర్యుడితో శుక్రుడు జరిపే చర్యలనూ ఇవి పరిశీలిస్తాయి.

భూమి కన్నా భిన్నం

కవల గ్రహంగా భావించినా శుక్రుడి తీరుతెన్నులు భూమితో పోలిస్తే చాలా భిన్నం. అక్కడి ఉపరితలం అధిక వేడిగా..సుమారు 462 డిగ్రీల సెల్షియస్ ఉష్ణోగ్రతతో ఉంటుంది. ఇది సూర్యుడికి దగ్గరగా ఉండే బుధ గ్రహం ఉపరితల ఉష్ణోగ్రత కన్నా అధికం.

- భూమి మీది కన్నా శుక్రుడి మీద వాతావరణ పీడనం చాలా ఎక్కువ. అది భూమి మీద మహాసముద్రాల లోతుల్లోని పీడనంతో దాదాపు సమానంగా ఉంటుందని చెప్పుకోవచ్చు.
- శుక్రుడి వాతావరణంలో 96.5శాతం కార్బన్ డయాక్సైడ్ ఉంటుంది. ఆ గ్రహం మీద సల్ఫ్యూరిక్ ఆమ్లంతో కూడిన మేఘాలూ నిండి ఉంటాయి.
- భూమితో పోలిస్తే శుక్రగ్రహం తన అక్షం మీద చాలా నెమ్మదిగా భ్రమిస్తుంటుంది. ఒకసారి తన చుట్టూ తాను తిరగటానికి సుమారు 243 భూమి రోజులు పడుతుంది.

ఏరో బ్రేకింగ్ నైపుణ్యంతో వీనసన మిషన్‌లో మనదేశం తొలిసారిగా ఏరోబ్రేకింగ్ నైపుణ్యాన్నీ ప్రదర్శించనుంది. అంటే ఉపగ్రహాన్ని దశలు కిందికి దించటం అన్నమాట. అంతరిక్షంలో ఇంధనం కొరతను దృష్టిలో పెట్టుకొని ఉపగ్రహాన్ని ముందుగా శుక్రుడికి చాలా ఎత్తులో సుమారు 500కి.మీ, 60,000 కి.మీ. దీర్ఘవృత్తాకార కక్ష్యలో కుదరుకునేలా చేస్తారు. అయితే అంత ఎత్తు నుంచి శాస్త్రపరికరాలు ప్రయోగాలు నిర్వహించలేవు. అందుకే ఏరో బ్రేకింగ్ సాయంతో ఉపగ్రహాన్ని కిందికి దించి 300 కి.మీ. లేదా 200 600కి.మీ. కక్ష్యకు తీసుకొస్తారు. దీర్ఘవృత్తాకార కక్ష్యలో కుదరుకునేలా చేస్తారు. అయితే అంత ఎత్తు నుంచి శాస్త్ర పరికరాలు ప్రయోగాలు నిర్వహించలేవు. అందుకే ఏరో బ్రేకింగ్ సాయంతో ఉపగ్రహాన్ని కిందికి దించుతారు. ఈ సమయంలో ఉపగ్రహం శుక్ర వాతావరణం వెలుపలి పొరగుండా వేగంగా కిందికి దిగుతుంది. వాతావరణ ఘర్షణ ప్రభావంతో ఉపగ్రహం వేగం నెమ్మదిస్తుంది. క్రమంగా కక్ష్య ఎత్తు తగ్గుతూ వస్తుంది. శుక్రవాతావరణం నుంచి ఉపగ్రహాన్ని అతనయంత జాగరూకతతో కిందికి దించాల్సి ఉంటుంది. ఎందుకంటే ఉపగ్రహం మరీ లోతుకు దిగితే తీవ్రఘర్షణ మూలంగా మండిపోవచ్చు.



అంతగా కిందికి దిగకపోతే నిర్ణీత కక్ష్యలోకి ఉపగ్రహం చేరటానికి చాలా సమయం పడుతుంది. నిజానికి శుక్రప్రయోగం గత సంవత్సరమే జరగాలి. కానీ ఇటీవల కేంద్ర కేబినెట్ అనుమతి మేరకు 2028, మార్చిలో ప్రయోగించాలని నిర్ణయించారు. భూమి, శుక్రగ్రహం 19నెలలకు ఒకసారే అత్యంత సమీపంలోకి వస్తాయి. ఇది దగ్గరి దారి కావటం వల్ల ఆ సమయానికి అనుగుణంగా

ప్రయోగాన్ని చేపట్టనున్నారు. శుక్రప్రయోగంలో ఇది చాలా ముఖ్యమైన విషయం.

➡ వీనస్ మిషన్ సుమారు 100 కిలోల శాస్త్రీయ పరికరాలను మోసుకెళ్తుంది. మనదేశం చేపట్టిన ఇతర అంతరిక్ష ప్రయోగాల తీరునే ఇదీ అనుసరిస్తుంది. ఉపగ్రహం భూ కక్ష్యలో వేగాన్ని పుంజుకొని, ఒకేసారి శుక్రుడి దిశగా ప్రయాణిస్తుంది. చివరికి అక్కడి కక్ష్యలో స్థిరపడుతుంది.

➡ భూకక్ష్యను విడిచి పెట్టిన తర్వాత ఉపగ్రహం సుమారు 140 రోజుల తర్వాత శుక్రుడి వద్దకు చేరుకుంటుంది.

ఇతర దేశాల ప్రయోగాలు



ఇంతకుముందు అమెరికా, ఒకప్పటి యూఎస్ఎస్ఆర్, జపాన్ శుక్రుడి వద్దకు ప్రయోగాలు నిర్వహించాయి. జపాన్ భాగస్వామనయంతో యూరోపియన్ స్పేస్ ఏజెన్సీ (ఈఎస్ఏ) కూడా మిషన్‌ను చేపట్టింది. అమెరికా మరో రెండు వీనస్ మిషన్లను చేపట్టాలని భావిస్తోంది. 2029లో దావించీ, 2031లో వెరిటాస్‌ను ప్రయోగించాలని నిర్ణయించింది. ఈఎస్ఏ 2020లో ఇన్‌విజన్ ప్రయోగానికీ సిద్ధమైంది. ●

## డ్రోన్ కొంచెం..'మోత' ఘనం!

**(9వ పేజీ తరువాయి)**

అత్యవసరంగా మందులు, రక్తం, వైద్య పరికరాలు రవాణా చేయడంలో డ్రోన్లు ఉపయోగపడతున్నాయి. భూకంపాలు, వరదలు, అగ్ని ప్రమాదాలు వంటి విపత్తుల సమయంలో బాధితులకు సహాయం అందించడానికి డ్రోన్లు కీలకంగా ఉంటాయి. సినిమా, ఫొటోగ్రఫీ రంగంలో డ్రోన్లు గగనతలం నుండి వాస్తవ దృశ్యాలను అందించి, కొత్త రకాల చిత్రీకరణకు అవకాశం ఇస్తున్నాయి. క్రీడా సంఘటనలను గాలి నుండి చిత్రీకరించి ప్రసారాల్లో వినియోగిస్తున్నారు. డిఫెన్స్, పోలీసు విభాగాల్లో డ్రోన్లు సంచలన పరిణామంగా మారాయి. మెగా ఈవెంట్స్, రోడ్లు, విమానాశ్రయాల పర్యవేక్షణలో ఇవి కీలకంగా ఉపయోగపడుతున్నాయి. అనుమానాస్పద కార్యకలాపాలను గుర్తించి, నేరస్తులను పట్టుకోవడానికి డ్రోన్లు ఉపయోగపడుతున్నాయి. అనుమానాస్పద కార్యకలాపాలను గుర్తించి, నేరస్తులను పట్టుకోవడానికి డ్రోన్లు సహాయపడుతున్నాయి. భారీ నిర్మాణ ప్రాజెక్టుల్లో డ్రోన్లు పని పురోగతిని పర్యవేక్షించడంలో ఉపయోగపడుతున్నాయి. భవనాలు, వంతెనలు, రహదారులు వంటి నిర్మాణాల అంచనా వేసి సమస్యలను ముందుగానే గుర్తించడం సులభం. అమెజాన్ వంటి కంపెనీలు డ్రోన్లను చిన్న ప్యాకేజీలను రవాణా చేయడానికి ఉపయోగిస్తున్నారు.

రహదారి రవాణా సమాచారాన్ని, ట్రాఫిక్ నిర్వహణకు ఉపయోగపడుతున్నాయి. అటవీ ప్రాంతాల్లో వృక్షా సంపదను పర్యవేక్షించడం, వన్యప్రాణి వేటగాళ్లను గుర్తించడానికి డ్రోన్లు ఉపయోగపడుతున్నాయి. వాతావరణ మార్పులను సకాలంలో అంచనా వేసి, వాటి ప్రభావాన్ని తగ్గించడానికి డ్రోన్లు ఉపయోగపడుతున్నాయి. అగ్ని ప్రమాదాలు, రసాయనాల లీకేజీలు వంటి విపత్తుల సమయంలో డ్రోన్లు సహాయక చర్యలు వేగవంతం చేస్తాయి. పోలీసు, సైనిక బృందాలకు డ్రోన్లు నేరస్థుల ప్రదేశాలను గుర్తించడంలో, పట్టుకోవడంలో ఉపయోగపడుతున్నాయి. డ్రోన్ల వేగవంతమైన ఆహార సరఫరా కోసం కూడా వినియోగంలోకి వచ్చాయి. ముఖ్యంగా దూర ప్రాంతాల్లో వేగంగా సరఫరా చేయడానికి ఇవి ఉపయోగపడుతున్నాయి. డ్రోన్లు ఇప్పుడు కేవలం వినోదభరితమైన పరికరాలు కాకుండా అన్ని రంగాల్లో విప్లవాత్మక మార్పులను తీసుకొస్తున్నాయి. పర్యవేక్షణ, సహాయక చర్యలు, డెలివరీ, రక్షణ వంటి అనేక రంగాల్ల ఇవి కీలక పాత్ర పోషిస్తూ సమర్థవంతమైన, సురక్షిత సేవలను అందించడంలో దోహదపడుతున్నాయి. ●

## క్షమాగుణం ఆరోగ్యదాయకం

**(4వ పేజీ తరువాయి)**

ఎవరైనా విపత్తు కల్గిస్తున్నారన్న అనుమానం వస్తే వారిని నివారించగల్గుతారు.

పరిస్థితులు అనుకూలించకున్నా అందులోంచి బయటపడేవిధంగా అర్థం చేసుకోగల్గుతారు. ముందుగానే అటువంటి అనుమానాలు వచ్చినపుడు ఫలానా వ్యక్తి నుంచి ఆపద వస్తుందని అనుమానం కలిగినపుడు వారిని కలిసి లేదా కలిసేలా ఇతరుల సహాయం పొంది అవతలివారికి ఆ పని వల్ల కలిగే నష్టాలు, ఇబ్బందులు తెలియజేయాలి. అపుడే వారికి తమ పొరపాటు తెలుస్తుంది. ఆ విధంగా క్షమించడం వల్ల వారు స్నేహితులుగా మారకున్నా, ఆపాయానికి ఒడిగట్టరు. కొందరు పరిస్థితుల కారణంగా వ్యతిరేకులుగా మారతారు. అలాంటివారికి సమస్యను తెలియజేసి, దాన్ని వదిలించుకునేలా సాయం చేయడానికి కృషి చేయాలి. ఫలితంగా అనుకున్నవి, ఆశించినవీ జరిగేలా ఇతరులు తోడ్పడగల్గుతారు. సమస్యలు సృష్టించినవారు, ఇబ్బందులు కల్పించినవారూ మనుషులే. ఏవో తెలియని ఉద్వేగంలోనూ తప్పిదాలకు పాల్పడేవారు ఇతరులకు సమస్యలు సృష్టించవచ్చు. తమకు జీవితంలో కలగని ఆత్మసంతృప్తి కారణంగానూ ఇతరులను ఇబ్బందులకు గురిచేయవచ్చు.



ఇలాంటివారిని క్షమించడంలో వారి వ్యవహారశైలిలో, నడతలో పెనుమార్పులు తేవడానికి ఆస్కారం ఉంటుంది. అందుకే ఎదుటివారు కల్పించే ఇబ్బందులకు వెంటనే లేదా కొంతకాం తర్వాతనో చర్య తీసుకోవడానికి ముందు పరిస్థితులను అవగాహన చేసుకోవాలం టారు. చాలాకాలం నుంచి తెలిసినవారు చేసే చర్యలకు పెద్దగా మనస్తాపం చెందాల్సినది ఉండదు. వారితో నేరుగా చర్చించి వారి పొరపాటు వారికి తెలియజేసి దానివల్ల కలిగిన అరిష్టాన్నో, కష్టనష్టాన్నో విపులీకరించడం అనే క్షమ ప్రదర్శించడం ద్వారా స్నేహాన్ని పునరుదరించుకోవచ్చు. దీనికి ఎంతో సహనం అవసరం. ఈ సహనాన్ని కలిగి ఉన్నారా? క్షమించడంలో ఉండే సంతృప్తి ఎందులోనూ ఉండదు. క్షమాగుణం అలవర్చుకోండి. క్షమ జీవితానందానికి దారులు సుగమం చేస్తుంది. ●




## అక్షర దాహం

ఎన్ని మేఘాలు ఒరుసుకున్నాయో
ఎంత వర్షధార కురిసిందో తెలియదు
కానీ తలపుల చూరునుంచి రాలే ఒక్కో చుక్క
ఎందుకోగాని భద్రంగా ఒడిసి పట్టాను.
బిందువు బిందువు కలిసి సింధువైనట్టు
దాచి పెట్టుకున్న వర్షబిందువుల్లో

ఓ అక్షరాల కడలి అవగతమయింది.
కావ్య కన్యకల నాట్యహేల కనువిందయింది.
అనుభవాల, అనుభూతుల హోరు
క్షణక్షణానికి ఉవ్వెత్తున లేచి విరిగిపడే
కెరటాల రొదలే కథలుగా
వినిపిస్తూ
గుప్పెడంత గుండెను
సుడిగుండం
చేస్తుంది.

ఎడతెరిపి లేని వర్షం కోసం ఎదురుచూపు
తలపుల చూరు నుంచి రాలే బిందువులు కాదు
ఎడారి ఇసుకలో ఇంకిపోయే ఒక్కో బిందువు
ఆత్మకథ అక్షరసత్యంగా ఆవిష్కరించాలని

ఇసుకలో మునివేళ్లతో చెలమ తవ్వుతున్నా
దాహం తీర్చే అక్షరల నీటిఊట ఊరాలని.

**- డాక్టర్ చక్రపాణి యిమ్మిడిశెట్టి**

## మనసు బాధ

అక్షరం విరిగిపోయింది
అర్థంకాని భాషగా మారింది
అంతుచిక్కని వేదన, రోదనలో
నా..
మనసు నేలకొరిగింది
జీవచ్ఛవంలా మారింది
ఎందుకో మరి..
కోట్లాది జనజీవన స్రవంతిలో

ఒంటరి పక్షి అయింది
దారీ తెన్నూ కానరాక
అయోమయంలో
కొట్టుమిట్టాడుతుంది
అవును నిజమే..

విరిగిన అక్షరంలా
అందరూ ఉన్నా అనాథగా
మిగిలిపోయింది
ఆధునికత పేరుతో
దూరమవుతున్న
మానవ సంబంధాల
భవిష్యత్తు కోసం
మౌనంగా ఘోషిస్తుంది!

**- న్యాలకంటి నారాయణ**

## కలాన్ని నేను

పెన్ను నాకు దన్ను
ఈ మన్ను నాకు వెన్ను
మిన్నకుండను
మిన్నునంటను
నిజాలను నిర్భయంగా
నిగూఢతను నిశ్శేషంగా
జడత్వంలోకి జాగృతిని రప్పిస్తా
అస్థిత్వానికి జవసత్వాలు కల్పిస్తా.

కన్నీళ్లను నిప్పుల వానగా
గుండె మంటలను చైతన్య జ్వాలగా
పిరికితనం గడ్డకట్టిన రక్తాన్ని
సిరా సెగతో సలసల రగిలిస్తా
అక్షర సేద్యంతో ప్రశ్నలు మొలకెత్తిస్తా
లక్షల గొంతులు కలిపే వారధిగా పేరుస్తా
ఉరిమే శక్తిని కూడదీసి కలాన్ని ఝళిపిస్తా
గర్జించే మేఘాలకు తడి గొంతుక నేనైతా

మునివేళ్ల నుండే ముల్లోకాలను మేల్కొలుపుతా
మోచేతులపైనే నవలోకాన్ని నిర్మిస్తా
బలవంతుడిని కాను
భగవంతుడిని కానేకాను
ఎటొచ్చీ.. నేను కలాన్ని మాత్రమే.

**- వినోద్ కుత్తుం**



# పుస్తక సమీక్ష




## కథాప్రియులకు అపురూప కానుక 'వంశీకథలు 2024'

'సాహితీకిరణం' మాసపత్రిక నిర్వహించిన కథల పోటీలో ఎంపికైన 53కథల సంపుటి 'వంశీకథలు-2024'. అన్నీ చిన్న కథలే. ఆర్థికంగా ఎంత ఎదిగినా, హోదాపరంగా ఎన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించినా, మనిషి తన మూలాలను మరిచిపోకూడదని సున్నితంగా హెచ్చరించిన కథ 'స్థాయి'. ప్రస్తుత ఆధునిక జీవనశైలికి దూరంగా జరిగి మన విలువైన సాంప్రదాయ పద్ధతుల్లో మానసికంగా, శారీరకంగా, ఆరోగ్యంగా ఈ కాలంలో కూడా ఉన్నతంగా ఎలా జీవించవచ్చో తెలియచెప్పిన విలువల కథ 'ముచ్చట'. 'గాలికి పోయే పేలపిండి కృష్ణార్పణం' అన్నట్లు మనిషి జీవితం క్షణభంగురం..ఏక్షణాన ఏం జరుగుతుందో తెలియదు అన్న కాన్సెప్ట్‌తో రాసిన కథ 'గాలికిపోయే పేలపిండి'.

సెల్‌ఫోన్లో వచ్చే మెసేజ్‌లు ఎంతటి గందరగోళానికి గురి చేస్తాయో కళ్లకు కట్టిన కథ యిది. పైకథలు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందుకున్నవి.

కథల పోటీకి ప్రముఖ రచయిత్రి గంటి భానుమతి న్యాయనిర్ణేతగా వ్యవహరించగా డా॥తెన్నేటి సుధాదేవి సంకలనీకరించిన ఈ పొత్తం వంశీసంస్థ స్వర్ణోత్సవాల సందర్భాంగా వెలువడిన చిన్న కథల సంకలనం. కథాప్రియులకు 'వంశీ'రామరాజు అందిస్తున్న అపురూప కానుక.

**(వంశీ కథలు-2024, వెల: రూ 200, ప్రతులకు: నవోదయ బుక్‌హౌస్, కాచిగూడ, హైదరాబాద్)**

**– రమణ వెలమకన్ని**

## నవ్యాంధ్ర నిర్మాతలు-నవయుగ ఆవిష్కర్తలు



2014లో తెలుగు ప్రజలు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలుగా విడిపోయారు. మొదట ఆంధ్రవాసులు నారాచంద్రబాబు నాయుడికే పట్టం కట్టినా, రెండవసారి జగన్‌మోహన్‌రెడ్డిని ఎన్నుకున్నారు. మూడవసాధారణ ఎన్నికలలో 2024లో తిరిగి చంద్రబాబు నాయుడునే ఎన్నుకున్నారు. రచయిత రాజకీయ విశ్లేషకులు తిప్పనేని రామదాసప్పనాయుడు మూడవ సాధారణ ఎన్నికలలో గెలిచి పరిపాలనా బాధ్యతలను చేపట్టిన టిడిపి నాయకుడు చంద్రబాబు నాయుడు, ఆయన ఎన్నికల ముందు సర్వేలతో మొదలుపెట్టి ఎన్నికలు, ఫలితాలు నాయుడుగారి పరిపాలనా విశేషాలు ఎమ్మెల్యే, ఎంపి, మంత్రుల వివరాలు పొందుపరిచిన పుస్తకం ఇది. 33 అధ్యాయాలతో రచయిత, ఆంధ్రప్రదేశ్ రాజకీయ స్థితిగతుల్ని ఏకరువుపెట్టిన పొత్తం ఇది. చరిత్రను రాయటం అసిధారావ్రతం. అయినా రచయిత నాయుడు పొందుపరిచిన వివరాలు గమనిస్తే ఆయనెంతటి కఠోరదీక్షతో అనతికాలంలోనే ఇన్ని వివరాలు సేకరించి మన ముందు ఉంచటం ఆశ్చర్యం, ఆనందం కలుగుతుంది. లోగడ ఇదే రచయిత తెలంగాణ రాష్ట్రముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గురించి ఆయన పరిపాలన గురించి ప్రశంసనీయంగా ప్రకటించి మెప్పు పొందారు. ఇంత తక్కువ వ్యవధిలో ఇంతటి సవివరణతో పుస్తకం ప్రచురించటం రామదాసప్పనాయుడు ప్రతిభకు అభినందనలు. **(నవ్యాంధ్ర నిర్మాతలు, రచన, సేకరణ: తిప్పనేని రామదాసప్పనాయుడు, వెల: రూ 600, ప్రతులకు: )**

**– కూర చిదంబరం**

## 'హెచ్‌ఐవి-ఎయిడ్స్' తరిమికొట్టాలి'

'ఎయిడ్స్' వ్యాధి ప్రపంచాన్ని భయంకరంగా వణికించిన వ్యాధి 1981 జూన్ 5 తేదీన లాస్ ఏంజిలిస్‌కు చెందిన ఐదుగురు స్వలింగ సంపర్కులైన పురుషులకు (మేల్ హోమోసెక్సువల్స్ 'గేస్') అత్యంత అరుదైన ఊపిరితిత్తుల ఫంగస్ ఇన్ఫెక్షన్ న్యూమోసిస్టిస్ కారినై సంక్రమించడం వైద్యుల దృష్టికి వచ్చింది. ఈ వ్యాధి గురించి సమగ్రంగా తెలియపరచిన గొప్ప వైద్య గ్రంథం




ఇది..తదుపరి నెలలో 'కపోసి సార్కోమా' అనే అరుదైన చర్మకేన్సర్‌ను కూడా మరికొంతమంది స్వలింగ సంపర్కులలో గమనించారు. 1982 సెప్టెంబర్ నుండి ఎక్వైర్డ్ అనగా పుట్టుకతో కాకుండా జీవితకాలంలో సంక్రమించిన ఇమ్యూన్ అనగా వ్యాధి నిరోధకత, డెఫిషియెన్సీ అనగా తగ్గిపోవడం, సిండ్రోమ్-'ఎయిడ్స్' పేరుతో పిలువ నారంభించారు. చింపాజీలు, గొరిల్లాలు, కోతుల నుండి మానవులకి చేరిన హెచ్‌ఐవి క్రిమి పట్టణీకరణ, వలస పాలన యుద్ధం, వైద్యసేవల మూలంగా వేగంగా విస్తరించింది. రక్తం ద్వారా శరీరం అంతా ఇన్ఫెక్షన్ వ్యాప్తి చెందే భయంకర వ్యాధి ఇది. కాకినాడలో తొలిగా క్లినిక్ రచయిత ఆరంభించారు. ప్రపంచంలో ఈ వ్యాధి సోకిన అత్యధికులున్న దేశాలలో 2వ దేశంగా భారత్ వుంది. వ్యాధి దశలు, పరీక్షలు, మందులు, చికిత్స, యాంటీవెట్రో వైరల్ ఔషధాలు, నిర్మూలన పద్ధతులు ఫొటోలతో రచయిత రాసారు.

**(హెచ్‌ఐవి-ఎయిడ్స్, రచన: డా॥యనమదల మురళీకృష్ణ, వెల: రూ 150, ప్రతులకు: 4-50, పెట్రోల్‌బంక్ దాటాక, ఇంద్రపాలెం, కాకినాడ)**

**– తంగిరాల చక్రవర్తి**

## 'కథాకుసుమాంజలి' అక్కిరాజు

స్మృతి సంవర్ధన మాలికగా, ఆరు ఆణిముత్యాలవంటి కథలను 'కథా కుసుమాంజలి' సంపుటిగా, స్వర్గీయ సహధర్మచరిణి దివ్యస్మృతికి ఆవిష్కరింపచేయడం డా॥అక్కిరాజు రమాపతిరావు హృదయ ఆత్మీయ బాంధవ్య సంస్కారాన్ని దర్శింపచేస్తోంది.



తెలుగునాట ఆరుదశాబ్దాలపైబడి డాక్టర్ రమాపతిరావు లబ్ద ప్రతిష్ఠత సాధించిన అరుదైన, సాహితీవేత్తగా నేటికీ, వేళ్లమీద లెక్కపెట్టగలిగిన రచయితగా, తెలుగు సాహితీసీమను సుసంపన్నం చేస్తున్న ప్రథమశ్రేణి రచనలతో అలరిస్తున్నారు.

భారతీయ సంస్కృతి, మహనీయ సంప్రదాయం, ఆధ్యాత్మిక ఔన్నత్యం కళ్లకు కట్టించగల సాహిత్యంతోపాటు తెలుగుజాతి సాహిత్య, సాంస్కృతిక, ఆధ్యాత్మిక పునరుత్తేజానికి డాక్టర్ రమాపతిరావు వివిధ ప్రక్రియలలో పరమోజ్వల ప్రగాఢ ఉజ్జీవంతో ప్రభావితం చేయగల ప్రతిభాశీలిగా గుర్తింపు పొందుతున్నారు. తొలికథ 'వానలో తడుస్తున్న మనిషి', మనోవిశ్లేషణ భావకాల్పనిక విభిన్న వైజ్ఞానికతతో చదివింప చేస్తుంది. కథాకుసుమాంజలి, ప్రతిభావంతమైన మంజుశ్రీ (అక్కిరాజువారి కలం పేరు) కథల నుండి వెలుగు చూసిన ఆణిముత్యాల వంటి అమూల్య కథాసంపుటి.

**(కథా కుసుమాంజలి, రచన: డాక్టర్ అక్కిరాజు రమాపతిరావు, ప్రతులకు: ఎ.రమాపతిరావు, సాయికృప, డిడి కాలనీ, హైదరాబాద్)**

**– యర్రమిల్లి**



# సౌదీ అరేబియా వారసత్వ సంపద

# అల్-ఉలా

షేక్ అబ్దుల్ హకీం జాని

**అల్-ఉలా అనేది ఉత్తర సౌదీ అరేబియాలోని మదీనా ప్రాంతంలో ఉన్న ఒక పురాతన అరబిక్ ఒయాసిస్ నగరం. ఎడారి ప్రాంతంలో మామూలుగా నీరుగానీ వృక్ష సంపద ఉండదు. కానీ ఎడారిలో కొన్ని ప్రత్యేక ప్రాంతాల్లో నీరు, వృక్ష సంపద లభ్యమౌతాయి. ఇటువంటి ప్రాంతాలకే ఒయాసిస్సులు అంటారు. నబాటిన్ రాజ్యంలో అటువంటి అతిపెద్ద రెండవ నగరం అల్-ఉలా.**

నేడు సౌదీ అరేబియా ఈ నగరాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి పరుస్తుంది. చాలా ఆలస్యంగా ఈ నగరం వెలుగు చూసింది. ఇది అద్భుతమైన లోయలో 29,261 చదరపు కి.మీ. విస్తీర్ణంలో ఎడారి మైదానంలో నెలకొని ఉంది. మదీనా నగరం నుండి సుమారు 380 కి.మీ.దూరంలో అల్-ఉలా నగరం నెలకొని ఉంది. నవీన ప్రపంచానికి మిగిలిన, మరుగున పడిన ప్రాచీన ప్రకృతి సంపద అల్-ఉలా. వర్ణించడానికి భాష చాలని రమణీయమైన ప్రకృతి దృశ్యకావ్యం. అనిర్వచనీయమైన ప్రకృతి ప్రసాదించిన సృజన సంపద. దీన్ని తిలకించి అలౌకికానందం పొందని హృదయం ఉండదంటే అతిశయోక్తి కాదు. లక్షల ఏళ్ల క్రితం ఇక్కడ ఏర్పడిన రాతి పొరలు, ఎర్రని రాళ్లు, సొరంగాలు, కొండలు, అబ్బుర పరిచే మానవ నిర్మిత సమాధులు పర్యాటకుల్ని విశేషంగా ఆకర్షిస్తుంటాయి. సూర్యకిరణాలు ఇక్కడి నిర్మాణాలు, కొండలను పోలిన బండరాళ్లపై పడగానే ఎర్రని వర్ణంతో మెరిసిపోతూ ద్విగుణీకృత అందాలతో సర్వాంగ సుందరంగా అనూహ్యమైన రీతిలో కనిపిస్తాయి.



క్రీ.పూ. 6వ శతాబ్దంలో అల్-ఉలాను కనుగొన్నారు. క్రీ.శ.13వ శతాబ్దంలో అల్-ఉలా నగరాన్ని పునరుద్ధరించారు. మట్టితో నిర్మించిన ప్రాచీన గృహాలు ఇక్కడ ఇప్పటికీ కనిపిస్తాయి. రెండు లక్షల సంవత్సరాల నాటి సౌదీ చరిత్రకు సజీవసాక్ష్యం అల్-ఉలా. ఆధునిక ప్రపంచ వింతల్లో ఒకటిగా 2023లో అల్-ఉలా ప్రాంతం గుర్తింపు పొందింది. అల్-ఉలాలో పురావస్తు శాఖవారు జరిపిన త్రవ్వకాలలో వేల ఏళ్లనాటి దాదాన్, లిహ్యాన్ రాజ్యాల అవశేషాలను గుర్తించారు. ఆనాటి అరబ్ నాగరికతను విశదీకరించేందుకు ఈ అవశేషాలు ఎంతగానో ఉపయోగపడతాయని అధికారులు వెల్లడించారు. నేడు అల్-ఉలా ప్రపంచ ప్రసిద్ధి చెందిన పర్యాటక కేంద్రంగా విరాజిల్లుతుంది. అసాధారణ ప్రదేశంగా ప్రశంసందుకుంటూ సౌదీ సాంస్కృతిక వారసత్వ ప్రదేశంగా ప్రఖ్యాతిగాంచింది అల్-ఉలా. ఇంత ఖ్యాతిగాంచిన ఈ ప్రదేశం ఇటీవల సంవత్సరాలలోనే ప్రపంచ పర్యాటకుల దృష్టిని ఆకర్షించింది. 2022 సంవత్సరం చివర నుండి సౌదీ ప్రభుత్వం ఈ ప్రదేశాన్ని ప్రపంచ పర్యాటకుల కోసం తెరిచింది. ఇక్కడ ఇప్పటివరకు అయిదు శాతం మాత్రమే పురావస్తు పరిశోధనలు జరిగాయి. పూర్తిస్థాయిలో పరిశోధనలు జరగవలసి ఉంది. ఈ పరిశోధనలు వేగంగా జరిగినట్లైతే లక్షల సంవత్సరాల

చరిత్రను కలిగి వున్న అల్-ఉలాలో సహజమైన, మానవ నిర్మిత సమాధులు, చారిత్రక నివాసాలు, స్మారక చిహ్నాలు, మ్యూజియంలు ఉన్నాయి. అల్-ఉలాలో పురాతన నగరం ఉంది. ఇది యునైటెడ్ నేషన్ వరల్డ్ టూరిజం ఆర్గనైజేషన్ ద్వారా ఉత్తమ పర్యాటక గ్రామంగా పురస్కారం అందుకుంది. 2008లో దీన్ని యునెస్కోవారు ప్రపంచ వారసత్వ ప్రదేశాల జాబితాలో చేర్చారు. సౌదీ అరేబియాలో యునెస్కోవారు వారసత్వ ప్రదేశంగా ప్రకటించిన తొలి ప్రదేశం అల్-ఉలా. ప్రకృతి సిద్ధంగా ఏర్పడిన శిలలు కొన్నైతే, మరికొన్ని శిలలను చెక్కి గృహాలుగా కూడా మార్చారు. అల్-ఉలాలో చూడదగిన అనేక ప్రదేశాలు ఉన్నాయి. అల్-ఉలా ప్రాచీన నగరం, నేచురల్ రాక్‌ప్లేస్, ఎలిఫెంట్ రాక్, అల్-ఉలా ఎడ్వంచెర్ హబ్, హెరిటేజ్ వీవ్ పాయింట్ ఇత్యాదివి. మదాయిన్ సాలిహ్‌లో హాట్ ఎయిర్ బెలూన్‌లో విహరిస్తూ ఈ పురాతన నగర అందాలను తిలకించవచ్చు. మాస్క్ ఆఫ్ బోనస్, జబల్ అల్ అహ్మర్, ఇత్లిల్, లిహ్యాన్ సన్ ఆఫ్ కుజా సమాధి, ముసాఫిర్ వేవ్, వింటర్ పార్క్‌తో టు 10వ శతాబ్దానికి చెందిన మూసాబిన్ నుసైర్ కోట చూడదగినవి. జబల్ ఇక్మా వద్ద 2,500 సంవత్సరాల నాటి శాసనాలు భద్రపరచి ఉన్నాయి.



అల్-ఉలాలో 16 వందల కంటే ఎక్కువ నియోలిథాన్ రాతి స్మారక చిహ్నాలు కనుగొన్నారు. 7వేల సంవత్సరాల క్రితమే ఇక్కడ అద్భుతమైన నాగరికత ఉంది. 2021లో జరిగిన త్రవ్వకాలలో ఇక్కడి ప్రజలు క్రీ.పూ.4వేల సంవత్సరాల కాలంలోనే పెంపుడు జంతువులను పెంచినట్లు సాక్ష్యాలతో కనుగొన్నారు. ఆ తరువాత 2023లో జరిగిన త్రవ్వకాలలో రెండులక్షల సంవత్సరాల నాటి 51 సెం.మీ పొడవైన గొడ్డలిని పురావస్తు శాఖవారు అల్-ఉలాలో కనుగోన్నారు. దాదన్ రాజ్యంలో ప్రజలు భూగర్భ జలాల నీటిని వెలికి తీసేందుకు బావులను నిర్మించారు. నీటిని భద్రపరచుకోవడానికి నీటి తొట్టెలను కూడా నిర్మించారు. గోధుమ, బార్లీ, ఖర్జూరం పండించిన ఒక వ్యవసాయ కేంద్రంగా ఆ కాలంలోనే అల్-ఉలాను తీర్చిదిద్దారు. నేడు ఈ ప్రాంతంలో 2. 3 మిలియన్ల ఖర్జూరపు చెట్ల ద్వ 90వేల టన్నుల కంటే ఎక్కువగా ఖర్జూరాన్ని ఉత్పత్తి చేస్తున్నారు. ఖర్జూరపు చెట్ల నీడన వైద్యానికి పనికి వచ్చే వన మూలికలను కూడా పెంచుతున్నారు. ప్రతి ఏడాది జనవరిలో ఇక్కడ 15వేల టన్నుల సిట్రస్ పండ్లను ఉత్పత్తి చేసి సిట్రస్ ఫెస్టివల్ జరుపుతారు.

## ఎలిఫెంట్ రాక్

అల్-ఉలాలో సందర్శించదగిన ప్రదేశాలలో ఒకటి ఎలిఫెంట్ రాక్. ఇది 52 మీటర్ల ఎత్తులో చిన్నపాటి కొండలా కనిపించే ఈ బండరాయి ఏనుగు ఆకారంలో ఉంటుంది. లక్షలాది సంవత్సరాల క్రితం సహజసిద్ధంగా ఇది ఏర్పడినది. ఎలిఫెంట్ రాక్‌ను అరబ్బీ భాషలో జబల్ ఆల్ఫిల్ అని పిలుస్తారు. సౌదీ అరేబియా ఇతిహాసాలు, జానపద గాథలతో ఎలిఫెంట్ రాక్ ముడిపడి ఉంది. ఇది ఏకలశిలలో ఉన్నది. ఇలాంటి అనేక కొండల వంటి శిలలు, రమణీయ శిలాతోరణాలు ఇక్కడ కానవస్తాయి. అల్-ఉలా పురాతన గ్రామం నుండి ఈశాన్యం వైపుకు 20 నిమిషాలలో కారులో ఎలిఫెంట్ రాక్‌కు చేరుకోవచ్చు.

ఎలిఫెంట్ రాక్‌కు సమీపంలో ఫేస్‌రాక్ ఉంది. ఇక్కడకు చేరుకోవాలంటే ఇసుకలో నడవాలి. లేదంటే ఇసుకపై పరుగులు తీసే ప్రత్యేక చక్రాలు కలిగిన కార్లో ప్రయాణించి చేరుకోవచ్చు. ఆ సమీపంలోనే వెసెల్‌రాక్ ఉంది. దీన్ని చూడటానికి కొండ ఎక్కవలసి ఉంటుంది. కొన్ని ప్రత్యేకమైన కార్లలో కూడా ఇక్కడికి చేరుకోవచ్చు. అవకాశం లేనివారు నడచుకుంటూనే వెసెల్‌రాక్‌ను చేరుకుంటారు. ఇక్కడ చూడదగిన తొలి ప్రదేశం హెగ్రా. ఇది చాలా పురాతన, చారిత్రక ప్రదేశం. హెగ్రా ప్రాంతాన్ని ల్-హిజ్ర్, మదాయిన్ సాలిహ్ అనే పేర్లతో కూడా పిలుస్తారు. ఇక్కడ 111 స్మారక సమాధులు ఉన్నాయి. క్రీ.పూ.800 నుండి 100 వరకు ఇక్కడ దాదాన్, లిహ్యాన్ రాజ్యాలు ఉండేవి. ఆ తరువాత నబాటియన్ నాగరికతలో ఒక ముఖ్యమైన నగరం హెగ్రా. ఇక్కడ అత్యంత ప్రసిద్ధి చెందిన సమాధి కసర్ అల్ ఫరీద్. హెగ్రాలో ఉన్న సమాధుల్లో ఇదే అతి పెద్దది. 2,500 సంవత్సరాల క్రితం నబాటియన్లచే నిర్మించబడిన హెగ్రాకు జోర్డాన్‌లోని పెట్రాతో సమీప పోలికలున్నాయి. 1968లో లండన్ విశ్వవిద్యాలయానికి చెందిన పురావస్తు శాస్త్రజ్ఞుల బృందం ఇక్కడ లభించిన 15 శాసనాలను పరిశోధించింది.

అల్-హిజ్ర్‌లో కాంస్యయుగం నాటి సాక్ష్యాలు లభించాయి. ఇక్కడ తిలకించదగిన మరో ప్రదేశం మదాయిన్ సాలెహ్. ఇక్కడ ఉన్న సమాధుల్లో ఇది అతి పెద్దది. మదాయిన్ సాలిహ్‌లో ఒక మ్యూజియం ఉన్నది. ఈ ప్రాంతంలో బయల్పడిన పురావస్తు ఈ మ్యూజియంలో భద్రపరిచారు. ప్రవక్త సలేహ్ పేరు మీదుగా దీనికి సలేహ్ నగరం అని పిలుస్తారు. అల్-ఉలాలోని అంత్యక్రియల ఆలయంలో దాదానైట్ విగ్రహాలు కనుగొనబడ్డాయి. ఇక్కడ అతి ప్రాచీనమైన అల్ హిజాకు చెందిన రైలు ఉంది. ఈ రైలు 1906లో ప్రారంభమై పదేళ్లపాటు నడిచింది. డెమస్కస్ నుండి మదీనా వరకు ఈరైలు ప్రయాణం సాగుతుంది. ఒట్టమన్ సుల్తాన్ రెండవ అబ్దుల్ హమీద్ ఆదేశాలమేరకు ఇక్కడ రైల్వే స్టేషన్ నిర్మించారు. ఈ ప్రాంతంలో హజ్‌యాత్ర చేయాలను కుంటే నడిచి వెళితే కొన్ని రోజులు చాలా పట్టేది. ఈ రైలు ప్రారంభమైన తరువాత నాలుగు రోజుల్లోనే గమ్యాన్ని చేరుకునే వారు. 1912 దాదాపు 19వేల మంది మదీనా చేరుకున్నారు. కొందరు శత్రుమూకలు ఈ రైలుకు నష్టం వాటిల్లేలా చేశారు. 1970లో సౌదీ ప్రభుత్వం ఈ రైలును తిరిగి పునరుద్ధరించాలని తీవ్రకృషి చేసింది. కానీ ఆ పనిలో విజయం సాధించలేక పోయారు. అల్-ఉలా పాత పట్టణం హెగ్రాలోని కసర్ అల్-ఫరీద్ సమాధి, జబ్లే ఇత్‌లిబ్, వాడి ఆశర్, జబెల్ ఇక్మా,

**(మిగతా 19వ పేజీలో)**

కథ

# జిరాఫీ గర్వభంగం

ఆ మర్రిచెట్టు ఎన్నో వేల సంవత్సరాల నుండి పక్షులకు, జంతువులకు ఆవాసమై ఉంటోంది. ఆ చెట్టుకు దగ్గర్లో ఒక నీటికొలను ఉంది. ఆ చెట్టుకు తూర్పువైపు పెద్ద ఎడారి ఉంది. పడమరవైపు అడవి ఉంది. రెండువైపులా జంతువులు నీడ, నీరు కోసం మర్రిచెట్టు దగ్గరకు వచ్చిపోతూ ఉండేవి. అలా జంతువులకు స్నేహబంధాలు ఏర్పడ్డాయి. ఇందులో జిరాఫీ, ఒంటె స్నేహబంధం ఒకటి. జిరాఫీ అందంగా ఉన్నానని, పొడవైన మెడ ఉందని, అడవిలో వేగంగా పరుగెత్తగలనని గర్వపడేది. 'మీలో ఎవరైనా నాతో పరుగుపందెంకు సిద్ధం కండి చూద్దాం' అని జంతువులకు సవాల్ విసిరేది. జంతువులు దాని ఆటలను పట్టించుకునేవి కావు. ఒంటెను తక్కువ చేసి మాట్లాడుతూ 'పరుగు పందెంలో నన్ను ఓడించగలవా?' అని పదేపదే రెచ్చగొట్టేది. ఒకరోజు ఒంటె విసుగు చెంది 'మిత్రమా! ఈరోజు పరుగు పందానికి నేను సిద్ధం' అని సవాలు విసిరింది. విజయం తనదేనన్న గర్వంతో జిరాఫీ మాట్లాడుతూ 'నాకు ఎక్కడైనా సరే. నీ ఇష్టమైన చోటు నిర్ణయించుకో' అన్నది. అడవి మొదట్లో నుండి బయలుదేరి ఎడారిలోపల పది కిలోమీటర్ల ఖర్జూరం చెట్టు వరకు చేరుకోవడం లక్ష్యమని ఒంటె నిర్ణయించింది. గుర్రాలు న్యాయనిర్ణేతలుగా, జంతువులు, పక్షులు ప్రేక్షకులుగా ఉన్నాయి. పక్షులుశంకాలరు ఊదినట్లు శబ్దం చేశాయి. పోటి ప్రారంభమైంది. జిరాఫీ ఆత్రుతగా, వేగంగా పరుగు ప్రారంభించింది. ఒంటె, జిరాఫీ అడవి నుండి ఎడారిలో ప్రవేశించాయి. ఎడారిలో ఏనాడూ నడవని జిరాఫీ కాళ్లు ఇసుకలో కూరుకుపోతున్నాయి. దారిలో కిందపడి పైకి లేస్తూ ఆయాస పడుతూ ఉంది. ఒంటె అడవిలో మెల్లిగా నడిచి, తనకు అలవాటైన ఎడారిలో వేగంగా పరుగెడుతూ వెనక్కి తిరిగి చూడకుండా లక్ష్యం చేరుకుంది. కానీ అక్కడికి జిరాఫీ చేరనే లేదు. వెనక్కి తిరిగి చూస్తే జిరాఫీ కనపడలేదు.



పైన ఎగురుతున్న పక్షులు జిరాఫీతో ఒంటె గమ్యం చేరిందని చెప్పి మర్రిచెట్టు దగ్గరకు పిల్చుకుని వచ్చాయి. జిరాఫీ తన ఓటమిని అంగీకరించింది. తన ప్రవర్తనకు క్షమాపణ చెప్పింది. మన మధ్య పోటీలు వద్దు. అందరం సమానమే. అడవిని కాపాడుకోవడమే మన లక్ష్యమని జంతువులు తీర్మానం చేశాయి. అహంకారం పతనానికి సోపానమని తెలుసుకొని జిరాఫీ అందరితో కలిసి హాయిగా జీవించసాగింది.

– హేమావతి రాజన్న



రంగులు వేయండి

## బాలగేయం

### కలసి మెలసి ఉందాం



స్వార్థం వీడుదాం
మంచిని పెంచుదాం
కష్టలు, కార్పణ్యాలు
పారద్రోలుదాం
పగలు, ప్రతీకారాలకు
తిలోదాకాలిద్దాం
కుల, మత బేధాలకు
దూరంగా ఉందాం
కలిసిమెలసి ఉందాం
సమైక్యతతో ముందుకు
కదులుదాం
సహకారమే మన
లక్ష్యమందాం
దేశానికే సర్వం
దారపోద్దాం
ప్రగతిని సాధిద్దాం
దేశ ఔన్నత్యం పెంచుదాం
భావితరాలకు
ఆదర్శమవుదాం
ఈ విశ్వానికే ఊపిరవుదాం
త్రివర్ణ పతాకం
ఎగురవేద్దాం.

– కనుమ ఎల్లారెడ్డి

## హలో ఫ్రెండ్...

**చిన్నారుల ప్రశ్నలకు**

**వార్త సిఎండి, మేనేజింగ్ ఎడిటర్**

## గిరీష్ అంకుల్ సమాధానాలు

– **కె.పారిజాతం,** వరంగల్

ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. మనం నిద్రలో ఉన్నప్పుడు మన మెదడులో ఏం జరుగుతుంది?

**జవాబు: పారిజాతం!** మన నిద్రలో ప్రధానంగా అయిదు దశలుంటాయి. అవి:

➡ మగత: కండరాలు విశ్రాంతిగా ఉంటాయి. మనం నిద్ర, మెలకువల మధ్య తారాడుతుంటాం. శరీర ఉష్ణోగ్రత తగ్గటం ఆరంభమవుతుంది. శరీర కదలికలు తగ్గుతుంటాయి. ఒక్కోసారి కళ్లముందు చిన్న చిన్న దృశ్యాలు కూడా తారాడుతుంటాయి.

➡ సంధి: గుండెవేగం, శ్వాసవేగం తగ్గుతాయి. క్రమేపీ మెదడులో చైతన్యం తగ్గిపోతుంటుంది. గురక ఆరంభం కావచ్చు. మన దేహం ఎప్పుడన్నా కదులుతుండవచ్చు.

➡ నిద్ర: ఉష్ణోగ్రత, గుండె కొట్టుకునే వేగాలు ఇంకా తగ్గుతాయి. ఈ దశలో మెదడులోని విద్యుత్ ప్రేరణలు బాగా తగ్గుతాయి.

➡ గాఢనిద్ర: మెదడులో విద్యుత్ ప్రేరణలు చాలాచాలా తక్కువగా ఉంటాయి. శరీరం దేనికీ స్పందించనంత భారంగా తయారవుతుంది. ఉష్ణోగ్రత, గుండెవేగం బాగా తగ్గుతాయి.

➡ కల(త)ల నిద్ర: ఈ దశను ఇంగ్లీష్‌లో 'ర్యాపిడ్ ఐ మూమెంట్-రెమ్' అంటారు. ఈ దశలో దేహం కదలదుగానీ మన కళ్లు మాత్రం విపరీతమైన వేగంతో గిరగిరా కదులుతుంటాయి. మనం కలలుగనేది ఆ దశలోనే. మెదడు మనం మెలకువగా ఉన్నప్పుడు ఎంతగా పని చేస్తుందో ఇప్పుడు కూడా దరిదాపుగా అంతే చేస్తుంటుంది. శరీర ఉష్ణోగ్రత, శ్వాస, నాడివేగం పెరుగుతాయి. ప్రధాన కండరాలన్నీ నిశ్చేతనంగా బిగువుగా వుంటాయి. కొన్నిసార్లు కాలివేళ్లు, చేతివేళ్లు మాత్రం కదులుతుండవచ్చు. శ్వాస క్రమంలో ఉండకపోవచ్చు.

**పూర్వకాలం నుంచి వెనిగర్‌ని తయారుచేస్తూ ఉన్నారు. రైస్‌వైన్ నుంచి దీనిని తయారు చేస్తారు. ఇది తెలుపు, ఎరుపు, నలుపు రంగుల్లో దొరుకుతుంది. ఇందులో తెలుపు వెనిగర్‌ని కూరగాయల్ని పచ్చళ్లు పెట్టినప్పుడు ఉపయోగిస్తారు. రెడ్ వెనిగర్‌ని సాస్ తయారు చేసినప్పుడు ఉపయోగిస్తారు. వెనిగర్‌ను విదేశాల్లో 'సోర్‌వైన్'గా పిలవబడే వెనిగర్‌ను పోషకాలను ఇచ్చే ఆహారంగానే కాక, అనేక ఔషధాల్లో దీన్ని ఉపయోగిస్తారు. కొంతమంది వైద్యులు దీన్ని 'ఫాదర్ ఆఫ్ మెడిసిన్' అని కూడా అంటారు.**

# పలు ఉపయోగాల వెనిగర్

తరిగొప్పుల విఎల్లెన్ మూర్తి



వెనిగర్‌ని పచ్చళ్లు, మాంసాహార వంటకాల్లో నిల్వకారకంగా ఎక్కువగా వాడతారు. దీనిలో రెండు రకాలుంటాయి. ఒకటి బ్రూడ్ వెనిగర్. దీనిని సహజమైన ఆహార పదార్థాల నుంచి తయారు చేస్తారు. బంగాళదుంపలు, యాపిల్, బియ్యం, తేనె ఇలా వివిధ పదార్థాల నుంచి తయారు చేస్తారు. వెనిగర్‌ని 'ఫంక్షనల్ ఫుడ్' అంటారు. అంటే ఒక పక్క పోషకాలు అందిస్తూ, మరోపక్క కొన్ని రకాల అనారోగ్య కారకాలకు చెక్‌పెడుతుంది. దీనిలోని సి విటమిన్ వ్యాధి నిరోధక శక్తిని పెంచుతుంది. పచ్చళ్లు, మాంసాహార వంటకాలను బ్యాక్టీరియా వైరస్‌ల నుంచి రక్షణగా నిలుస్తుంది. పొటాటోవెనిగర్, స్పైసెస్ వెనిగర్, మాల్ట్, హని, మొలాసిస్ వెనిగర్ వంటివి వివిధ రుచుల్లో లభిస్తాయి. ఇక రెండోరకం ఆర్టిఫిషియల్ వెనిగర్. పల్చగా చేసిన ఎసిడిక్ యాసిడ్ ఇది. ఇది కూడా తినడానికి అనువైనదే. కాబట్టి వంటల్లో వెనిగర్‌ని నిర్భయంగా వాడుకోవచ్చు. వేలసంవత్సరాల నుండే ప్రాచీనులు వాడినట్లుగా చరిత్ర చెబుతున్నది. ఈజిప్ట్‌లో క్రీ.శ 3000 సంవత్సరంలోనే దీని వాడేవారట. చైనాలో సుమారు 2000 క్రీ.పూ దీని వాడకం ఉండేదంటారు. సారా తయారు చేసినట్లే వెనిగర్‌ని పిండిపదార్థాలు, చెక్కెరలు ఫెర్మెంటేషన్ చేసినందున ఇథనాల్ మొదటి ప్రొడక్ట్‌గా వస్తుంది. ఇథనాల్‌ని 'ఎసిటిక్ యాసిడ్ బాక్టీరియా' వల్ల ఆక్సిడేషన్ చేయడం ద్వారా ఎసిటిక్ యాసిడ్ వస్తుంది. ఇథనాల్‌ని వైన్, సిడర్, బీర్, పండ్ల రసాలు, నేచురల్ గ్యాస్, పెట్రోలియం డెరివేటివ్‌ల నుండి పొందవచ్చు. వ్యాపార అవసరాల కోసం వెనిగర్‌ను వారాలు, నెలలు ఫెరెంటేషన్ చేసి తయారు చేస్తారు. వెనిగర్‌లో ముంచిన బట్టతో తుడిస్తే టైల్స్, అల్మరాలు, ఫ్రిజ్ వంటివన్నీ కళకళలాడతాయి. ఫ్లవర్‌వాజ్‌లోని నీటిలో కాస్త వెనిగర్ వేస్తే పూలు ఎక్కువ సేపు తాజాగా ఉంటాయి. ఓ చెంచాడు వెనిగర్ వెక్కిళ్లను చప్పున ఆపేస్తుంది. నీటిలో వెనిగర్‌ను కలిపి చల్లితే, చీమలు దరిదాపుల్లోకి కూడా రావు. వెనిగర్‌లో ముంచిన బట్టతో బాగా రుద్ది, ఆ తర్వాత లాగేస్తే, కొత్త వస్తువుల మీద స్టిక్కర్లు తేలికగా ఊడివస్తాయి. కూరల్లో కారం, మసాలా ఎక్కువైనప్పుడు కాస్త వైట్ వెనిగర్ కలిపితే ఘాటు తగ్గుతుంది. వెనిగర్ కలిపిన నీటిని చల్లితే మొక్కలకు పురుగు పట్టదు. చాలామంది మహిళలు తమ శిరోజాల సౌందర్యం కోసం ప్రత్యేక శ్రద్ధ చూపిస్తారు. ముఖ్యంగా..తమ వెంట్రుకలు నిగనిగలాడేందుకు ఎన్నో విధాలుగా కుస్తీలు పడుతుంటారు. కాంతిహీనంగా కనిపిస్తున్న వెంట్రుకలు షాంపుతో తలస్నానం చేసి, ఆ తర్వాత రెండు టేబుల్ స్పూన్ల వెనిగర్ తీసుకుని తలకి బాగా పట్టించి కడిగేయాలి. చుండ్రుతో ఇబ్బందిపడుతుంటే రాత్రి పడుకునే సమయంలో రెండు టీ స్పూన్ల వెనిగర్‌లో ఆరు టీస్పూన్ల నీళ్లు కలిపి రెండు చేతులతో తీసుకుని వెంట్రుకల కుదుళ్లకు బాగా పట్టించి తలకు టవల్ చుట్టుకోవాలి. అనంతరం ఉదయం లేవగానే మరోసారి ఇలాగే చేసి తలస్నానం చేయాలి. ఈవిధంగా వారానికి రెండు, మూడుసార్లు చేస్తే చుండ్రు తగ్గుతుంది. అజీర్తితో బాధపడే వారికి ఇది మంచి రెమిడి. ముసలితనం వచ్చే ముందు కలిగే లక్షణాలు కూడా తగ్గిస్తుంది. దీనిలో ఉండే ఎసిటిక్ యాసిడ్ కొవ్వును తగ్గిస్తుంది. ఇది చర్మం నిగారింపుగా ఉంచుతుంది. ఆపిల్ సైడర్ వెనిగర్‌ను తలంతా తడపాలి. జుట్టు డ్రై అయిన తర్వాత టీట్రీ ఆయిల్‌ను అప్లై చేయాలి. ఇప్పుడు తలను దువ్వుకొని, డ్రై అయ్యే వరకూ అలాగే



ఉంచాలి. కొబ్బరినూనెకు ప్రత్యామ్నాయంగా ఆలివ్ ఆయిల్ సురక్షితం. దీన్ని ఉపయోగించడం వల్ల జుట్టుకు మరింతగా న్యూరిష్ చేస్తుంది. తర్వాత గోరువెచ్చని నీటితో శుభ్రంగా తలస్నానం చేయాలి. తిరిగి ఆపిల్ సైడర్ వెనిగర్‌ను తలపై పోసుకోవాలి. ఇలా నెలకు రెండుసార్లు చేస్తే చుండ్రును నివారించుకోవచ్చు. మెంతి ఆకులను మెత్తగా పేస్ట్ చేసి అందులో ఒక కప్పు ఆపిల్ సైడర్ వెనిగర్‌తో తలస్నానం చేయాలి. ఈ రెండు పదార్థాలలో బ్లీచింగ్ లక్షణాలుండటం వల్ల చుండ్రును చాలా ఎఫెక్టివ్‌గా పోగొడుతుంది. కడుపులో మంట, అజీర్ణం వంటి లక్షణాలను తగ్గించడంలో యాపిల్ సైడర్ వెనిగర్ బాగా పనిచేస్తుంది. సింపుల్‌గా టీస్పూన్ యాపిల్ సైడర్ వెనిగర్‌ను తీసుకుంటే చాలు. అది సహజసిద్ధమైన అంటాసిడ్‌గా పనిచేసి కడుపులో ఏర్పడే సమస్యలను తొలగిస్తుంది. కొత్తబట్టలు మొదటిసారి ఉతికేటప్పుడు ఆ నీటిలో చిన్న కప్పు వెనిగర్ వేస్తే అవి రంగులుపోకుండా వుంటాయి. వంట పాత్రలని, ఓవెన్ని, వెనిగర్‌తో శుభ్రం చేస్తే మరకలు పోయి, ఎలాంటి క్రిమికీటకాలు చేరకుండా వుంటాయి. కొన్ని కూరలు త్వరగా ఉడకవు. అలాంటప్పుడు కొంచెం వెనిగర్ వేస్తే అవి త్వరగా ఉడుకుతాయి. కోడి గుడ్లు ఉడికించేటప్పుడు ఒక టీ స్పూన్ వెనిగర్ వేస్తే తెల్ల సొన బయటకు రాకుండా వుంటుంది. వెనిగర్‌తో చేతులు రుద్దుతుంటే, మృదువుగా వుంటాయి. యాపిల్ సైడర్ వెనిగర్ వల్ల పలు అనారోగ్య సమస్యలను కూడా నయం చేసుకోవచ్చు. అనేక రకాల పోషకపదార్థాలకు నిలయం యాపిల్ సైడర్ వెనిగర్. సిట్రిక్ యాసిడ్, ఫార్మిక్



యాసిడ్, మాలిక్ యాసిడ్, లాక్టిక్ యాసిడ్, సక్సీనిక్ యాసిడ్, ఎసిటిక్ యాసిడ్ వంటివి ఇందులో ఉంటాయి. యాపిల్ పండ్లలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు తదితర ఇతర పోషకాలన్నీ దాదాపుగా ఇందులోనూ ఉంటాయి. అందువల్ల శరీరరోగ నిరోధక శక్తి పెరుగుతుంది. వ్యాధుల నుంచి రక్షణ లభిస్తుంది. ఇన్‌ఫెక్షన్లుపోతాయి. రక్తంలోని చక్కెర స్థాయిలను యాపిల్ సైడర్ వెనిగర్ గణనీయంగా తగ్గిస్తుంది. శరీరం ఇన్సులిన్ ఉపయోగించుకునే శాతాన్ని, ఇన్సులిన్ యాక్టివిటీని పెంచుతుంది. టైప్ 2 డయాబెటిస్‌తో బాధపడుతున్న వారికి ఇది చక్కగా పని చేస్తుంది. హానికరమైన బాక్టీరియాను నిర్మూలించడంతోపాటు శరీరంలోని విషపదార్థాలను యాపిల్ సైడర వెనిగర్ తొలగిస్తుంది. వెంట్రుకలకు సహజద్ధిమైన కండిషనర్‌గా, దంతాలను శుభ్రం చేసే ద్రావకంగానూ పనిచేస్తుంది. ఆహార పదార్థాలకు డ్రెస్సింగ్ చేయడంలో, మారినేడ్స్, సాసెస్, గ్రేవీస్, పికిల్స్ తయారీలో దీన్ని వాడుతారు. యాపిల్స్ నుంచి తయారైనప్పటికీ ఇందులో దానికి సంబంధించిన రుచి తక్కువగానే ఉంటుంది. సాధారణ వెనిగర్‌కు ఉండే వాసన దీనికి తక్కువగా ఉంటుంది. యాపిల్ సైడర్ వెనిగర్‌తో గొంతు వాపు కూడా తగ్గుతుంది. దీన్ని కొద్దిగా తీసుకుని ఒక గ్లాస్ గోరు వెచ్చని నీటిలో కలపాలి. అనంతరం ఈ మిశ్రమాన్ని గొంతులో పోసుకుని పుక్కిలించాలి. దీంతో గొంతులో ఏర్పడేవాపు, నొప్పి తగ్గుతాయి. టెడ్ ఆపిల్ సైడర్ వెనిగర్‌తో స్నానం చేయండి. ఇలా చేయటం వలన సూర్య కాంతి వలన ప్రమాదానికి గురైన చర్మం కొద్ది సమయంలోనే తిరిగి తన సహజకాంతిని పొందటం గమనిస్తారు. ●

## సౌదీ అరేబియా వారసత్వ సంపద అల్-ఉలా

**(15వ పేజీ తరువాయి)**

ఆల్ ఉలా ఒయాసిస్, తంతురా కోట, మరాయ కాన్సర్ట్ హాల్ ఇత్యాదివి చూడదగిన ప్రదేశాలు. కొండలను పోలిన అతిపెద్ద ఆకారాల బండరాళ్ల, వాటిమధ్య సుందర సరస్సులను తలపించే నీరు అద్భుత ప్రకృతికి తార్కాణంగా నిలుస్తుంది. ప్రపంచంలోనే అతిపెద్ద అద్దాల భవనం మరాయ ఇక్కడ ఉంది. అరబ్బీ పదం మరాయ అంటే అద్దము అని అర్థం. ఇది సౌదీ అరేబియా ఆధునిక చిహ్నంగా విరాజిల్లుతుంది. 9,740 గాజు పలకలను దీని నిర్మాణానికి ఉపయోగించారు. అల్-ఉలా ప్రాంతంలో ఇదో ప్రత్యేక ఆకర్షణ. మరాయ కాన్సర్ట్ హాల్ ప్రపంచంలోనే అతిపెద్ద అద్దాల భవనంగా ఖ్యాతినార్జించి గిన్నిస్ వరల్డ్ రికార్డ్‌లో స్థానం పొందింది. ఇందులో 500మంది సమావేశం కావడానికి అనువైన స్థలం ఉంది. అంతర్జాతీయ సంగీత కచేరీలు, ఆర్ట్ ఎగ్జిబిషన్లు, పలు రకాల వంటల ప్రదర్శనలు ఈ అద్దాల మహలులోని వేదికపై జరుగుతుం టాయి. ఆండ్రియా బోసెల్లి వంటి ప్రముఖ సంస్థలు, జేమ్స్‌బ్లంట్ వంటి ప్రసిద్ధ గాయకుడు, గేయరచయిత ఇత్యాది అనేకమంది ఇక్కడ ప్రదర్శనలిచ్చారు. అల్-ఉలాలో మరో



ముఖ్యమైన పర్యటన స్టార్‌గేజింగ్ టూర్. రాత్రి పూట అల్-ఉలాలోని ఘరామీల్ ప్రాంతాన్ని సందర్శించి వేలాది నక్షత్రాలను వీక్షించవచ్చు. ఇదో అద్భుతమైన మధురానుభూతి అని చెప్పవచ్చు. యునైటెడ్ నేషన్స్ వరల్డ్ టూరిజం ఆర్గనైజేషన్ వారు 32 గ్రామాల జాబితాలో అల్-ఉలా పురాతన గ్రామాన్ని ఉత్తమ పర్యాటక గ్రామాలలో ఒకటిగా ఎంపిక చేసిందని రాయల్ కమీషన్ ఫర్ అల్-ఉలా ప్రకటించింది. పరిశోధన, పునరుద్ధరణ ద్వారా గ్రామాలకు సమగ్ర పర్యాటకాన్ని వర్తింపజేయడం వల్ల 2022లో 32 ఉత్తమ పర్యాటక గ్రామాలలో అల్-ఉలా ఎంపిక చేయబడిందని రాయల్ కమిషన్ ఫర్ అల్-ఉలా తమ అధికారిక ట్విట్టర్ ద్వారా ప్రకటించింది. వింటర్ ఎట్ తంతోరా ఫెస్టివల్‌లో భాగంగా సౌదీ అరేబియా సంగీతం, కళ, ఆహారంతో కూడిన మూడురోజుల పండుగను మార్చి 2020లో జరిపారు. చాలా చరిత్ర ఉన్న ప్పటికీ అల్-ఉలా ఆలస్యంగానే వెలుగు చూసిందని చెప్పాలి. సౌదీ చరిత్రకు సాక్షీ భూతంగా నిలిచివున్న అల్-ఉలాను అభివృద్ధి చేయడానికి ఒక సంస్థను 2023లో ప్రారం భించారు. సౌదీ విజన్ 2030 ప్రాజెక్టులో అల్-ఉలాను అద్భుతమైన ప్రపంచ ప్రసిద్ధి చెందిన పర్యాటక కేంద్రంగా మార్చాలనే సంకల్పంతో కృషి చేస్తున్నారు. ●

కథ

# నిర్ణయం

ఎం.వెంకటేశ్వర రావు

"శైలజా! శైలజా!" ఆదుర్దాగా లోపలికి వచ్చిన చక్రపాణిని చూసి "ఏంటి మావయ్యా! అంత కంగారు పడుతున్నారు? ముందొచ్చి కూర్చోండి. కూల్.." అంది లాప్టాప్ చూస్తున్న శైలజ.

"కూల్ ఏంటమ్మా? కూల్.. నిన్న మీ నాన్న ఏం చేశాడో తెలుసా?"

"మా నాన్న అంత తప్పేం చేశారు?" అంది ఎప్పట్లా ఆయన ఏం చెప్పబోతున్నాడో తెలిసిన శైలజ.

"నిన్న వృద్ధాశ్రమానికి వెళ్లి కొత్తగా కడుతున్న బిల్డింగ్‌కి డొనేషన్ ఎంత ఇచ్చాడో తెలుసా!?"

"ఎంత ఇచ్చాడేంటి?"

"అక్షరాలా..." అని పది వేళ్లు చూపించాడు.

"పది వేలా?"

"వేలైతే ఇంతగా ఎందుకు చెబుతాను. పది లక్షలమ్మా! పది లక్షలు. అదీ చాలకపోతే ఇంకా కావాలంటే అడగండి" అని చెప్పొచ్చాడు.


"సరే.. దీనికి మీరెందుకు టెన్షన్ పడుతున్నారు మావయ్యా? అది ఆయన డబ్బు. ఆయన ఇష్టం".

"ఏంటి శైలమ్మా! నువ్వు కూడా ఇలా మాట్లాడుతున్నావు? ఇలా వెళ్లిన చోటల్లా మీ నాన్న దానధర్మాలు చేస్తూ పోతే రేపు నీ భవిష్యత్తు ఏం కావాలి? ఐదు వేలు, పది వేలు ఇవ్వడం దాటి.. ఏకంగా లక్షల్లోకి పోతే నీకింకా పెళ్లి కాలేదు. ముందు ముందు బోలెడన్ని ఖర్చులుంటాయి. మొన్నటికి మొన్న అనాథ పిల్లల ఆశ్రమానికి మూడు లక్షలు ఇవ్వటం నా కళ్లతో చూశాను" అన్నాడు ఆపకుండా.

"మామయ్యా! నాన్న డొనేట్ చేసింది ఆయన సంపాదించిందేగా! మా నాన్నకి వారసత్వంగా ఒక్క పైసా కూడా రాలేదు. ఆయనను అడిగే హక్కు నాకూ లేదు, మీకూ లేదు" అంది.

చక్రపాణి ఏదో చెప్పబోతుంటే అడ్డుపడి,

"మావయ్యా! నాకు మా నాన్న సంపాదన మీద ఆధారపడటం అస్సలు ఇష్టం లేదు. నాకంటూ కొన్ని గోల్స్ ఉన్నాయి. అనవసరంగా మా నాన్న గురించి ఆలోచించి



టెన్షన్ పడకండి. ఆరోగ్యం జాగ్రత్త. నాకు టైమవుతోంది" అని హ్యాండ్ బ్యాగ్ తీసుకుని కారులో బయలుదేరింది. కారులో స్పాటిఫైలో ఇళయరాజా మెలోడీస్ ఆన్ చేసింది ఇరవై నాలుగేళ్ల శైలజ.

.........

శైలజ తండ్రి రామ్మోహన్‌కి పదేళ్ల వయసున్నప్పుడు బస్సు ప్రమాదంలో తల్లీ, దండ్రీ మరణించారు. ఆ తర్వాత రామ్మోహన్ ఆలన, పాలనా చూడాల్సిన బంధువులు ఎవరూ ముందుకు రాకపోవడంతో ఆశ్రమ పాఠశాలలో రామ్మోహన్ చదువుకుంటూ పెరిగి పెద్దయ్యాడు. రామ్మోహన్ ఆశ్రమంలో ఉంటూనే డిగ్రీ వరకు చదువుకున్నాడు. బయటికి వచ్చి తన కాళ్ల తను నిలబడాలని, తండ్రి పనిచేసిన కంపెనీలోనే చిన్న ఉద్యోగంలో చేరాడు. రామ్మోహన్‌కి పెళ్లీడు వచ్చింది. తనలాంటి అనాథకే జీవితాన్ని ఇవ్వాలనుకున్నాడు. ఆశ్రమ పాఠశాలలో తనతో పాటు చదువుకున్న అన్నపూర్ణని పెళ్లి చేసుకున్నాడు. వారికి వచ్చే జీతం ఇద్దరు జీవితాలు గడపడానికి సరిపోయేవి. ఆ పరిస్థితిని దాటాలనుకుని, ఇంకా ఏదైనా చేసి సంపాదించాలన్న పట్టుదలతో ఖర్చులు తగ్గించుకోవడం మొదలు పెట్టారు. వేడినీళ్లకి చన్నీళ్లలా భర్తకి సాయపడాలన్న ఉద్దేశంతో ఆశ్రమంలో నేర్చుకున్న బట్టలు కుట్టే పనిని ఆసరాగా చేసుకుని చుట్టుపక్కలవాళ్ల బట్టలు కుట్టడం మొదలు పెట్టింది అన్నపూర్ణ.

పట్టుదల ఉంటే అసాధ్యం సుసాధ్యం అవుతుందని నమ్మాడు రామ్మోహన్. అప్పటి నుంచి పని చేస్తున్న బేకరీ కంపెనీలో ప్రతి విషయాన్ని సునిశితంగా గమనించడం మొదలుపెట్టాడు. సొంతంగా బిజినెస్ చేయగలనని నమ్మకం ఏర్పడగానే చదివిన డిగ్రీ మీద బ్యాంకు లోన్ తీసుకుని అన్నపూర్ణ బేకర్స్ మొదలు పెట్టాడు. మార్కెటింగ్ సూత్రాలను ఆకళింపు చేసుకున్నాడు. అంచెలంచెలుగా ఎదుగుతూ తమ ఉత్పత్తులను ప్రజల్లోకి విజయవంతంగా తీసుకెళ్లగలిగాడు. అనతి కాలంలోనే అన్నపూర్ణ బేకర్స్‌కి అనుబంధంగా హోం మేడ్ చాక్లెట్స్, అగర్‌బత్తీలు తయారు చేసే యూనిట్లను ప్రారంభించాడు. ఆ తర్వాత అప్పడాలు, పచ్చళ్ల వ్యాపారం మొదలుపెట్టాడు. నిజాయితీ, నిబద్ధత ఉంటే కాదేదీ వ్యాపారానికి అనర్హమని నమ్మి, ఎదిగి వ్యాపార సామ్రాజ్యాన్నే సృష్టించిన ఓ మహోన్నత వ్యక్తిని ఆదర్శంగా తీసుకున్నాడు. పలు రకాల వ్యాపారాలు చేస్తూ తన మూలాల్ని మర్చిపోకుండా, మంచి వ్యాపారస్తుడిగా తనని తాను తీర్చిదిద్దుకున్నాడు అన్నపూర్ణ ఇండస్ట్రీస్ అధినేత రామ్మోహన్.

రామ్మోహన్, అన్నపూర్ణలకి శైలజ

ఒక్కతే కూతురు. తాము అనుభవించిన కష్టాలు తమ కూతురికి ఎదురవకూడదని గారాబంగా పెంచారు.

శైలజను ఎం.బీ.ఏ. చదివించాడు. తన వ్యాపారాలకి కాబోయే వారసురాలుగా ప్రకటించాడు. చక్రపాణితో కొంత కాలం కలిసి వ్యాపారం చేశాడు.

క్రమంగా రామ్మోహన్ చేసే దానధర్మాలను, విరాళాల ఖర్చులను ప్రశ్నించడం మొదలు పెట్టాడు చక్రపాణి. ఆ విషయంలో ఇదరి మధ్య తలెత్తిన స్పర్థలు వ్యాపార భాగస్వామ్యానికి అడ్డుగా మారడంతో చక్రపాణి వాటా మొత్తాన్ని ఇచ్చి, సున్నితంగా విడిపోయాడు రామ్మోహన్.

"చెడ్డవాడు చావకూడదు. అతనిలోని చెడు మాత్రమే చావాలి" అని భావించే రామ్మోహన్ చక్రపాణి కుటుంబంతో తొలినాళ్ల స్నేహం ఎప్పట్లాగే నేటికీ కొనసాగిస్తున్నాడు.

చక్రపాణి రెండో కొడుకు యశ్వంత్‌కి ఎలాగైనా శైలజనిచ్చి పెళ్లి చేసి, రామ్మోహన్ ఆస్తికి అధిపతిని చేయాలన్నది చక్రపాణి ఆలోచన. అందులో భాగంగానే పిల్లికి బిచ్చం పెట్టని చక్రపాణి రామ్మోహన్ చేసే సేవా కార్యక్రమాలు, దానధర్మాల వివరాలు ఎప్పటికప్పుడు తెలుసుకుని శైలజ చెవికి చేరవేస్తుంటాడు.

శైలజని, యశ్వంత్‌కిచ్చి పెళ్లి చేయటం రామ్మోహన్ దంపతులకూ ఇష్టమే. ఎందుకంటే యశ్వంత్ అమెరికాలో ఎమ్మెస్ చేసి, ఇండియాలో మంచి ఉద్యోగంలో ఉన్నాడు. ఆ పెళ్లి ప్రస్తావన వచ్చినప్పుడల్లా అవుననీ, కాదనీ చెప్పకుండా దాటేస్తోంది శైలజ.

మెడిసిన్ చదివి ప్రజలకు సేవ చేయాలన్నది శైలజ లక్ష్యం. తన వ్యాపారానికి వారసురాలైన శైలజ చదువులో రూటు మారిస్తే తన తర్వాత వ్యాపారాలను ఎవరు చూస్తారనే దీర్ఘాలోచనతో రామ్మోహన్ శైలజతో ఎం.బీ.ఏ. చదివించాడు. ఆమెకది ఇష్టం లేకపోయినా తండ్రి మీద గౌరవంతో కాదనకుండా అయిష్టంగానే పూర్తి చేసింది. వెంటనే తండ్రి ఆమెను అన్నపూర్ణ ఇండస్ట్రీస్ సీ.ఈ.ఓ. కుర్చీలో కూర్చోబెట్టాడు. తన లక్ష్యానికి భిన్నంగా తను చేస్తున్న పనిలో సంతృప్తి చెందని శైలజకి తన తండ్రి ముందు ఓడిపోయాననే భావన ఆమె మనసులో బలంగా ఏర్పడ్డది. తండ్రి మీద కోపాన్ని ఎలా వ్యక్తీకరించాలో అర్థంకాని శైలజ తండ్రితో మాట్లాడితే కోపంలో ఎక్కడ నోరు జారతానో అనే భయంతో తండ్రితో మాట్లాడటం తగ్గిస్తూ వస్తోంది. కూతురిలో మార్పు గమనించిన రామ్మోహన్ భార్యతో ప్రతిరోజూ ఏదో ఒక సందర్భంలో ఆ విషయం ప్రస్తావిస్తూనే ఉన్నాడు. తండ్రితో కూతురు, కూతురితో తండ్రి మనసు విప్పి మాట్లాడటం తగ్గిపోయింది. ఇద్దరి మనసుల్లో ఏర్పడ్డ అగాథంలో పడి అన్నపూర్ణ నలిగిపోతోంది.

"ఏమంటున్నావు పూర్ణా!" ఆశ్చర్యంగా భార్య వైపు చేసాడు రామ్మోహన్.
"అవును.. మీరు దానితో మాట్లాడండి. దాని ఇష్టాయిష్టాలు ఏంటో తెలుసుకోండి"
"సరే.. నువ్వు వెళ్లి పంపించు, ఇప్పుడే మాట్లాడతాను"
ఐదు నిమిషాల తర్వాత వచ్చిన శైలజ తండ్రి ఎదురుగా కూర్చుని "ఏంటీ డాడీ! మాట్లాడాలన్నారట!"

.........

ఆరోజు రామ్మోహన్‌కి జ్వరం వచ్చి ఇంట్లోనే ఉన్నాడు. సాయంత్రం ఆఫీసు నుంచి వచ్చిన శైలజ హాల్లో కూర్చున్న తండ్రితో ఒక్క మాట కూడా మాట్లాకుండా మేడ మీదున్న తన గదికి వెళుతుంటే అన్వయించుకోలేని రామ్మోహన్ పక్కనే ఉన్న భార్యతో "ఎంత కష్టపడి చదివించింది ఒక్కతే పిల్లని ఎంత గారాబంగా పెంచిందీ.." చెబుతుంటే–

"డాడీ! జ్వరంగా ఉంటే ఆసుపత్రికి వెళ్లండి. దానికీ, నాకూ లింకు పెట్టి ఇలా మాట్లాడటం అవసరమా? ఎవరూ చేయని ఘనకార్యం చేసినట్టు మీరు చెప్పే ఈ మాటలు...." అంటూ తల పట్టుకుని తన గదికి వెళ్లిపోయింది శైలజ.

"చూశావా పూర్ణా! ఎంత కేర్‌లెస్‌గా వెళ్తోందో! మునుపటిలా మాట్లాడి ఎన్ని రోజులైందో తెలుసా? ఏదో హోటల్ రూమ్‌లో ఉన్నట్టు ఆఫీక్‌కి వెళ్తోంది, వస్తోంది, తన గదిలోకి వెళ్తోంది. ఉన్న ఒక్క కూతురు కనీసం మాట కూడా మాట్లాడనంత తప్పేం చేశాను?" అని వాపోయాడు రామ్మోహన్.

"అబ్బ వదిలేయండి! అది చిన్న పిల్ల. కొన్నాళ్లు పోతే అన్నీ అవే సర్దుకుంటాయి. దాని మనసులో ఏముందో? ఏంటో?" అంది అన్నపూర్ణ.

"మనసులో మాట చెప్తేనే కదా తెలిసేది"

"అంటున్నానని ఏమీ అనుకోకండి. అసలు మీరు దాన్ని ఎప్పుడు నోరు తెరవనిచ్చారు? ఎప్పుడూ ఇది చెయ్, అది చెయ్.. ఇది నీకు మంచిది ఎం.బీ.ఏ. చదువు" అంటూ దానికి ఇష్టం లేని చదువులు చదివించారు. చదువు ముగియగానే సీఈఓ సీట్లో కూర్చోబెట్టి అన్నీ నువ్వు చూసుకో, నేనిక రెస్ట్ తీసుకుంటానని, అన్ని నిర్ణయాలూ మీరే తీసుకున్నారు. ఇప్పుడు మీతో మనసు విప్పి మాట్లాడటం లేదంటే ఎలా మాట్లాడుతుంది? కొన్నాళ్లు ఓపిక పట్టండి అదే మాట్లాడుతుంది" అంది అన్నపూర్ణ.

"అంటే నేను చేసింది దాని భవిష్యత్తు బాగుండాలనే కదా! అది తప్పంటావా?"

"కానే కాదు. మీరు వంద శాతం మంచి కోసమే చేశారు. కానీ మీరు చేసింది దానికి నచ్చిందా? లేదా? అని ఎప్పుడైనా అడిగారా? అరటిపండు ఒలిచి నోట్లో పెట్టాను తనే కదా తినాలి అని మీరు అనుకుంటున్నారు. కానీ దానికి అసలు అరటిపండు అంటే ఇష్టమా? కాదా? అని తెలుసుకోలేకపోతున్నారు".

"ఏమంటున్నావు పూర్ణా!" ఆశ్చర్యంగా భార్య వైపు చేసాడు రామ్మోహన్.

"అవును.. మీరు దానితో మాట్లాడండి. దాని ఇష్టాయిష్టాలు ఏంటో తెలుసుకోండి"

"సరే.. నువ్వు వెళ్లి పంపించు, ఇప్పుడే మాట్లాడతాను"

ఐదు నిమిషాల తర్వాత వచ్చిన శైలజ తండ్రి ఎదురుగా కూర్చుని "ఏంటీ డాడీ! మాట్లాడాలన్నారట!"

"చక్రపాణి ఫోన్ చేశాడు"

"ఏంటంట?" అంది సెల్‌ఫోన్ చూస్తూ.

"రేపు యశ్వంత్ బర్త్ డే అట. మనల్ని పార్టీకి రమ్మని పిలిచాడు. నీకు ఫోన్ చేసినట్టు చెప్పాడు".

"అవును.. సాయంత్రం ఆఫీసుకు వచ్చి కూడా చెప్పాడు. సారీ! నాకు దానికంటే ముఖ్యమైన పని ఉంది. మీరు, అమ్మ వెళ్లి రండి డాడీ!"

"యశ్వంత్ నీకు కాబోయే భర్త. నువ్వు రాకుండా ఎలా?"

"కాబోయే భర్తే కానీ ఇంకా కాలేదుగా! అయ్యాక ఇలాంటి ఫార్మాలిటీస్ ఫాలో అవొచ్చులే. మీరెళ్లిరండి"

"శైలూ! ఎందుకులే చిన్న పిల్లవని నువ్వేం చేసినా ఆఖరికి నాతో మాట్లాడకపోయినా ఊరుకున్నాను. ఇది నీ పెళ్లికి సంబంధించిన విషయం. అసలు నీ మనసులో ఏముందో చెప్పు" అన్నాడు.

"నాకు ఇప్పుడే పెళ్లి చేసుకోవాలని లేదు డాడీ!"

"ఇంకెప్పుడు 24 యేళ్లు వచ్చాయి నీకు"

"ఇంకో రెండేళ్ల తర్వాత ఆలోచిద్దాంలే"

"సరే! రెండేళ్ల తర్వాత పెళ్లి చేస్తానని చక్రపాణికి చెప్పమంటావా?"

"రెండేళ్ల తర్వాత పెళ్లికి ఇప్పటినుంచే చెప్పటం ఎందుకు?"

"లేకపోతే.... యశ్వంత్‌కి మరో సంబంధం చూస్తే? అయినా ఈ పెళ్లి విషయంలో నువ్వు ఇంట్రస్ట్ లేనట్టుంటున్నావు. నీ మనసులో వేరే ఎవరైనా ఉన్నారా?"

"అలాంటిదేమీ లేదు"

"మరి ఇంకేంటి ప్రాబ్లం? చక్రపాణి కుటుంబం మనకు బాగా తెలిసినవాళ్లు. నిన్ను కోడలిగా చేసుకోవాలని అనుకుంటున్నారు. వాళ్లనిలా వెయిట్ చేయించడం బాగుండదు. వాళ్లకి అవుననో, కాదనో చెప్పేస్తే బాగుంటుంది. అసలు యశ్వంత్‌ని చేసుకోవడం నీకు ఇష్టమా? కాదా?"

"డాడీ! ప్లీజ్ అర్థం చేసుకోండి. నాకు ఇప్పుడు పెళ్లి చేసుకోవాలని లేదు"

"చూడు శైలూ! నేను మీ అమ్మ, ఆశ్రమంలో పెరిగాం. అష్టకష్టాలు పడి ఈ స్థాయికి వచ్చాం. ఆశ్రమం నడిపే పెద్దల ఆశీర్వాదంతో పెళ్లి చేసుకున్నాం. నీకు అలా కాదు. మేం ఉండగానే పెళ్లి చెయ్యాలని అనుకుంటున్నాం. రేపు మాకు ఏదైనా అయితే నీకంటూ ఎవరూ ఉండరు" అన్నాడు.

"డాడీ! నన్ను ఎమోషనల్ బ్లాక్ మెయిల్ చేయకండి. మీ ఇద్దరికీ ఏమీ కాదు. నన్ను పెళ్లి విషయంలో మాత్రం బలవంతం పెట్టకండి"


**"చక్రపాణి కుటుంబం మనకు బాగా తెలిసినవాళ్లు. నిన్ను కోడలిగా చేసుకోవాలనుకుంటున్నారు. వాళ్లనిలా వెయిట్ చేయించడం బాగుండదు. వాళ్లకి అవుననో, కాదనో చెప్పేస్తే బాగుంటుంది. అసలు యశ్వంత్‌ని చేసుకోవడం నీకు ఇష్టమా? కాదా?"**

**"డాడీ! ప్లీజ్ అర్థం చేసుకోండి. నాకు ఇప్పుడు పెళ్లి చేసుకోవాలని లేదు డాడీ!""**


"ఇంతకంటే అర్థమయ్యేలా నీకు ఎలా చెప్పాలో నాకు తెలియటం లేదు. నాకు, మీ అమ్మకు షుగరు, బీపీ ఉన్నాయి. చక్రపాణి కుటుంబం మంచిది. యశ్వంత్ చదువుకున్నవాడు. మంచి ఉద్యోగం చేస్తున్నాడు. ఈ పెళ్లి జరిగితే ముఖ్యంగా నువ్వు మా కళ్ల ముందు ఉళ్లోనే ఉంటావు. ఆ స్వార్థంతోనే చక్రపాణికి మాటిచ్చాను. నా మాటను కాపాడాల్సిన బాధ్యత నీకుంది" అన్నాడు రామ్మోహన్.

"అందుకని కచ్చితంగా అతన్నే పెళ్లి చేసుకోవాల్సిన రూలేమీ లేదే! అయినా ఎవరిని అడిగి మాటిచ్చారు డాడీ! పెళ్లి చేసుకోబోయే నా అభిప్రాయం తెలుసుకోకుండా మాటెందుకిచ్చారు? మీ మాట కోసం నా జీవితాన్ని నేను నాశనం చేసుకోలేను"

"శైలూ.." అరిచినట్టన్నాడు రామ్మోహన్.

"ఆవేశపడకండి డాడీ! చిన్నప్పటి నుంచి నీకు అది మంచి, ఇది మంచిదంటూ నా అభిప్రాయంతో సంబంధం లేకుండా అన్ని నిర్ణయాలూ మీరే తీసుకున్నారు. ఆ ప్రవాహంలో నా అభిప్రాయాలు, ఆశయాలు, లక్ష్యాలు అన్నీ కొట్టుకుపోయాయి. ఆఖరికి పెళ్లి విషయంలో కూడా నా అభిప్రాయానికి విలువ లేదంటే దీనికి మాత్రం నేను అంగీకరించను"

"శెభాష్.. ఇవాళ ఎందుకు మాట్లాడవు తల్లీ, ఇంట్లో సకల వసతులు, కష్టపడకుండా కోరినంత డబ్బు, కాలు బయట పెడితే కారు, దిగితే కారు... నీకేం మహారాణిలా ఉన్నావు. మాకులా కింది స్థాయి నుంచి వచ్చి ఉంటే నేను చెప్పేది నీకు అర్థం అయ్యేది. తల్లిదండ్రుల విలువేంటో తెలిసేది"

"ఇప్పుడు చెప్తున్నా డాడీ! నాకుమీ ఆస్తిపాస్తులు, వసతులు, వ్యాపారాలు ఇవేమీ అక్కర్లేదు. రేపటి నుండి నేను ఆఫీసుకి వెళ్లటం లేదు. ఎప్పటిలా మీరు కంపెనీ బాధ్యతలు చూసుకోండి. నేను మీకు తగిన కూతుర్ని కాదేమో! మీరు చేసుకోమంటున్న యశ్వంత్ నాకు నచ్చలేదు. మీరు చెప్పినట్టు సీ.ఈ.ఓ. సీట్‌లో కూర్చోవడం నాకు అస్సలు ఇష్టం లేదు. అసలు మీరు వేసిన బాటలో నడవటం నా వల్ల కావడం లేదు. నా కల నెరవేర్చుకునే అవకాశం ఇప్పుడు వచ్చింది. రేపు అందుకోసమే ఓ మీటింగ్‌కు వెళ్తున్నా. ఒకవేళ నా కల నెరవేరకపోయినా ఇంటికి మాత్రం రాను. హాస్టల్లో ఉండి ఏదైనా జాబ్ చేసుకుంటాను. నా మీద నాకు నమ్మకం ఉంది. మీరు వేసిన బాటలో నడుస్తూ నాకు నచ్చిన విధంగా ఉండలేక, నన్ను నేను కోల్పోతూ పరిధి జీవితం గడపటం నా వల్ల కావడం లేదు" అంది.

"లంకంత ఇల్లు పెట్టుకుని హాస్టల్‌కి వెళుతుందట, విన్నావా పూర్ణా?" అన్నాడు ఆవేశంగా.

"వద్దు డాడీ! నేను ఇంకా ఇక్కడే ఉంటే నా మనసుకు నచ్చింది చేయలేక, మీ ఇష్టానికి తగ్గట్టు ఉండలేక నలిగిపోతున్నా! ఈ రెండింటి మధ్య నా జీవితాన్ని ఎలా మలుచుకోవాలో నిర్ణయించుకోలేకపోతున్నా. నేను వెళ్లిపోవడమే మంచిది. గడిచిన నా జీవితంలో వెనక్కు తిరిగి చూసుకుంటే అందులో నేను ఎక్కడా కనిపించడం లేదు".

అంతే! రామ్మోహన్‌కి కన్నీటి బొట్లు రాలాయి. వయసు మీద పడుతున్న కాలంలో ఉన్న ఒక్క కూతురు ఇల్లు వదిలి వెళ్లిపోయిందంటే లోకం ఏమనుకుంటుందో ఆలోచించవా? మమ్మల్ని ఒంటరిగా వదిలి వెళ్లాలనుకుంటున్నావా?" అన్నాడు గాద్గదికంగా.

"ఇకపై నేను మీ కోసమో, లోకం కోసమో జీవించాలనుకోవడం లేదు డాడీ!"

"మరి?!?"

"చూడండి డాడీ! మన మధ్య జనరేషన్ గ్యాప్ కంటే కమ్యూనికేషన్ గ్యాప్ ఎక్కువగా ఉంది. మనసు విప్పి మాట్లాడుకునే అవకాశం ఇవ్వకుండా నిర్ణయాధికారం మీరే తీసుకుంటున్నారు. వయసొచ్చిన పిల్లలు, తల్లిదండ్రులూ స్నేహితుల్లా మెలగాలి. కానీ మన మధ్య స్వేచ్ఛ లేదు.

నా స్వేచ్ఛకి విలువ లేదు. మీ పరిధిలోకి నేను రాలేకపోతున్నానో, లేక నా భావాలు మీకు అర్థం కావడం లేదో తెలియటం లేదు. మీకు సంబంధించినంత వరకూ జీవితం అంటే చదువు, ఉద్యోగం, పెళ్లి, పిల్లలు. ఈ పరిధి జీవితంలో నేను నా పరిమితులు దాటకుండా ఉండటమే మీరు నా నుంచి ఆశిస్తోంది. అది నా వల్ల కావడం లేదు. నేను మెడిసిన్ చదివి మంచి డాక్టరై ప్రజలకు సేవ చేయాలనుకున్నాను. కానీ మీరు మీ వ్యాపారానికి వారసురాలు కావాలని బలవంతంగా ఎం.బీ.ఏ. చదివించారు. ఇవ్వాళ సమాజంలో వైద్యం, విద్య సామాన్యుడిని దగ్గరకు రానివ్వడం లేదు. నా మొదటి లక్ష్యం ఎలాగూ నెరవేరలేదు.

రెండో లక్ష్యం విద్య. ఇప్పుడైనా దానిని నెరవేర్చుకోలేకపోతే నా జీవితానికి అర్థమే ఉండదు. విద్యలో ఎన్నో ఆధునిక పద్ధతులు వచ్చాయి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి అత్యాధునిక సాంకేతిక విద్య పిన్నవయసు నుండే అర్హులైన పేద విద్యార్థులకు ఉచితంగా అందించే ప్రాజెక్టు నా ఫ్రెండ్స్‌తో కలిసి రూపొందించాను. సంవత్సరానికి వేల మంది నిరుద్యోగుల్ని తయారు చేస్తున్న కార్పొరేట్ విద్యావ్యవస్థ కంటే మెరికల్లాంటి పది మందిని ఏ రంగంలోనైనా దూసుకెళ్లగలిగే విద్యా విధానం రాబోయే తరానికి కావాలి. అదే లక్ష్యంతో నా ప్రాజెక్ట్ ప్రపోజల్స్ నచ్చిన అమెరికన్ ఫ్రెండ్స్‌తో రేపు మీటింగు ఉంది. మరో విషయం.. చక్రపాణి మామయ్య మీరు అనుకున్నంత మంచివాడేం కాదు. ఎలాగైనా నన్ను కోడలిగా చేసుకుని మీ ఆస్తికి తన కొడుకుని అధిపతిని చేయాలన్న ప్లాన్‌లో ఉన్నాడు. మీకూ ఈ విషయం తెలుసు. డబ్బుకే విలువ ఇచ్చే ఇంట్లో– మనుషులకి, మనసులకి విలువ ఉంటుందా? మీరే చెప్పండి.. మనసుకు నచ్చింది చేసినప్పుడే జీవితంలో ఎదుగుదలతో పాటు ఆత్మసంతృప్తి ఉంటాయి. అలా కాకుండా ఇతరులు చెప్పినట్టు చేస్తే అక్కడ మనల్ని మనం కోల్పోతాం. నేను మీ ఆస్తికి, కంపెనీలకి వారసురాలుగా ఉండటం కంటే నా మనసుకు నచ్చిన పని చేస్తూ, అందులో వచ్చే నా సంపాదనకి యజమానిగా ఉండటం నాకు సంతృప్తినిచ్చే విషయం. ఎటువంటి సపోర్టు లేకుండా ఆశ్రమ పాఠశాలలో చదువుకుని ఇవాళ్ల పెద్ద బిజినెస్ మెన్‌గా ఎదిగారు మీరు. కానీ నాకు తల్లీ దండ్రీ, డబ్బు, సకల వసతులు ఉన్న నేను ఇంకెంత సాధించగలను? ఎంత ఎత్తుకు ఎదగగలనో ఒక్కసారి ఆలోచించండి. అన్నపూర్ణ ఇండస్ట్రీస్ యజమాని రామ్మోహన్ కూతురు శైలజ అని చెప్పుకునే కంటే దేశంలోనే సరికొత్త విద్యా విధానానికి శ్రీకారం చుట్టి సక్సెస్ అయిన శైలజ తండ్రి రామ్మోహన్ అని అనుకోవటమే నాకూ, మీకూ అసలైన గౌరవం. అందుకే నా పెళ్లికి తొందర పడకుండా నా లక్ష్యం ముందు పట్టాలెక్కనివ్వండి. నా కల సాకారం చేసుకోవడానికి మీరు ఈ సహకారం చేస్తే చాలు. మీరూ, అమ్మ మనస్ఫూర్తిగా నా ఆశయాన్ని గౌరవిస్తేనే ఇంట్లో ఇంటాను. లేదంటే ఇప్పుడే హాస్టల్‌కి వెళ్లిపోతాను" అంది స్థిరంగా.

తన ముందు శైలజ ఇంత గంభీరంగా, స్పష్టంగా మాట్లాడటం మొదటిసారి విన్న రామ్మోహన్ రెండు నిమిషాల తరువాత "శైలూ, ఇంట్లోకి వెళ్లు. ఇకపై నిర్ణయం నీది. నీ మనసుకి నచ్చింది చెయ్యి. మేమిద్దరం నీకు అండగా ఉంటాం" అన్నాడు సంతోషంగా. ✦

# ఏకాంత గృహాలు



అమెరికాలో కారులో ప్రయాణిస్తున్న సమయంలో, కుడివైపుగానీ, ఎడమవైపుగానీ చూస్తే అక్కడక్కడా విసిరి వేసినట్టు విశాలమైన స్థలంలో ఏకాంతంగా పెద్ద గృహం కనిపిస్తూ ఉంటుంది. కొన్ని మైళ్ల దూరంలో ఎక్కడా ఇళ్లు ఉండవు. పౌరుల సంచారం కూడా ఉండదు. అటువంటి ఏకాంత గృహం ఎకరా స్థలంలో ఉంటుంది. అంటే, 4840 చదరపు గజాలు అన్నమాట. ఆ గృహానికి గేటు ఉండదు, సెక్యూరిటీ ఉండదు. గృహం వరకు కారు వెళ్ళడానికి ఒక రోడ్ మాత్రం ఉంటుంది. సాధారణంగా అమెరికాలోని ఇళ్లకు గ్యారేజీలు ఉంటాయి. కనుక కార్లు బయట కనిపించవు. ఎందుకంటే మంచు కురిసే ప్రదేశాల్లో కార్ల నిండా మంచు పేరుకు పోతుంటుంది, వాటిని శుభ్రం చేయడం పెద్ద సమస్య.



ఆ గృహంలో నివసించేవాళ్లు ఆ ఎకరా స్థలంలోని గడ్డిని చదును చేస్తారు. సాధారణంగా వారాంతంలో ఇటువంటి కార్యక్రమం పెట్టుకుంటూ ఉంటారు. చిన్న పిల్లలు తొక్కే సైకిల్ సైజులో చిన్న ట్రాక్టర్ వంటి మిషన్‌తో నడిచే వాహనంపై కూర్చుని డ్రైవ్ చేస్తూ చుట్టూ తిరుగుతూ ఉంటారు. వీలుకాకపోతే గడ్డిని చదును చేసే వ్యక్తులు దొరుకుతారు. ఎప్పుడూ పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకుంటారు.

ఇటువంటి ఏకాంత జీవనాన్ని ఆనందంగా అనుభవించే అమెరికన్ల సంఖ్యకు కొదవలేదు. అయితే తమ భద్రత గురించి వీరికి ఏమాత్రం భయం ఉండదు. కారణం, ప్రతి గృహంలో నివాసితులకు తగిన 'తుపాకులు' ఉంటాయి. గన్ కల్చర్ ఉన్న అమెరికాలో జన సంఖ్యకు సమానంగా తుపాకులు ఉంటూ ఉంటాయి. బహిరంగంగానే వీటిని కొనుగోలు చేయవచ్చు. గృహంలో అలారం ఉంటుంది కనుక ఏమాత్రం భయం లేకుండా హాయిగా నిద్ర పోవచ్చు.

**- పంతంగి శ్రీనివాసరావు**

# సాహితీ విపంచి.. శ్రీశ్రీ

డా॥ అక్కిరాజు రమాపతిరావు

అవే శబ్దాలు. అవే అర్థాలు. ఎప్పటినుంచో ఉంటున్నవి ఉంటాయి. కానీ కొందరి వేళ్లు, నోళ్ల ద్వారానే అవి మంజీర నాదాలు పలుకుతాయి. రణన్నినాదాలు సృష్టిస్తాయి. వేణుగానాలు, మేఘ నిస్వనాలు వినిపిస్తాయి. దేవులపల్లి కృష్ణశాస్త్రి ప్రతి శబ్దానికి రంగు, రుచి, వాసన ఉంటాయని తెలుసుకోవటమే శబ్ద విద్య అన్నారు. శబ్దార్థ రహస్యాలు తెలిసిన గొప్ప నేర్పరిగా ఆధునిక తెలుగు సాహిత్యంలో మహాకవిగా శ్రీశ్రీ అగ్రగణ్యుడు.

1934 ఏప్రిల్ 12వ తేదీన 'మరో ప్రపంచం' అనే శీర్షికతో ఒక వ్యాసం రాయాలని కాగితం మీద కలం పెట్టానని, కలంలో సిరా లేకపోవడం గుర్తించలేదనీ, మళ్లా సిరా నింపే విలంబనం ఓర్వలేక, ఉద్వేగం ఆపుకోలేక కాపీయింగ్ పెన్సిల్‌తో రాయడం మొదలు పెట్టానని శ్రీశ్రీ ఒక ప్రస్తావనలో అన్నారు. అది వ్యాసం కాకుండా గేయంగా, రెండు నిమిషాలలో 'పదండి ముందుకు' అని ప్రారంభమై హోమజ్వాలల భుగ భుగలుగా ముగిసిందన్నారు. మరుసటి రోజు దాన్ని స్ఫుటాక్షరంగా రాసి నాటి ప్రముఖ సాహిత్య పత్రికకు పంపగా ఈ చేత్తో అందుకున్న వెంటనే మరో చేత్తో ఆ సంపాదకులు తిప్పి పంపారని శ్రీశ్రీ అన్నారు.

ఆ తర్వాత మూడేళ్లకు శీర్షిక పేరు 'మహా ప్రస్థానం'గా జ్వాలపత్రికలో ప్రచురింపబడినట్టు తెలుస్తోంది. 'ఆరంభం పెద్ద అవస్థ' అన్న వ్యాసంలో శ్రీశ్రీ తన కవిత్వ తపన, తపస్సు గురించి చెప్పుకొన్నారు. తాను సంప్రదాయ విధ్వంసకుణ్ణి లేదా విద్వేషినని ఆయన ఎప్పుడూ చెప్పుకోలేదు. ఈ వ్యాసంలో ఆచార్య శంకర భగవత్పాదులవారి శబ్ద లయ విన్యాసం తనని ఆకట్టుకుందని చెప్పారు. శంకర భగవత్పాదులనీ, ఆచార్య శంకరులని ప్రస్తావించడం శ్రీశ్రీ గొప్ప సంస్కార వ్యక్తిత్వాన్ని తెలియచేస్తోంది. అదే విధంగా జయదేవుడి గీత గోవిందం తన మరో ప్రపంచంలోని కొన్ని చరణాలకు శాబ్దిక ప్రేరణ కలిగించిందని అన్నారు. తనకు తిక్కన సోమయాజి ఎంతో ఇష్టులని, ఆయన పద్యాలను, ముఖ్యంగా హరిహరినాథ తత్త్వాన్ని ఆవిష్కరించే ఆశ్వాసాంత పద్యాలను ఉదహరించాడు. తన రచనపై పూర్వ కవుల కవితా సంగీత ప్రభావం గురించి చెబుతూ పద్యంలో కవిత్వం ఎటువంటి సవ్వడి చేస్తున్నదో చూడండి అని అన్నాడు. ఇంకా యూరప్ కవులు, ముఖ్యంగా ఫ్రెంచ్ కవుల ప్రభావం కూడా తనపై ఉందని వాళ్ల పంక్తులను ఉదహరించాడు. ఆ వ్యాసం ఆకాశవాణి ద్వారా ప్రసారితమై, తిరుమల రామచంద్రగారి సంపాదకత్వంలో వచ్చిన పరిశోధన పత్రికలో 1952లో వెలుగు చూసింది.

శ్రీశ్రీ అత్యంత శిశు స్వభావి. సరళ హృదయుడు. స్నేహమనస్వి. స్నిగ్ధ వచస్కుడు. 1960లో మొట్టమొదటి అఖిలభారత స్థాయి హైదరాబాద్ మహాసభలలో అతిసామాన్య వ్యక్తిత్వంతో అందరితో కలసి మెలసి వ్యవహరించిన



తీరుతెన్నులు నేను మరిచిపోలేను. 1960లో విద్యార్థి ఔత్సాహికులు 'సెవెన్ స్టార్స్ సిండికేట్' (నక్షత్ర సప్తకం) ఒక సాహితీ సంస్థ స్థాపించుకున్నారు. ఒక పత్రిక నడపాలని, శ్రీశ్రీ ఎందుకో హైదరాబాద్ వచ్చినప్పుడు శాండిల్య, జగన్నాథం ప్రభృతులైన యువకులు సంరంభంగా వెళ్లి ఆయనను కలుసుకొని, తమ పత్రిక తెలుగు సాహిత్యాన్ని పదహారణాల నవీకరించబోతున్నదని ఆ కాలంలో స్రష్ట, ద్రష్ట, సాహిత్యాచార్యులైన మీరు ఆ పత్రికకు పేరు సూచించాలని కోరారు. అప్పుడు శ్రీశ్రీ 'సుషుమ్న' అని పేరు సూచించాడు. ఈ సుషమ్న సంగతి తెలియాలంటే పరశురామపంతుల గురుమూర్తి లింగమూర్తి విరచితమైన సీతారామాంజనేయ సంవాదం చదవాలి. ఆయనకో నమస్కారం పెట్టి 'నవత' అని పేరు పెట్టుకొన్నారు. మరొకసారి రాజమహేంద్రవరంలో ఒక సత్కార సభలో, కవికొండల వెంకటరావు రచన 'శివరాత్రి ప్రభ', 'గడ్డిపూలు' లయ తరంగితంగా శ్రీశ్రీ గానం చేసాడు. ఒకసారి కందుకూరి వీరేశలింగం పంతులుగారి రాజమండ్రి స్మారక గృహంలో అమాంతంగా, వీరేశలింగం తన రోజులలో కూర్చుని రాసుకొన్న గదిలో ఆపాదమస్తకంగా బోర్లా పడుకొని గది అంతా పొర్లుతూ దండాలు పెట్టిన ముగ్ధ స్నిగ్ధ భావోద్విగ్న హృదయుడు శ్రీశ్రీ.

"ఒకటి మాత్రం నిశ్చయం. 1933లో 'నేను సైతం ప్రపంచాగ్నికి' ఇత్యాది గీతంతో ప్రారంభించి కడసారిగా గ్రాంథిక శైలికి, గణబద్ధచ్ఛందస్సులకీ గుడ్ బై కొట్టేసాను. ఇదే మహాకవి గురజాడ అడుగుజాడ" అన్నాడు శ్రీశ్రీ.

తెలుగులో కావ్య వస్తువులో, దర్శనంలో, అభివ్యక్తిలో పూర్తి కొత్తదనాన్ని సాధించిన ప్రజ్ఞాశాలి శ్రీశ్రీ. మాటలో, పాటలో, మనసులో, బాటలో 'అనురణనం' సాధించాడు. అభ్యుదయ, విప్లవ కవితా ప్రవర్తకునిగా ఆద్యుడు, అగ్రేసరునిగా శబ్దం మీద ఆయన సాధించిన అధికారత, మరే తెలుగుకవికి లేదనడం అతిశయోక్తి కాదు. సమాజంలో అనాది నుంచి పీడిత, తాడిత జనావళి పక్షాన కలం పట్టి ఆకాశపుదారులంట హడావిడిగా వెళ్లిపోయే జగన్నాథ రథ చక్ర ప్రళయ ఘోష భూమార్గం పట్టించారు. 20వ శతాబ్ది తెలుగు కవితను విప్లవ మార్గం తొక్కించిన అద్వితీయ విప్లవ కవితా చైతన్య మూర్తిగా శ్రీశ్రీ చిరఃస్మరణీయులు.

('పరివర్ధిత మన మాణిక్యాలు ప్రతిభామూర్తులు' నుంచి..)

**మ**నం ఒక గృహ నిర్మాణం చేసేటప్పుడు గృహానికి చుట్టుపక్కల కూడా కొంత ఖాళీ స్థలం వదలవలసి వస్తుంది. ప్రత్యేకించి పశ్చిమ, దక్షిణ దిక్కులకి కొంత ఖాళీ స్థలం తప్పకుండా వదలాలి. అది వాస్తుశాస్త్రంలో నియమం. తక్కువలో తక్కువ పశ్చిమానికి అంటే- ఇంటికి పశ్చిమంలో ఉన్న కాంపౌండ్ వాల్‌కి మధ్యలో మూడు, నాలుగు అడుగులు ఖాళీ స్థలం వదలాలి.


**వాస్తువార్త**

వాస్తు విద్వాన్ సాయిశ్రీ

డా॥ దంతూరి పండరినాథ్

3-2-4, కింగ్స్‌వే, సికింద్రాబాద్

సెల్స్: 9885446501/9885449458




# 'పిశాచ స్థలాలు' అంటే?

దక్షిణంలో ఇంటికి ప్రహరీ గోడకి మధ్యలో కనీసం మూడు, నాలుగు అడుగులు ఖాళీ స్థలం వదలాలి. ఈ విధంగా వదిలి ఇల్లు కట్టుకోవడం వల్ల ఇంట్లోకి గాలీ, వెలుతురు చక్కగా ప్రసరిస్తాయి. పశ్చిమానికి ఎంత ఖాళీ స్థలం వదిలామో, అంతకు రెట్టింపు ఖాళీ స్థలం ఇంటికి తూర్పున వదలాలి. ఇంటికి దక్షిణాన ఎంత ఖాళీ స్థలం వదిలామో, అంతకు రెట్టింపు ఖాళీ స్థలం ఇంటికి ఉత్తరానికి వదిలి పెట్టాలన్నది వాస్తు శాస్త్రంలో ఉన్న నియమం. కొంతమంది పశ్చిమానికి, దక్షిణానికి ఖాళీ స్థలాలు వదిలేయకుండా కాంపౌండ్ వాల్ మీదనే గృహ నిర్మాణం చేస్తారు. అప్పుడు ఏమవుతుందంటే- ఆ ఇంటికి పశ్చిమానికి, దక్షిణానికి వెంటిలేటర్స్ కానీ కిటికీలు కానీ పెట్టుకోవడం కుదరదు. ఎందుకంటే అది ఇతరుల స్థలంలోకి ఓపెన్ అవుతాయి. వాళ్లు ఆబ్జెక్ట్ చేస్తారు. వెంటిలేటర్లు, కిటికీలు పెట్టనివ్వరు. అలాంటప్పుడు ఏమవుతుంది? ఇంటి లోపలికి గాలి, వెలుతురులను తీసుకొచ్చే వెంటిలేటర్స్, కిటికీ లేకపోవడం వలన లోపలికి ఫ్రెష్ ఎయిర్ రాదు. ఇంటికి తూర్పుకి, ఉత్తరానికి తలుపులు, కిటికీలు పెట్టుకున్నా, అది ఒక 'క్రాస్ వెంటిలేషన్' అవుతుంది తప్ప 'పర్ఫెక్ట్ వెంటిలేషన్' కాదు. పశ్చిమానికి, దక్షిణానికి గాలి సరిగ్గా సరఫరా కాదు. దీనివల్ల ఏమవుతుందంటే పాత గాలి అక్కడ అలాగే ఉంటుంది. క్రాస్ వెంటిలేషన్‌లో చాలా తక్కువ గాలి బయటకు పోతుంది. కానీ పశ్చిమానికి దక్షిణానికి వెంటిలేటర్లు, కిటికీలు లేకపోవడం వలన గాలి ఆ దిక్కుల్లో చలనం లేకుండా స్తంభించి ఉంటుంది. మరొక విధంగా చెప్పాలంటే- ప్రవాహం లేని నీటిలాగా నిలిచి ఉంటుంది. ప్రవాహం లేని నీరు ఏ విధంగా విషపూరితమో అలాగే స్తంభించిపోయి ఉన్న గాలి విషపూరితమవుతుంది. మనం పశ్చిమానికి, దక్షిణానికి సాధారణంగా బెడ్రూమ్స్, బాత్రూమ్స్ నిర్మాణం చేస్తూ ఉంటాం. బాత్రూమ్స్‌లోకి వెంటిలేటర్లు, బెడ్రూమ్స్ లోపలికి కిటికీలు లేకపోవడం వలన చెడుగాలి అంటే కార్బన్ డై ఆక్సైడ్ ఎక్కువ జమ అయిపోతూ ఉంటుంది. అలా దుర్గంధం కూడా తయారవుతూ ఉంటుంది. బెడ్ రూమ్స్‌లో రాత్రి దాదాపు 8, 10 గంటలు నిద్రపోతాం. అలా నిద్రపోతూ మనం వదిలేసే కార్బన్ డై ఆక్సైడ్ గది నిండా నిండిపోతుంది. ఆ గాలి బయటికి పోవటం, కొత్త గాలి గది లోపలికి రావటం నిరోధించబడింది కనుక కార్బన్ డై ఆక్సైడ్ రోజు రోజుకీ గాఢతరం అవుతూ ఉంటుంది.

అలాగే దుర్గంధం కూడా! అందుకే రాత్రిళ్లు పడుకున్నప్పుడు ఈ కార్బన్ డై ఆక్సైడ్ రక్తంతో కలిసి, మెదడు మీద ప్రభావం చూపించడం వల్ల ఆందోళనకరమైనటువంటి కలలు రావడం, భయంకరమైన కలలు రావడం జరుగుతుంది. వీటి వల్ల 'ప్రతిరోజూ లేదా రాత్రి రాత్రి నిద్రలో ఇలా అవుతుంది' అనే ఒక మానసిక వేదనకు గురి కావటం తప్పనిసరి అవుతుంది. 'కార్బన్ డై ఆక్సైడ్‌ని, ఇంట్లో ఉన్నప్పుడు నిరంతరం పీలుస్తూ ఉండటం చేత ఈ సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయి, ఇంకా అనేక ప్రతికూల ఫలితాలు కలుగుతున్నాయి' అన్న విషయం మనం గమనించం.

ఇటువంటి పరిస్థితుల్లో అనారోగ్యం కలగటం, ఆత్మవిశ్వాసం కోల్పోవటం గమనించవచ్చు. నెగెటివ్ టైప్ ఆలోచనలు ఎక్కువ వస్తూ ఉంటాయి. నిద్ర పోతున్నప్పుడు ఎవరో గుండెల మీద కూర్చున్నట్టు బరువు పెట్టినట్టు... లాంటి ఫీలింగ్స్ కూడా రావచ్చు. ఇంకా తీవ్రమైన ప్రతికూల పరిస్థితుల్లో మంచం మీద నుండి దొర్లి కింద పడిపోవడం, అలా ఎందుకు పడిపోయామో తెలియక ఆందోళనం చెందటం...

(మిగతా 27వ పేజీలో..)

వాస్తువిద్వాన్ డా॥ దంతూరి పండరినాథ్ పాఠకుల సమస్యలకు ఆదివారం 'వాస్తువార్త'లో సమాధానాలిస్తారు. ఈ కింది కూపన్ జతచేసి సమస్యలు పంపవలసిన చిరునామా: సాయిశ్రీ వాస్తు కన్సల్టెన్సీ, 3-2-4, కింగ్స్‌వే, రాష్ట్రపతి రోడ్, సికిందరాబాద్-3

**వాస్తువార్త**

పూర్తి పేరు..........................................................

పుట్టినతేదీ : ...................... ఊరు : .................

జన్మ నక్షత్రం: ...............తల్లి పేరు: ....................

చిరునామా: ..........................................................



# 'అభిజ్ఞ' అంటే?

కస్తూరి మురళీకృష్ణ



**అది వారణాసిలో బ్రహ్మదత్తుడు రాజ్యం చేస్తున్న కాలం. ఆ కాలంలో బోధిసత్త్వుడు బ్రాహ్మణ కులంలో జన్మించాడు. తక్షశిలలో సమస్త విద్యలను అభ్యసించాడు.**

విద్యాభ్యాసం పూర్తయిన తరువాత ప్రవ్రజించాడు. హిమాలయాలకు వెళ్లాడు. అభిజ్ఞులను, సమాపత్తులను పొందాడు.

'అభిజ్ఞ' అంటే ధ్యానం ద్వారా పొందే అద్భుతమైన శక్తులు. ఈ శక్తుల వల్ల ఎంత దూరమైనా ప్రయోగించగలరు. ఏ రూపమైనా ధరించగలరు. ఏదైనా చూడగలరు, వినగలరు. ఎదుటి మనిషి మనసులో మాటను గ్రహించగలరు. ఇలాంటి శక్తులను అభిజ్ఞ అంటారు.

'సమాపత్తి' అంటే తపస్సు ద్వారా యోగులు అందుకునే అత్యున్నత స్థాయి. ఈ స్థితిలో యోగులు తమ దృష్టిని తీవ్రంగా కేంద్రీకరించగలరు. ఆధ్యాత్మిక అనుభవాలను పొందగలరు.

ఈ రెండు బోధిసత్త్వుడు అందుకున్నాడన్నమాట.

అతడు ధ్యానంలో నిమగ్నుడయ్యాడు అందమైన హిమాలయ ప్రాంతాలలో.

అతడు ప్రజలు ఆయనను ఆదరించారు. భక్తిశ్రద్ధలతో కొలిచారు. అతని కోసం కుటీరాన్ని నిర్మించి, అతడికి కావాల్సిన వస్తువులన్నీ సమకూర్చారు.

ఆ గ్రామంలో ఓ బోయవాడు ఉండేవాడు. అతడు తన పెంపుడు పిట్టకు రకరకాల పిట్టల ధ్వనులను నేర్పాడు ఆ పిట్టను అడవిలోకి తీసుకువెళ్లి రకరకాల ధ్వనులు చేయించేవాడు.

పిట్ట కూతలకు ఆకర్షితులై అనేక పిట్టలు అక్కడికి వచ్చేవి. వాటిని అతడు పట్టుకునేవాడు. అలా జీవితం సాగించేవాడు.

ఇదంతా చూస్తున్న పిట్టలో పశ్చాత్తాపం మొదలయింది. "వీడు నాకు రకరకాల మాటలు నేర్పించి, నా ద్వారా ఇతర పిట్టలను పట్టుకుని చంపుతున్నాడు. ఎన్నో పిట్టలను చంపటంలో నేను సహాయపడ్డాను. నా అంత పాపాత్ములు ఇంకొకరు ఉండరు. పిట్టలను చంపటం వాడికి జీవిక. నాకు గొప్ప పాపం" అని ఆలోచించింది. ఒకరోజు కూయటం మానేసింది.

అది బోయవాడికి కోపం తెప్పించింది.

"ఎందుకు కూయవు? కూయి" అని అరిచాడు.

పిట్ట మౌనంగా ఉంది.

కోపం పట్టలేక గట్టి పుల్ల తీసుకుని దాని నెత్తిన కొట్టటం ప్రారంభించాడు.

అది బాధ భరించలేక ఏడుస్తూ కూసింది. ఆ కూత విని పిట్టలు వచ్చాయి.

వెంటనే బోయవాడు వాటిని పట్టుకున్నాడు. ఈ రకంగా అయిష్టంగానే రోజూ దెబ్బలు తింటూ పిట్ట కూసేది. బోయవాడు పిట్టలను పట్టుకునేవాడు.

అయిష్టంగా, తప్పనిసరి పరిస్థితులలో ఏడుస్తూ కూస్తున్నా పిట్ట మనసులో నేరభావన పోవటం లేదు.

"నేను ధ్వని చేయకపోతే, ఇతర పిట్టలు రావు. అవి రాకపోతే నాకు పాపం అంటదు. నేను ఇష్టం లేకున్నా కూస్తున్నందుకే అవి వస్తున్నాయి. కాబట్టి పాపం నాకు వస్తుంది. ఈ పాప నివృత్తి ఎలా?" అని అది బాధపడసాగింది.

అప్పటి నుంచీ తనకు సంశయ నివృత్తి ఎవరు తొలగిస్తారోనని ఎదురు చూడసాగింది పిట్ట.

ఒకరోజు బోయవాడు, పిట్టను బుట్టలో పెట్టి బోధిసత్త్వుడి ఆశ్రమంలోకి వెళ్లాడు నీళ్లు తాగేందుకు.

లోపలికి వెళ్తూ "ఈ పంజరాన్ని చూస్తుండండి" అని బోధిసత్త్వుడికి చెప్పి, పంజరాన్ని ఆయనకు దగ్గరగా ఉంచాడు.

పిట్ట ఎదురు చూస్తున్న అవకాశం లభించింది.

"ఈయన తపస్వి, ఈయనకు మంచి-చెడ్డలు తెలుస్తాయి. పాప, పుణ్యాల గురించి పరిజ్ఞానం ఉంటుంది. ఇతడిని అడిగితే నాకు ఇష్టం లేకుండానే నేను చేస్తున్న పని వల్ల నాకు పాపం అంటుతుందా? లేదా? తెలుస్తుంది" అనుకుంది.

పంజరంలో నుంచే బోధిసత్త్వుడిని ఉద్దేశించి పలికింది.

"నాకు ఇష్టం లేకున్నా నా వల్ల అనేక పిట్టలు ఈ బోయవాడికి దొరకటంలో నేను తోడ్పడాల్సి వస్తోంది. నాకు పాపం అంటుతుందా?"

పిట్ట ప్రశ్న విన్న బోధిసత్త్వుడు చిరునవ్వుతో "నీ మనస్సులో పాపకర్మ చేయాలని లేదు. నీ మనస్సు పరిశుద్ధం. కానీ పరిస్థితులు నీతో అలా చేయిస్తున్నాయి. నీ మనస్సులో మాలిన్యం లేనంతవరకూ నీకు ఎలాంటి పాపం అంటదు" అని సమాధానమిచ్చాడు.

"కానీ నా వల్ల ఎన్నో పిట్టలు ప్రాణాలు కోల్పోతున్నాయి కదా?"

"నీ మనస్సు కలుషితం కాదు. నీకు వాటిని చంపాలని లేదు. వాటిని తినాలని లేదు. వాటిని చంపటం వల్ల నీకు లాభం లేదు. దుష్ట కార్యం చేయటంలో నీకు ఉత్సాహం లేదు కాబట్టి నీకు పాపం అంటదు".

బోధిసత్త్వుడి మాటలతో ఆ పిట్టకు ఉన్న సంశయం తొలగిపోయింది.

అంతలో బోయవాడు వచ్చి బోధిసత్త్వుడికి కృతజ్ఞతలు తెలిపి, పంజరాన్ని తీసుకుని వెళ్లిపోయాడు.

కథ ముగిస్తూ శాస్త చెప్పాడు "ఆ సమయంలో పంజరంలోని పిట్ట రాహులుడు. దాని సంశయం తీర్చిన తపస్విని నేనే!"

.......

అది శాస్త జేతవనంలో విహరిస్తున్న కాలం.

ఆ కాలంలో, భిక్షువుల కోరిక మేరకు ఒక గృహస్థు గురించిన గాథను చెప్పాడు బుద్ధుడు.

.......

ఆ గృహస్థు పన్నులు వసూలు చేసుకునేందుకు భార్యతో కలిసి గ్రామానికి వెళ్లాడు. తాను వసూలు చేసిన ధనమంతా తనకు పరిచయమున్న గృహస్తు ఇంట్లో ఉంచాడు. శ్రావస్తి వెళ్లే దారిలో అతడికి ఓ గుట్ట కనబడింది.

అప్పుడు అతని భార్య అడిగింది "స్వామీ.. ఈ గుట్ట వెనుక ఒకవేళ బంగారంగా మారిపోతే దాన్లో కొంత బంగారం నాకు ఇస్తారా?"

"నీకెందుకు ఇస్తాను? నేను ఇయ్యను" అన్నాడు.

అతడి కఠిన హృదయం ఆమెకు అర్థమయింది. వాళ్లు ప్రయాణిస్తూ జేతవనం చేరారు.

విహారం లోపలకు వెళ్లారు. నీళ్ల తాగారు.

ఆ సమయంలో శాస్త గంధకుటీరం వసారాలో కూర్చుని ఉన్నాడు.

ఆ దంపతులను చూడగానే వారికి ధ్యాన ఫలం లభిస్తుందని ఆయన గ్రహించాడు.

వారు శాస్తను దర్శించుకుని, ప్రణామాలు చేశారు. ఆయన పక్కనే కూర్చున్నారు. కుశల ప్రశ్నలయిన తరువాత శాస్త వారిని అడిగాడు.



**"ఎక్కడి నుంచి వస్తున్నారు?"**
**"గ్రామంలో వసూళ్ల కోసం వచ్చాను"**
**శాస్త భార్య వైపు తిరిగాడు.**
**"అమ్మా.. నీ భర్త నీ మంచి కోరతాడనిపిస్తోందా?"**

"ఎక్కడి నుంచి వస్తున్నారు?"

"గ్రామంలో వసూళ్ల కోసం వచ్చాను"

శాస్త భార్య వైపు తిరిగాడు.

"అమ్మా.. నీ భర్త నీ మంచి కోరతాడనిపిస్తుందా?"

"నాకు ఈయన అంటే ప్రేమ ఉంది. కానీ ఈయనకు నా మీద ప్రేమ ఉన్నట్టు అనిపించదు. దారిలో ఒక కొండ కనిపించింది. ఇది బంగారు కొండగా మారితే దాన్లో బంగారం నాకేమైనా ఇస్తారా?" అని అడిగాను.

"ఏమీ ఇవ్వనన్నారు. కఠిన హృదయుడు" అందామె.

"నీ భర్త మాట వరసకు అలా అన్నాడు. కానీ నువ్వంటే అతనికి ఇష్టం. నీ గుణగణాలు గుర్తుకు వచ్చినప్పుడు తన మొత్తం ఐశ్వర్యం నీకు ఇస్తాడు. ఇది గత జన్మలో కూడా జరిగింది" అన్నాడు.

వారిద్దరికే కాదు, చుట్టూ ఉన్న బౌద్ధ భిక్షువులలో కూడా ఆ గత జన్మ గాథను తెలుసుకోవాలని కుతూహలం కలిగింది.

"గత జన్మలో కూడా ఇలాగే జరిగిందా? ఏం జరిగింది? తెలుసుకోవాలని కుతూహలంగా ఉంది" అడిగిందామె.

శాస్త ఆమె భర్త వైపు చూశాడు.

అతడు ఆసక్తి చూపలేదు.

కానీ ఇతర భిక్షువులంతా ముక్తకంఠంతో అడిగారు.

"మాకు గత జన్మగాథ తెలుసుకోవాలని ఉంది. ఎలాగ అంటే ఏమీ పట్టనట్టుండే ఆమె భర్త, ఆమె గుణం గ్రహించిన తరువాత ఐశ్వర్యం అంతా ఆమెకు ఎలా ఇచ్చాడో తెలుసుకోవాలని ఉంది" అన్నారు.

శాస్త చిరునవ్వు నవ్వాడు.

"ఏమీ లేని కొండ బంగారు కొండ అయితే అని ఊహిస్తే, ఆ ఊహలో కూడా ఆమెకు ఏమీ ఇవ్వనివాడు, సమస్త ఐశ్వర్యాన్ని ఆమెకు ఇచ్చిన గాథ తెలుసుకోవాలని ఉంది" అన్నారు.

వారి అభ్యర్థనను మన్నించి శాస్త గత జన్మగాథ చెప్పటం ప్రారంభించాడు.

(25వ పేజీ తరువాయి..)

## పిశాచ స్థలాలు అంటే?

ఇలాంటి భయాల చేత ఆ ఇంట్లో ఏదో ఉంది.. అది దయ్యమో, పిశాచమో అనుకోవటం.. ఇలా మొదలవుతుంది. దాంతో రకరకాల వైద్యుల దగ్గరికి పోతారు. మందులు తీసుకుంటారు. ఒక్కోసారి వాటి వలన సైడ్ ఎఫెక్ట్స్ మొదలైపోతుంటాయి.

అసలు కారణమేమిటంటే– పశ్చిమానికి, దక్షిణానికి వాస్తు శాస్త్రంలో చెప్పబడినట్టుగా ఖాళీ స్థలాలు వదలకపోవటమే!

ఎప్పుడైతే ఇలా ఖాళీ స్థలాలు వదలకుండా మనం ఇంటిని నిర్మాణం చేస్తామో, అప్పుడు ఈ ఖాళీ స్థలాలు ఇంటి నిర్మాణం లోపలికి వచ్చేస్తాయి. వదలవలసిన ఖాళీ స్థలం వదలకుండా ఇంటి లోపలికి తీసుకొని, నిర్మించుకున్న ఇల్లు 'పిశాచ స్థలాన్ని కలుపుకొని కట్టుకున్న ఇల్లు' అవుతుంది. ఈ విధంగా ఒక వాస్తుదోషం మొదలవుతుంది. అంతేకానీ, పిశాచం అంటే మనం వ్యవహారికంగా అనుకునే దయ్యం, పిశాచం... లాంటివి కాదండి. ఇవి ఫీలింగ్స్. అంతే! ఎప్పుడైతే వదలవలసిన ఇలాంటి ఖాళీ స్థలాలు వదలకుండా మనం ఇంటిని నిర్మాణం చేస్తామో, అప్పుడు ఈ దోషంచేత అనేక రకాల శారీరక, మానసిక అనారోగ్య సమస్యలు వస్తాయి.

వాటికి ఒక కారణంగా మనం ఒక విశ్లేషణలో 'పిశాచ స్థలం' అని చెప్పాం. ఇంకా చెప్పాలంటే గాలీ, వెలుతురులను సరిగ్గా రానీయకుండా ఇల్లు కట్టుకున్నాం కనుక ఇలాంటి సమస్యలను ఎదుర్కోవలసి వచ్చింది. అందుకని ఎప్పుడైనా ఇల్లు కట్టుకునేటప్పుడు, స్థలం కలిసి వస్తుంది కదా అని, ఇంకేదో అనుకొని ఇలా పూర్తి సరిహద్దుల మీద ఇల్లు కట్టుకొని కిటికీలు, వెంటిలేటర్స్ లేకుండా చేసుకోవద్దు. కిటికీలు, వెంటిలేటర్స్ తప్పనిసరిగా పెట్టుకోవాలి. కావలసినంత స్థలం వదిలిపెట్టాలి. ఫ్రెష్ గాలి ఇంట్లోకి వస్తూ, పోతూ ఉండటం చేత అనేక రకాల అనారోగ్య సమస్యలు రాకుండా నిరోధించబడతాయి.

# మర్యాద ఇచ్చి పుచ్చుకోవాలి

యామిజాల జగదీశ్

**"ఈరోజు ప్రపంచంలో పలు సమస్యలకు మూలకారణం ఏమిటో తెలుసా?" అని అడిగాడు ఒకడు.**

**"తెలీదు.. నువ్వే చెప్పు" అన్నాను.**

**"ఏముందండీ, ఒక మనిసిని మనిషిగా చూసే తత్త్వం లేకపోవడమే. మర్యాద ఇచ్చిపుచ్చుకోవడమనేది చాలా మందికి తెలీదు. అహం పెరిగిపోయింది. దాంతో సమస్యలు తలెత్తుతున్నాయి. డబ్బుతో లభించని ఉత్సాహం, మర్యాద మనిషిని మనిషిగా చూడటం వల్ల లభిస్తుంది" అన్నాడతను.**

అందుకు టాల్‌స్టాయ్ జీవితంలో జరిగిన ఓ సంఘటనను అతను ప్రస్తావించాడు.

ఓమారు టాల్‌స్టాయ్ మాస్కో నగరంలో ఓ రహదారిలో నడుచుకుంటూ పోతున్నారు. అప్పుడు ఎదురుగా ఓ బిచ్చగాడు వస్తున్నాడు.

"అయ్యా, ధర్మం చెయ్యండి బాబూ" అని అడిగాడు ఆ బిచ్చగాడు.

టాల్‌స్టాయ్‌ది జాలిమనసు. ఏ మనిషినైనా ఎంతో అభిమానంతో చూసేవారు. ఎంతో ప్రియంగా పలకరించేవారు. మాటల్లో ఓ మంచి మనసుండేది. అవతలి వ్యక్తి చిన్నవారా? పెద్దవారా? అని చూసేవారు కాదు. తగిన మర్యాద ఇచ్చేవారు.

ఆ బిచ్చగాడికి ఏదన్నా ఇవ్వాలనుకున్నారు. తన చొక్కా జేబులో చేయి పెట్టారు. కానీ జేబులో చిల్లిగవ్వ లేదు.

వెంటనే బిచ్చగాడి వంక చూసి "తమ్ముడూ, జేబులో డబ్బుల్లేవు" అన్నారు టాల్‌స్టాయ్.

అయితే అర్థాకలితో ఉన్న ఆ బిచ్చగాడి ముఖం సంతోషంతో విప్పారింది.

"అయ్యా, మీరు బిచ్చం వేయకపోయినా పరవాలేదండి. ఇప్పుడు నా మనసు నిండుగా తృప్తిగా ఉంది. ఆనందంగా ఉందండీ" అన్నాడు బిచ్చగాడు.

టాల్‌స్టాయ్‌కి ఆశ్చర్యం వేసింది. తాను డబ్బుల్లేవని చెప్పినా ఈ మనిషి ఆనందిస్తున్నాడేమిటా? అని అనుకున్నారు. ఆయన ఆ బిచ్చగాడి ముఖంలోకి చూసాడు. అవును, బిచ్చగాడి ముఖంలో ఆనందం కనిపిస్తోంది.

బిచ్చగాడు "అయ్యా, మీరు చిల్లరపైసలు ఇవ్వకపోయినా పరవాలేదండీ. అంతకు మించి ఓ పెద్ద సహాయం మీరు చేశారు. అదేమిటని అనుకుంటున్నారా? నన్ను తమ్ముడూ అని పిలిచారు. అది చాలండీ" అన్నాడు.

"నా వంక చూడటానికి ఏమాత్రం ఇష్టపడనివారు, బిచ్చమడుగుతున్నానని నన్ను చిన్న చూపు చూసేవారున్న ఈ ప్రపంచంలో నన్నూ ఓ మనిషిగా అనుకుని తమ్ముడూ అని పిలవడం ఎంతో ఆనందంగా ఉందండీ" అన్నాడు బిచ్చగాడు. అతనికి టాల్‌స్టాయ్ పట్ల గౌరవం పెరిగింది.

కేవలం డబ్బుతో పొందని ఆనందం, ఉత్సాహం సాటి మనిషిని ఓ మనిషిగా చూసి గౌరవించి మాట్లాడటం వల్ల కలుగుతాయనడానికి ఈ సంఘటన ఓ ఉదాహరణ.

టాల్‌స్టాయ్‌లాగా మనకూ ఆ గుణం కలగాలంటే ఏం చేయాలి?

ఏముందీ..

రోజూ కాస్సేపయినా మన గురించి మనం ఆలోచించడం మాని ఇవతలకు వచ్చి ఇతరుల హృదయంలో చోటు సంపాదించి వారి కళ్లల్లోంచి ఈ లోకాన్ని చూడాలి. అందుకు తగిన ప్రయత్నం చేయాలి. సాటి మనిషిని మనిషిగా చూడగలిగే తత్త్వం ముఖ్యం.

అలా చూసినవారు చాలా మందే ఉన్నారు. కానీ మనం తెలుసుకోం.

ఓమారు లుడ్విగ్ ఫిలిప్ ఆల్బర్ట్ స్వీట్జర్ అమెరికా వెళ్లారు. అప్పుడు ఆయన దగ్గర చదువుకున్న విద్యార్థులలో ఒకడు ఆయనను కలిశాడు. తనతో హోటలుకి రావాలని అడిగాడు ఆ పూర్వ విద్యార్థి. ఆయన కోసం ఓ స్పెషల్ కేకు ఆర్డరిచ్చి తెప్పించాడు. తనతో కేకు కట్ చేయించే ముందర స్వీట్జర్ ఆ గదిలో ఎందరు ఉన్నారో లెక్క పెట్టారు. ఆ సమయంలో అక్కడ తొమ్మిది మంది ఉన్నారు. కానీ ఆయన పది ముక్కలు కోసారు.

ఉన్నది తొమ్మిది మందే కదా ఉన్నారు. ఆయన పది ముక్కలు ఎందుకు కట్ చేసారా? అని కొందరు ఆలోచించారు.

అప్పుడు స్వీట్జర్ చెప్పారు... "ఎంతో ప్రియంగా ఈ కేకుని తీసుకు వచ్చిన ఆ సర్వరుకే ఆ పదో ముక్క" అన్నారు.

ఇదే మంచి మనసంటే. ఓ మనిషి మరొక మనిషిని మనిషిగా చూడటం అన్నది ఎంతో ముఖ్యం. మర్యాద ఇవ్వాలి, మర్యాద పొందాలి. ఇతరులకు గౌరవం ఇస్తే మనకు గౌరవం లభిస్తుంది. మర్యాద ఇచ్చి పుచ్చుకోవటం ఉత్తమం.

**"అయ్యా, మీరు బిచ్చం వేయకపోయినా పరవాలేదండి. ఇప్పుడు నా మనసు నిండుగా తృప్తిగా ఉంది. ఆనందంగా ఉందండీ" అన్నాడు బిచ్చగాడు.**



డా॥ పులివర్తి కృష్ణమూర్తి

# ప్రాణమే బ్రహ్మ

**భృగుమహర్షి వరుణ మహర్షి కుమారుడు. విద్యాభ్యాసం పూర్తి చేసుకుని తండ్రిని బ్రహ్మోపదేశం చేయమని కోరాడు.**

**తండ్రి తపస్సు చేయమన్నాడు. ఆ విధంగానే చేసి ప్రాణం బ్రహ్మ అని తెలుసుకున్నాడు. లోకంలోని సమస్త జీవరాసులూ ప్రాణం వల్లనే జీవిస్తున్నాయి, రక్షింపబడుతున్నాయి.**

ప్రాణం పోయినప్పుడు మృత్యువులో లీనమైపోతున్నాయి. ప్రాణమే సర్వసృష్టికీ మూలాధారం. మన ఉపనిషత్తుల్లో ఒక కథ వుంది.

పూర్వ కాలంలో ఒకసారి ఇంద్రియాలన్నీ తమలో తాము పోట్లాడుకోవటం మొదలు పెట్టాయి. ఎవరు గొప్ప? అనే విషయంలో వాటికి వాదనలు వచ్చాయి. ఎంతకూ ఆ వాదన తెగలేదు. దాంతో అవి ఒక నిర్ణయానికి వచ్చాయి. తమకు జన్మనిచ్చిన ప్రజాపతి దగ్గరకు వెళ్లి, "మాలో ఎవరు గొప్ప? చెప్పండి" అన్నారు.

ఇంద్రియాల మాటలు విన్న ప్రజాపతి "మీ అందరికీ ఒక ఉపాయం చెబుతాను, వినండి" అన్నారు.


"మీలో ఏది లేకపోతే ఈ శరీరం పనికి రాకుండా పోతుందో, అది అన్నిటికన్నా శ్రేష్ఠమైనది. ఇక మీరందరూ విడివిడిగా సంవత్సరం పాటు ఈ శరీరాన్ని విడిచిపెట్టి వెళ్లండి.. అప్పుడు తెలుస్తుంది" అని చెప్పి పంపాడు.

మొదటగా వాక్కు శరీరం నుంచి నిష్క్రమించింది. ఒక సంవత్సరం పాటు శరీరానికి దూరంగా వుండి వచ్చి, మిగిలిన ఇంద్రియాలను అడిగింది "నేను లేనప్పుడు మీరు ఎలా జీవించి ఉండగలిగారు? అని.

"నువ్వు వెళ్లినందువల్ల శరీరానికి పెద్ద నష్టం ఏమీ జరగలేదు. కేవలం మాటలు రాలేదుగానీ మిగిలిన శరీరం యథాతథంగా పని చేసింది. కళ్లు చూస్తూనే ఉన్నాయి. చెవులు వింటూనే వున్నాయి. మనసు ఆలోచిస్తూనే వుంది. అన్ని పనులూ సాగిపోయాయి. పసిపిల్లవాడికి మాటలు రావు కదా! మూగవాడు జీవించడం లేదా? అలాగే శరీరం జీవించే ఉంది" అన్ని మిగిలిన ఇంద్రియాలు అన్నాయి.

ఆ మాటలు విన్న వాక్కు మారు మాట్లాడకుండా శరీరంలో ప్రవేశించింది.

తర్వాత దృష్టి శరీరం నుండి నిష్క్రమించింది. సంవత్సరం తర్వాత తిరిగివచ్చి "తను లేకపోవడం వలన శరీరం ఎలా ఉంది?" అని అడిగింది.



మిగిలిన అవయవాలు "నువ్వు లేకపోతే చెప్పుకోదగ్గ ఇబ్బంది ఏమీ కలగలేదు. ఈ శరీరం బతికే వుంది. కేవలం చూడలేకపోయింది. అయితే ఏం? గుడ్డివాడు బతకడం లేదా? అలాగే శరీరం జీవించి వుంది".

దృష్టి ఏమీ మాట్లాడకుండా దృష్టి శరీరంలోకి ప్రవేశించింది.

తర్వాత శ్రవణశక్తి శరీరాన్ని విడిచి వెళ్లిపోయి, ఒక సంవత్సరం తర్వాత తిరిగివచ్చి "నేను లేకపోతే శరీరం ఎలా వుంది?" అని అడిగింది.

దానికి మిగిలిన అవయవాలు "నువ్వు లేకపోతే వచ్చిన నష్టం ఏమీ పెద్దగా లేదు. చెవిటివాడు బతకడం లేదా? చెవులు పని చెయ్యలేదు. అంతేగానీ మిగిలిన శరీరమంతా బాగానే వుంది" అన్నాయి.

ఏమీ మాట్లాడకుండా శ్రవణం శరీరంలో ప్రవేశించింది. తర్వాత మనస్సు వంతు వచ్చింది. అది కూడా శరీరం నుండి నిష్క్రమించి, సంవత్సరం తర్వాత తిరిగి వచ్చి నేను లేకపోతే ఈ శరీరం ఎలా వుంది?" అని అడిగింది.

దానికి ఇంద్రియాలు "నువ్వు లేకపోయినా ఏమీ పెద్దగా నష్టం రాలేదు. మిగిలిన అవయవాలు బాగానే పని చేస్తున్నాయి. అయితే కేవలం ఆలోచన మాత్రం లేకపోయింది. అయితే మాత్రం ఏం? పసిపిల్లవాడికి మనసుండదు కదా! అతడు జీవించడం లేదా? పిచ్చివాడు ఆలోచించలేడు. అతడు జీవించడం లేదా? పిచ్చివాడు ఆలోచించలేడు. అతడు జీవించడం లేదా? అలాగే ఈ శరీరం వున్నది" అన్నాయి. మనస్సు కూడా మారు మాట్లాడకుండా శరీరంలో ప్రవేశించింది.

ఇక ప్రాణం బయటకు పోవడానికి సిద్ధంగా ఉన్నది. ఆ సమయంలో తనకు ఇంద్రియాలతో వున్న బంధాన్ని తుంచి పారేస్తున్నట్లనిపించింది. శరీరానికి ఊపిరి అందడం కష్టమవుతోంది. కళ్లు కనిపించడం మానేస్తున్నాయి. కాళ్లూ, చేతులూ కదలడం మానేస్తున్నాయి. శరీరం గాలిలో తేలిపోతున్నట్లనిపించింది. దాంతో ఇంద్రియాలకు భయం పట్టుకున్నది. అప్పుడు ఇంద్రియాలన్నీ ప్రాణం చుట్టూ చేరాయి. ప్రాణమా, నువ్వు మాత్రం శరీరం నుండి బయటకు వెళ్లకు. నువ్వు లేకపోతే వరీరం చచ్చిపోతుంది. అప్పుడు మేమంతా ఉపయోగం లేకుండా పోతాం. మా అందరిలోకి నువ్వే శ్రేష్ఠుడివి. ఈ మాటను మేమంతా అంగీకరిస్తున్నాం. నువ్వు ఇక్కడే శరీరంలో వుండి మమ్మల్ని జీవింపచెయ్యి" అని వేడుకున్నాయి.

ఈ విధంగా ఇంద్రియాలన్నీ ప్రాణం లేకపోతే తమకు ఉనికి లేదు.. అని అంగీకరించాయి.

వాక్కు, చక్షువు, శోత్రము అన్నీ ప్రాణవంతమైతేనే పని చేస్తాయి. కనుక అవి అన్నీ ప్రాణం అనే సంకేతంతోనే పిలువబడతాయి. అంటే ప్రాణం లేకుండా ఇంద్రియాలకు స్వేచ్ఛ లేదు. ఆలోచిస్తే ప్రాణమే ఇన్ని రూపాలుగా మారింది.. అని చెప్పుకోవాల్సి వుంది. ప్రాణమే బ్రహ్మ.



# వారఫలం

శ్రీమతి ములుగు శివజ్యోతి, ప్రముఖ జ్యోతిష్కురాలు
నారాయణ నాయక్ కాంప్లెక్స్, 2వ అంతస్తు,
గాంధీ జ్ఞానమందిర్ వెనుక, కోఠి, హైదరాబాద్-1
ఫోన్: 9849453449, 9440927795

## మేషం



నూతన ఉద్యోగ ప్రయత్నాలు కలిసి వస్తాయి. వివాహాది విషయ వ్యవహారాలు ఫలిస్తాయి. నూతన గృహోపకరణాలను కొనుగోలు చేస్తారు. కుటుంబ వైద్యుడిని మార్చాలన్న ఆలోచనలు వస్తాయి. శ్రీ ఆంజనేయ స్వామివారి ఆలయంలో హనుమాన్ సింధూరంతో అర్చన జరిపించి నుదుట ఆ బొట్టు ధరించండి. ఆరోగ్య విషయంలో జాగ్రత్తలు పాటించండి.

## వృషభం



కోర్టు వ్యవహారాలు, తీర్పులు మిశ్రమంగా ఉంటాయి. ప్రయోజనాలు దక్కుతాయా? లేదా? అన్న ఆందోళన కలిగి ఉంటారు. కొన్ని సందర్భాలలో నిజాలు మాట్లాడుకోలేని పరిస్థితులు నెలకొంటాయి. మహా పాశుపత కంకణం ధరించండి. ఎదురు చూస్తున్న ఉద్యోగం లభిస్తుంది. నూతన వ్యాపారం కోసం చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి. ప్రస్తుత వ్యాపారాన్ని విస్తరిస్తారు.

## మిథునం



పెట్టుబడులకు సంబంధించిన విషయాలు, వ్యవహారాలు మనస్ఫూర్తిని కలిగిస్తాయి. మీకు భాషా పరిజ్ఞానం లేదని, కొన్ని అంశాల పట్ల మీకు అవగాహన లేదని కొంత మంది చులకన చేసే అవకాశాలున్నాయి. నూతన విద్యల పట్ల ఆసక్తి కలిగి వుంటారు. నేర్చుకునే అవకాశాలు కలిసి వస్తాయి. ప్రతిరోజు దేవీ దేవతలకు ప్రథమ తాంబూలం సమర్పించండి.

## కర్కాటకం



ఎవరి మీదా ఆధారపడకుండా మీరు తీసుకునే నిర్ణయాలు మేలు చేస్తాయి. జీవిత భాగస్వామి సలహాలు, సూచనలు మీకు అక్కరకు వస్తాయి. వృత్తి రీత్యా స్వల్ప ఒడిదుడుకులు ఏర్పడతాయి. సుమంగళి పసుపుతో గౌరీదేవి అమ్మవారి అష్టోత్తరం చదువుతూ అర్చన చేయండి. క్రయ-విక్రయాలు లాభసాటిగా సాగుతాయి. విలువైన వస్తువులు, వస్త్రాలు కొనుగోలు చేస్తారు.

## సింహం



విలువైన బహుమతులు ఇవ్వాలన్న ఆలోచనలు ముడిపడతాయి. రెన్యువల్స్ కోసం దరఖాస్తులు దాఖలు చేస్తారు. కళ్లకు చక్రాలు కట్టుకొని మరీ పని చేస్తారు. మన పిల్లలకి ప్రయోజనాలు దక్కాలని భావిస్తారు. శుభ వార్తలు వింటారు. ఇంట్లో, వ్యాపార ప్రదేశాల్లో సాంబ్రాణి, దైవికం పొడితో ధూపం వేయండి. విదేశాల్లో వున్నవారికి సొంత ఇంటి కల నెరవేరుతుంది.

## కన్య



వాహనాల కొనుగోలు, అమ్మకాల వ్యవహారాలు అనుకూలంగా ఉంటాయి. భూ సంబంధిత లావాదేవీలు లాభిస్తాయి. అష్టమూలికా తైలం, లక్ష్మీతామర వత్తులతో దీపారాధన చేయండి. పూజల్లో నాగబంధం కుంకుమను ఉపయోగించండి. వాతావరణ మార్పుల వల్ల ఆరోగ్య సమస్యలు ఎదురవుతాయి. కొన్ని రోజులు ఉద్యోగానికి తాత్కాలికంగా సెలవు తీసుకుంటారు.

## తుల



ఆధ్యాత్మిక కార్యక్రమాల పట్ల ఆకర్షణ కలిగి వుంటారు. కుక్కలకు, జీవరాసులకు తాగునీటి వసతి కల్పించండి. రహస్య మార్గాల ద్వారా ఆదాయం సమకూర్చుకోవడం కోసం చేసే ప్రయత్నాలు కలిసి వస్తాయి. స్నేహితుల ద్వారా నూతన వ్యాపారాలకు పెట్టుబడులను అందిస్తారు. బంధువులతో సమస్యలు వచ్చే సూచనలున్నాయి. ఇంట్లో, వ్యాపార ప్రదేశంలో సాంబ్రాణి, దైవికం పొడితో ధూపం వేయండి, నరదృష్టి తొలగిపోతుంది.

## వృశ్చికం



ఆధ్యాత్మిక కార్యక్రమాల పట్ల ఆకర్షణ కలిగి వుంటారు. కుక్కలకు, జీవరాసులకు మంచనీళ్లను పెట్టండి. రహస్య మార్గాల ద్వారా ఆదాయం సమకూర్చుకోవడం కోసం చేసే ప్రయత్నాలు కలిసి వస్తాయి. ఇంట్లో, వ్యాపార ప్రదేశాల్లో సాంబ్రాణి, దైవికం పొడితో ధూపం వేయండి. నరదృష్టి తొలగిపోతుంది. స్నేహితుల ద్వారా నూతన వ్యాపారాలకు పెట్టుబడులను అందిస్తారు. బంధువులతో సమస్యలు ఏర్పడతాయి.

## ధనుస్సు



పోటీ పరీక్షల్లో పాల్గొంటారు. గణితం విద్య, వైద్య, ప్రభుత్వ ఉద్యోగం కోసం రాసే పరీక్షల్లో విజయం సాధిస్తారు. పరపతి, పలుకుబడి కలిగిన వ్యక్తులతో పరిచయాలు ఏర్పడతాయి. నూతన ఉద్యోగ అవకాశాల కోసం చేసే దరఖాస్తులు, ఇంటర్వ్యూ ఫలిస్తాయి. పూజలలో ఆరావళి కుంకుమను ఉపయోగించండి. అష్టమూలికా తైలం, లక్ష్మీతామర వత్తులతో దీపారాధన చేయండి. క్రీడాకారులకు అనుకూలం.

## మకరం



కొత్త ఆలోచనలు, ప్రణాళికలు రూపొందిస్తారు. మీ ప్రతిభా పాటవాలను వెలుగులోకి తీసుకువస్తారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలు, సంఘసేవా కార్యక్రమాల పట్ల ఆకర్షణ కలిగి వుంటారు. దీర్ఘకాలిక సమస్యల నుండి బయట పడడానికి చేసే ప్రయత్నాలు కలిసి వస్తాయి. జిల్లేడు వత్తులు, అష్టమూలికా తైలంతో దీపారాధన చేయండి. ఆటంకాలన్నీ తొలగిపోతాయి. కొన్ని సందర్భాలలో నిజాలు మాట్లాడుకోలేని పరిస్థితి నెలకొంటుంది.

## కుంభం




కొత్త కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. సహోద్యోగులతో భేదాభిప్రాయాలు చోటు చేసుకుంటాయి. మీ మానసిక స్థితిని అర్థం చేసుకోగలిగినవారు ఎవరనేది తెలుసుకుంటారు. నరదృష్టి అధికంగా ఉంటుంది. సుమంగళి పసుపుతో గౌరీదేవి అమ్మవారి అష్టోత్తరం చదువుతూ అర్చన చేయండి. సాంకేతిక విద్యలపై ఆసక్తి చూపుతారు.


## మీనం




విదేశీయాన ప్రయత్నాలు, విదేశాలలో ఉద్యోగం కోసం చేసే ప్రయత్నాలు బాగుంటాయి. పరపతి కలిగిన వారితో పరిచయాలు మేలు చేకూరుస్తాయి. సిద్ధగంధంతో శ్రీ వేంకటేశ్వర స్వామివారిని పూజించండి. లలిత కళలలో ప్రావీణ్యం పొందడానికి శిక్షణా తరగతులలో చేరతారు. మంచి మధ్యవర్తిగా వ్యవహరించి ఇరు వర్గాల మధ్యన సఖ్యత చేకూరుస్తారు. జీవితాన్ని కొత్త కోణంలో చూస్తారు.

# ఈ వారం కా 'ర్టూన్స్'


ఎవరు కాల్చినా..
ఇద్దరి ఫ్లాట్స్ ముందు కాల్చినట్లే కదా...!!
మొన్నటి బాణసంచా ఖర్చులో సగం
మీరు ఇవ్వాల్సిందే అంకుల్...!!!
401
402


షాంపిక్ సరుకు వద్దయ్యా.. పోలీసులు
పట్టుకుంటారు.. చీప్ లిక్కర్ పోయండి..!!


SALES & PROFIT
పోటీ కంపనీ ఓనర్ ను వేసేద్దాం... సుపారీ ఎవరికి
ఇవ్వాలో టెండర్లు పిలవండి అంటున్నాడు బాస్...!!







పిల్లుల ఫొటోలు కూడా  ఓ వింతేనా అని ఆశ్చర్యపోకండి. జపాన్‌లోని తాషిరోజిమా  అనే ద్వీపంలోని చిత్రాలివి.  ఇది పిల్లుల ద్వీపం. జపాన్‌లో పిల్లులను అదృష్టానికి సూచికగా భావిస్తారు. ఇక్కడి జనాభా కంటే పిల్లుల సంఖ్యే ఎక్కువగా ఉంటుందట.  ఇక్కడ హోటళ్లు కూడా పిల్లుల ఆకారంలో వుండటం మరో విశేషం.







